www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


సంపుటి 09, సంచిక: 342 | శుక్రవారం | 13-11-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



రాజీవ్ గాంధీ సివిల్స్ 'అభయహస్తం'తో సత్ఫలితాలు

అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు

12



ప్రజాకవి కాళోజీ నారాయణరావు
24వ వర్ధంతి నేడు

09.09.1914 - 13.11.2002

హడావుడి నిర్ణయాలు వద్దు

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయొద్దు

ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి




03

ప్రపంచ ప్రగతిశీల శక్తులకు

హైదరాబాద్ వేదిక

- రెండు రోజుల పాటు హెచ్ఐసిసిలో అంతర్జాతీయ సదస్సు
- 'భారత్ సమ్మిట్–2026'లో అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం, వాతావరణ మార్పులపై చర్చలు
- 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధుల హాజరు
- నవంబర్ 14న ముగింపు సభకు ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ



బెంగళూరులో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సిఎం డికె శివకుమార్‌తో భట్టి విక్రమార్క భేటీ : భారత్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో / హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న మితవాద రాజకీయాలు, ప్రజాస్వామ్య విలువలకు ఎదురవుతున్న సవాళ్లకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించేందుకు ప్రపంచ ప్రగతిశీల శక్తుల సమీకరణకు హైదరాబాద్ వేదిక కానుంది. 'భారత్ సమ్మిట్–2026' ఈ నెల13, 14 తేదీలలో హెచ్ఐసిసిలో రెండో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల ఐక్యత, అలీనోద్యమ తరువాయి 8లో

భారత్ సమ్మిట్‌కు బయలుదేరేముందు

నార్వే జర్నలిస్టుకు అనుమతి నిరాకరణ

గతంలో మోదీని ప్రశ్నించిన హెలె లింగ్



హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు బయలుదేరే ముందు తనకు అనుమతి నిరాకరించినట్లు నార్వే జర్నలిస్ట్ హెలె లింగ్ స్వెం డ్రెన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన పరిపాలన, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలపై తాను చేసిన విమర్శలు, సిజెపి ఉద్యమంపై తన అభిప్రాయాల కారణంగానే చివరి నిమిషం లో వీసా రద్దు జరిగిందా అని ఆమె ప్రశ్నించారు. తనకు భారతదేశ పర్యటనకు వీసా మంజూరైందని, బుధవారమే బయలుదేరాల్సి తరువాయి 8లో

డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ !

2/3 మెజారిటీకి హోంమంత్రి అమిత్ షా పావులు



- రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు ప్రణాళికలు
- బిల్లు కచ్చితంగా 15 నుంచి 18 ఓట్ల మెజారిటీతో నెగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా
- 'షా' బుల్డోజర్ గతంలో పనిచేయలేదు, ఇకపై కూడా పనిచేయదు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయసభలు 90 రోజులు దాటినా ప్రొరోగ్ చేయకపోవడంపై కొనసాగుతున్న ఉత్కంఠ వీడే సమయం ఆసన్నమైనట్లు కనిపిస్తోంది. 2/3 మెజారిటీ కోసమే ఇన్ని రోజులు సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయడం లేదని ఇండియా కూటమి పార్టీలు లేవనెత్తిన అనుమానాలు నిజమయ్యేలా కనిపస్తున్నాయి. మెజారిటీ కోసం అమిత్ షా పవులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అయితే ఈ బిల్లు 15 నుండి 18 ఓట్ల మెజారిటీతో తరువాయి 8లో

'కపట మాటలు, ఆర్భాటాల మాంత్రికుడు' అమిత్ షా : కాంగ్రెస్

పార్లమెంటులో 15-18 ఓట్ల తేడాతో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేస్తానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన, ఆయన తన 'డీలిమిటేషన్ నాటకాన్ని' పునరుద్ధరిస్తోందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. ఆయనను 'కపట మాటలు, ఆర్భాటాల మాంత్రికుడు' అని అభివర్ణించింది. గతంలోనూ డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేయడానికి షా ప్రయత్నించారని, కానీ లోక్‌సభలో ఘోర పరాజయం చవిచూశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. షా 'బుల్డోజర్' గతంలో పనిచేయలేదని, ఇకపై కూడా పనిచేయదని ఆయన స్పష్టం చేశారు. హోం మంత్రి గురువారం కొందరు పాత్రికేయు లతో అనధికారికంగా మాట్లాడుతూ 'డీలిమిటేషన్ ప్లాంటేషన్' అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారు. త్వరలో 3 రోజుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, బిల్లులను 15-18 ఓట్ల తేడాతో ఆమోదిస్తామని ఆయన ఈ మధ్యాహ్నం వారితో అన్నారు. 'ఏడు నెలల క్రితం కూడా ఆయన ఇదే మాట చెప్పారు, కానీ ఏప్రిల్ 17న లోక్‌సభలో 50కి పైగా ఓట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూశారు' అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన బడాయి మాటలు, ఆర్భాటాలు చేయడంలో ఆరితేరినవారు అని, అతని బుల్డోజర్ అప్పుడు పనిచేయలేదు, ఇకపై కూడా పనిచేయదు అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.



రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల ఎదుట

కాంట్రాక్టు కార్మికుల ధర్నా

- శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కనీస వేతనాలు రూ.20 వేలకు పెంచాలని, పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు వెంటనే అమలు చేయాలని డిమాండ్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో / హైదరాబాద్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, చట్టం ప్రకారం పండగ, జాతీయ, ఆర్జిత సెలవులను అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని, సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. 'తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)' రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆస్పత్రుల ముందు ధర్నాలు నిర్వహించింది. పిలుపులో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో గురువారం జరిగిన ధర్నాలో నరసింహ పాల్గొని, మాట్లాడారు. ఆసుపత్రుల కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కాంట్రాక్ట్ టెండర్ కాల పరిమితి ముగిసి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పాత కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తూ, కార్మికులకు అతి తక్కువ జీతాలను చెల్లిస్తున్నారని దుయ్యబట్టారు. తక్షణమే కొత్త టెండర్లను ఆహ్వానించి, కనీస వేత న చట్టం తరువాయి 12లో

ఇక రాష్ట్ర రైతులకు తెలుగులో ఎఐ సలహాలు



- 'భారత్ విస్తార్' సేవలు ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు..
- వ్యవసాయ శాఖ–ఎన్ఐఎస్‌జి మధ్య అవగాహన ఒప్పందం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

తెలంగాణ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ సలహాలను ఇకపై తెలుగులోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎఐ ఆధారిత జాతీయ వ్యవసాయ డిజిటల్ వేదిక 'భారత్ విస్తార్'తో తెలంగాణను అనుసంధానించేందుకు వ్యవసాయ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ (ఎన్ఐఎస్‌జి) మధ్య గురువారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో సచివాలయంలో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎఐ సాంకేతికతతో రైతులకు అవసరమైన సమయంలో శాస్త్రీయ సలహాలు అందించి సాగు ఖర్చు తగ్గించడంతోపాటు దిగుబడులు, ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, పంటల రకం, మార్కెట్ ధరలను విశ్లేషించి రైతులకు తగిన సూచనలు అందించనున్నట్లు చెప్పారు. చీడపీడలు, తరువాయి 12లో



రాష్ట్రంలో 21 మంది ఐపిఎస్‌ల బదిలీ


- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ భగవత్
- ఫైర్ డిజిగా విసి సజ్జనార్
- మహిళా భద్రతా విభాగం డిజిపిగా సౌమ్య మిశ్రా
- జైళ్ల శాఖ డిజిపిగా స్వాతి లక్రా
- ఆర్‌టిసి ఎండిగా అనిల్ కుమార్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో / హైదరాబాద్

తెలంగాణ పోలీసు శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో బదిలీలు, పదోన్నతులకు సమానమైన అదనపు బాధ్యతల కేటాయింపులు చేపట్టింది. మొత్తం 21 మంది ఐపిఎస్ అధికారుల స్థానాల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టుతో పాటు మహిళా భద్రత, జైళ్లు, అవినీతి నిరోధక శాఖ, ఆపరేషన్స్, రవాణా, ట్రాఫిక్ విభాగాల్లో మార్పులు తరువాయి 8లో

ఎన్విడియాకు హువాంగ్ రాజీనామా

తాత్కాలిక సిఇఒగా కోలెట్ క్రెస్



హాంగ్‌కాంగ్: ప్రపంచంలోనే అతిపెద్ద టెక్ దిగ్గజం ఎన్విడి యా సిఇఒ జాన్సెన్ హువాంగ్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో తాత్కాలిక సిఇఒగా కోలెట్ క్రెస్‌ను నియమించారు. ప్రస్తుతం ఆమె ఎన్విడియాలో కార్యనిర్వాహక ఉపాధ్యక్షురాలుగా, చీఫ్ ఫైన్సాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.చైనా గూఢచారిగా అమెరికా ము ద్ర వేసిన అలిస్ హువాంగ్‌తో జాన్సెన్ హువాంగ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని బహిర్గతమైన తర్వాత సిఇఒ పదవి నుండి వైదొలగాల్సిందిగా తరువాయి 8లో

'సబ్ చంగా సీ'.. 'సబ్ మెహంగా సీ' అయింది

నిత్యావసర ధరల పెరుగుదలపై కాంగ్రెస్ విమర్శలు

మోదీ విధానాలపై జైరామ్ రమేశ్ వ్యంగ్య వ్యాఖ్యలు


07

రూ. 7 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తా

- 'ఆప్' జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ ముఠా బెదిరింపు • పోలీసులకు ఫిర్యాదు చేసిన పార్టీ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్

రాష్ట్ర రాజకీయాలకు కేంద్రంగా సిద్ధిపేట

- నేడు పార్టీ కార్యాలయానికి టిఆర్ఎస్ చీఫ్ కవిత శంకుస్థాపన
- 19న ఇందిరా బీమా పథకాన్ని ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- సిద్ధిపేటలో వేడెక్కుతున్న రాజకీయాలు



సిఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/ సిద్ధిపేట

రాష్ట్ర రాజకీయాలు ఇప్పుడు సిద్ధిపేట వైపు చూస్తున్నాయి. తెలంగాణ ఉద్యమానికి పురిటగడ్డగా ఉన్న సిద్ధిపేట కేంద్రంగా అన్ని పార్టీలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. నవంబర్ నెలలో వారం వ్యవధిలోనే టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట కవిత, సిఎం రేవంత్‌రెడ్డి ఇరు పార్టీలకు చెందిన కీలక నేతలు సిద్ధిపేటలో పర్యటించనుండటంతో జిల్లా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బిఆర్ఎస్ పార్టీకి బలంగా ఉన్న సిద్ధిపేటలో ఇరుపార్టీల పర్యటనల నేపథ్యంతో రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం సిద్ధిపేటలో పర్యటించనున్నారు. సిద్ధిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించనున్న టిఆర్ఎస్ భవన్‌కు శంకుస్థాపన చేయనున్నారు. కవిత పర్యటన నేపథ్యంలో టిఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. పార్టీ కార్యాలయ భూమి పూజ కార్యక్రమాన్ని పార్టీ బలోపేతానికి సంకేతంగా తరువాయి 12లో

‘10+2’ పై స్పష్టత అవసరం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో 10+2 విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు విద్యాశాఖను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. దీంతో ఐదున్నర దశాబ్దాలకు పైగా కొనసాగిన ఇంటర్ మీడియెట్ విద్యా విధానానికి ముగింపు కార్డు పడనుంది. ఇకపై పాఠశాలల్లోనే పదవ తరగతి తరువాత 11, 12 తరగతులు ఉండబోతున్నాయి. అలాగే ప్రస్తుతం ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యా విధానంలో కూడా మార్పులు చోటు చేసుకోనున్నాయి. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్య, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇది ఆక స్మికంగా వచ్చిపడిన నిర్ణయమేమి కాదు. గత విద్యా సంవత్సరంలోనే అమలు చేయాలని భావించినప్పటికీ, సమయం తక్కువ ఉండటంతో 2027–28 సంవత్స రానికి వాయిదాపడింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలోనే రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళీ నేతృత్వంలో విద్య కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ అన్ని కోణాలలో పరిశీలన చేసి, కింది నుంచి యానివర్సిటీ స్థాయి వరకు విద్యా వ్యవస్థలో మార్పులను సిఫార్సు చేస్తూ సమగ్ర నివేదికను ముఖ్య మంత్రికి అందజేసింది. అందులో ఇంటర్‌ను రద్దు చేసి, 10 +2 విధానాన్ని తీసు కురావాలని ప్రతిపాదన తీసుకువచ్చింది. దానిని ప్రయోగాత్మకంగా రంగారెడ్డి జిల్లా ఆరుట్ల అనే గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాలలో మార్పులు తీసుకువచ్చి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను కమిషన్ విజయవంతంగా నడిపి చూపింది. విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు నేతృత్వంలో అధ్యయన కమిటీ వేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి) రాష్ట్రంలో అన్వయంపై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రెండు, మూడు కార్పొరేట్ కాలేజీలు ఇంటర్మీడియెట్ విద్యా వ్యవస్థను తమ గుప్పిట్లో తీసుకొని, వేల కోట్ల వ్యాపారం చేస్తున్నాయి. అవి బోర్డునే శాసించే స్థాయికి ఎదిగాయి. తాజాగా ప్లస్ టూ విధానాన్ని అమలు తీసుకురావాలనే నిర్ణయంతో కొంత వరకు వాటి ఆధిప త్యానికి అడ్డుకట్ట పడవచ్చని భావిస్తున్నారు. ఇది తొందరపాటే కావొచ్చు. వచ్చే ఏడాది నుంచి 10+2 విధానం వస్తుందని తెలిసినప్పటికీ, ఆ కార్పొరేట్ విద్యా సంస్థలు నెల రోజుల క్రితం నుంచే తమ పాఠశాలల్లో చదువుకుంటున్న పదవ తర గతి విద్యార్థులను వచ్చే ఏడాది తమ సంస్థ కాలేజీల్లోనే ఇంటర్మీడియెట్‌లో చేర్చు కునేందుకు అడ్మిషన్‌ల అడ్వాన్స్ బుకింగ్‌లు మొదలెట్టేశాయి. ఇది వారి ధీమాను తెలియజేస్తోంది. ఎందుకంటే ఆ కార్పొరేట్ కళాశాలలు ఇప్పటికే చాలా కాలం క్రితం పాఠశాలలను కూడా స్థాపించాయి. అవి మొదట్లో అంత ఆదరణ పొందన ప్పటికీ, క్రమక్రమంగా హైదరాబాద్ మహానగరంలో తమ పట్టును బిగించాయి. కాబట్టి, పదవ తరగతికి మరో రెండు క్లాసులు కలుపుకుంటే కొత్త విద్యా విధానాన్ని తమకు పాఠశాలల్లోనే అమలు చేయడం అంత కష్టమేమి కాదు. ఈ కార్పొరేట్ విద్యా సంస్థలు ఎక్కువగా హైదరాబాద్‌లోనే స్కూల్స్‌ను ఏర్పాటు చేశాయి. తెలంగాణలోని ఇతర ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాలలో ఉన్నప్పటికీ, ఇంకా వాటికి గుత్తాధిపత్యం దక్కలేదు. ఇప్పుడు కొత్త విద్యా విధానం వచ్చాక, కింది వరకు పట్టుబిగించగలిగే ఆర్థిక వనరులు మెండుగా ఉన్నాయి. కాబట్టి, ప్రభుత్వం ఎన్ని మార్పులు తీసుకువచ్చినప్పటికీ, కార్పొరేట్ విద్యా సంస్థల కోరలు తీయక పోతే షరా మామూలే.

ఇక మరో విషయమేమిటంటే, రాష్ట్రంలోని విద్యారంగంలో తీసుకువస్తున్న నూతన మార్పులు కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం – 2020కి కొంత దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పటికే ఎన్ఇపి అనేక విమర్శలను ఎదుర్కొంటున్నది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగాన్ని సమాఖ్యస్ఫూర్తిని కాలరాస్తూ తమ చేతుల్లోకి తీసుకునేందుకు అనుగుణంగానే ఎన్ఇపిని రూపొందించారు. ఎన్ఇపిలోని కొన్ని అంశాలను అమలు చేస్తామని కేంద్రప్రభుత్వంతో ఎంఒయుపై సంతకం చేస్తేనే రాష్ట్రాలకు పిఎం శ్రీ పథకం కింద విద్యా సంస్థలకు నిధులు ఇస్తారు. ఇది నెమ్మదిగా విద్యారంగాన్ని తన ఛత్ర ఛాయలోకి తీసుకొని, విద్య కాషాయీకరణకు చేసే పన్నాగాలలో భాగమనే విమ ర్శలు ఉన్నాయి. కేరళంలో ఎల్‌డిఎఫ్ అధికారంలో ఉండగా పిఎం శ్రీ నిధుల కోసం ఎంఒయు కుదుర్చుకునేందుకు ప్రయత్నం జరగగా, ప్రభుత్వ భాగస్వామి గా ఉన్న సిపిఐ తీవ్రంగా వ్యతిరేకించటంతో అది నిలిచిపోయింది. గతంలో తమి ళనాడు ముఖ్యమంత్రిగా ఎం.కె.స్టాలిన్ ఉన్న సమయంలో సమగ్ర శిక్ష అభియాన్ కింద రావాల్సిన రూ.2,150 కోట్ల నిధుల విడుదలను పిఎం శ్రీ పథకం ఎంఒ యుపై సంతకం చేయటంతో ముడిపెట్టడంతో ఆయన తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎన్ఇపిని తిరోగమన పత్రంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ప్రత్యామ్నాయ నమూనా విద్యా విధా నాన్ని అమలులోకి తీసుకురావాలని ఇటీవల జరిగిన సిడబ్ల్యుసి సమావేశం ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేసింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకురావడం అనివార్యమే. వచ్చే ఏడాది నుంచి 10+2పై ప్రభుత్వం విధాన నిర్ణయం ప్రకటించేసింది. అయితే, దీనిపై అనేక సందేహాలు ముసురుకున్నాయి. దీనిద్వారా ఎన్ఇపి అమ లవుతోందా? వొకేషనల్ స్కిల్స్‌ను సిలబస్‌లో చేరుస్తారనే నేపథ్యంలో సిలబస్‌లో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి? ఇప్పటికే ఉన్న జూనియర్ కాలేజీలను ఏమి చేస్తారు? అందులోని లెక్చరర్‌లు, సిబ్బందికి ఇబ్బంది ఉండదని సిఎం చూచాయిగా చెప్పినప్పటికీ నిర్దిష్టంగా వివరాలు రావాల్సి ఉంది. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకు పునర్వ్యవస్థీకరిస్తానని గతంలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలపై అందోళన నెలకొంది. మరీ ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలను, ప్రైవేటు సంస్థల ఫీజులను ఏ విధంగా నియంత్రించబోతున్నారు? కృత్రిమ మేధతో అనేక ఉపాధి రంగాలకు ప్రమాదం ఏర్పడింది. దానిని అధిగమించేందుకు కరి క్యూలమ్‌లో తీసుకువచ్చే మార్పులేమిటి? ఇలాంటి అనేక ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు రావాల్సి ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలనే పట్టుదల మెండు. అందుకే విద్యా శాఖను మంత్రివర్గంలో తన వద్దే ఉంచుకున్నారు. ఉపా ధ్యాయుల బదిలీలు, కొత్త రిక్రూట్‌మెంట్, యూనివర్సిటీలలో ఖాళీల భర్తీకి చర్యలు, బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం, యూనిఫామ్, ఎడ్యుకేషన్ కిట్, లైబ్రరీలు తదితర కొన్ని సంస్కరణలు కూడా తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీ నుంచి ప్లస్ టు వరకు ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణా లను పలుచోట్ల చేపట్టారు. అయితే, వచ్చే ఏడాది నుంచి నూతన మార్పులు తీసు కువస్తున్నట్లు చేసిన ప్రకటనలో కావాల్సిన స్పష్టత కొరవడింది. దీంతో ప్రజల్లో అనేక సందేహాలు ముప్పిరిగొని ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం తక్షణమే పూర్తి వివరాలు వెల్లడించి, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, విద్యారంగ ప్రముఖులు, ఉపాధ్యాయ, అధ్యాపక రంగంలో నిష్ణాతులతో సమావేశం ఏర్పాటు చేసి లోటుపా ట్లను సరి చేయాల్సిన తక్షణ అవసరం ఉంది. సమయం తక్కువగా ఉన్నందున ఏకప క్షంగా కాకుండా ప్రభుత్వం విస్తృతాభిప్రాయాల సమాహారంతో వచ్చే విద్యా సంవత్సరంలో సమగ్ర మార్పులకు శ్రీకారం చుడితేనే సత్ఫలితాలు సాధ్యం. ●



ఇప్పుడైనా నిజాలు తెలుసుకున్నారు..

భారత్‌లో నా తల్లి జీవితం గురించి బిజెపి, ఆర్ఎస్ఎస్ నోటికొచ్చినట్లు మాట్లాడాయి. అబద్ధాలు ప్రచారం చేస్తూ.. కల్పిత కథనాలు రాశారు. అయినా, ఆమె ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు వాస్తవాలను పుస్తకం రూపంలో ఆమే స్వయంగా చెప్పారు. అందులో తప్పేముంది. అది ఆమె హక్కు. ఇన్నాళ్లూ బిజెపి అబద్ధాలు చెబితే.. ఇప్పుడు నిజమేంటో ప్రజల ముందుకు నా తల్లి తీసుకొచ్చారు.

- ఎంపి ప్రియాంక గాంధీ

జైలు గోడల మధ్యా కులగోడలేనా!

జైలు అంటే నేరం చేసిన వ్యక్తికి చట్టప్రకారం శిక్ష అమలయ్యే ప్రదేశం. నేరం చేసిన వ్యక్తి స్వేచ్ఛను పరిమితం చేయవచ్చు కానీ అతడి మానవ గౌరవాన్ని కాదు. న్యాయస్థానం విధించిన శిక్షకు మించి కులం పేరుతో అదనపు శిక్ష విధించే అధికారం ఎవరికీ లేదు. కానీ దేశంలోని కొన్ని జైళ్లలో కులవివక్ష, అంటరానితనం, వృత్తిపరమైన వివక్ష కొనసాగుతున్నాయన్న వాస్తవం భారత ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తోంది. జైళ్లలో కులవివక్షపై స్పందించని రాష్ట్రాల తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టడం ఈ వ్యవస్థలోని లోపాలను మరోసారి బయటపెట్టింది. భారత రాజ్యాం గం ప్రతి పౌరుడికి సమానత్వపు హక్కును కల్పించింది. కులం, మతం, ప్రాంతం ఆధారంగా వివక్షను నిషేధించింది. అంటరానితనాన్ని పూర్తిగా రద్దు చేసింది. గౌరవ ప్రదమైన జీవితం ప్రతి మనిషి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ రాజ్యాంగ సూత్రాలు జైలు గేటు దగ్గరికి వచ్చేసరికి వర్తించవా..? నేరం చేశాడనే కారణంతో ఒక వ్యక్తికి స్వేచ్ఛను నిరాకరించవచ్చు. కానీ అతడి కులం ఆధారంగా పనులు కేటా యించడం, సామాజిక నేపథ్యాన్ని బట్టి వివక్ష చూపడం ఏ న్యాయసూత్రం ప్రకారం సమర్థనీయం..? నేరం వ్యక్తిగతమైనది. కులం జన్మతో ఆపాదించబడిన సామాజిక గుర్తింపు. ఈ రెండింటినీ కలిపి చూడటమే అసలు సమస్య. 2024 అక్టోబర్‌లో సుకన్య శాంతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో కీలకమైనది. వివిధ రాష్ట్రాల జైలు నిబంధనల్లో ఉన్న కులవివ క్షాపూరిత నిబంధనలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించింది. ఖైదీలకు కులం ఆధారంగా పనులు కేటాయించడం, పారిశుద్ధ్య పనులను నిర్దిష్ట వర్గాలకే పరిమితం చేయడం, సామాజిక నేపథ్యం ఆధారంగా ఖైదీలను వేరుచేయడం వంటి పద్ధతులను తప్పుబట్టింది. జైలు నిబంధనల్లో మార్పులు చేసి కులవివక్షకు తావులేకుండా చూడా లని రాష్ట్రాలను ఆదేశించింది. అయినప్పటికీ ఆదేశాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతుండటం ఆందోళనకరం. తాజాగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా లు కేంద్ర హోంశాఖ కోరిన సమాచారాన్ని సమర్పించకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నివేదికలు సమర్పించకపోతే ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను వ్యక్తిగతంగా కోర్టుకు పిలిపించాల్సి వస్తుందని హెచ్చరించింది. 2027 జనవరి 13లోగా నివేదికలు సమర్పించాలని తుది గడువు విధించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన రాజ్యాంగపరమైన ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రభు త్వాలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం చిన్న విషయం కాదు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే పాలకులు తమ పరిధిలోని సంస్థల్లోనే కొనసాగుతున్న వివక్షను తొలగించడానికి ఎందుకు చొరవ చూపడం లేదన్నది ప్రశ్న. ఖైదీలకు పను లు కేటాయించే విధానం, వంటశాలలు, పారిశుద్ధ్య నిర్వహణ, బ్యారక్‌లలో నివాస ఏర్పాట్లు, అధికారుల ప్రవర్తన.. ప్రతి అంశంలోనూ వివక్షకు తావులేకుండా చూడాలి. జైళ్లలో కులవివక్షపై స్వతంత్ర పర్యవేక్షణ ఉండాలి. బాధితులు నిర్భయంగా ఫిర్యాదుచేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వివక్షకు పాల్పడే అధికారులపై బాధ్యతా యుతమైన చర్యలు తీసుకోవాలి. నిజానికి జైళ్లలో కులవివక్ష అనేది జైలు వ్యవస్థకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. సమాజంలో పాతుకుపోయిన కులాధిపత్య భావజాలం ప్రభుత్వ సంస్థల్లోకి ఎలా చొరబడుతుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. నేరం చేసినవారు చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సిందే. అదే సమయంలో వారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు కూడా కొనసాగాలి. సుప్రీంకోర్టు ఆదేశా లను అమలు చేయడం ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన అంశం కాదు. అది రాజ్యాంగబద్ధమైన బాధ్యత. జైళ్లలో వాస్తవ పరిస్థితులను సమీక్షించి, వివక్షకు కారణమవుతున్న విధానాలను పూర్తిగా తొలగించాలి. ఈ విషయంలో న్యాయస్థానం పర్యవేక్షణ కూ డా నిరంతరం కొనసాగాలి. జైలు గోడల మధ్య కులగోడలు కూలి నప్పుడే రాజ్యాంగ సమానత్వానికి నిజమైన అర్థం లభిస్తుంది.

దారా
rajenderdamera@gmail.com

యు.పి. ఎన్నికలు యోగికి సునాయాసం కావు

జ్ఞాన్ పాఠక్

ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా కోటి మందికి పైగా హిందువుల ఓటర్ల పేర్లను తొలగించడంపై ఇటీవల ఒక బిజెపి సమావేశంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్యనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు 2027 ఎన్నికలకు ముందు ఆ పార్టీ రాజ కీయ బలహీనతలకు స్పష్టమైన సూచన. 2017 లేదా 2022 ఎన్నికలతో పోలిస్తే బిజెపి 2027 ఎన్ని కలకు గణనీయమైన అనిశ్చితుల నడుమ బరిలోకి దిగుతోందని ఇది తెలియజేస్తోంది.

నరేంద్ర మోదీ తరువాత ప్రధానమంత్రి పదవి కి యోగి ఆదిత్యనాథ్ తనకు పోటీదారుగా నిలవకూ డదనే ఉద్దేశ్యంతోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదిత్యనాథ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని, అందుకే పార్టీలో ఆయనను, ఆయన అనుచరులను బలహీన పరిచేందుకు హిందూ ఓట్లను తొలగిస్తున్నారని ఉత్త రప్రదేశ్‌లో ఒక పుకారు వ్యాపిస్తోంది.ఓటర్ల జాబితా నుంచి హిందూ ఓటర్లను తొలగించటంపై తలెత్తిన వివాదం యోగిని స్పష్టంగా కలవరపెట్టినప్పటికీ, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రధాన నాయకుడిగా యోగి ఆదిత్యనాథ్ స్థానానికి తక్షణ ముప్పు ఏమీ లేదు.

యోగికి ఉన్న మరో ఆందోళన ఏమిటంటే, బిజె పిలో కులపరమైన ఉద్రిక్తతలు, పార్టీ కార్యకర్తలలో అసంతృప్తితో సహా అంతర్గత అసంతృప్తి పెరుగుతూ ఉండటం. అంతేకాకుండా, 2024 లోక్‌సభ ఎన్నిక లలో సమాజ్‌వాదీ పార్టీ – కాంగ్రెస్ కూటమి కనబరిచిన అద్భుతమైన ప్రదర్శన నేపథ్యంలో శాస నసభ ఎన్నికలలో బిజెపికి బలమైన సవాలుగా మారే అవకాశం కూడా ఉంది.

బిజెపిలో యోగి రాజకీయ స్థానం, ఆ పార్టీ ఎన్నికల అవకాశాలు, యోగి రాజకీయ శిబిరం భవి ష్యత్తు అనేవి మూడు వేర్వేరు ప్రశ్నలు. అవి ఒకదా నితో ఒకటి ముడిపడి ఉన్నప్పటికీ, ఒకేలాంటివి కావు. ఈ సమయంలో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

అసలేమి జరిగింది?

అక్టోబర్ 31న జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో యోగి ఒక సంచలన ఆరోపణ చేశారు. ఉత్తర ప్రదేశ్ ఓటర్ల జాబితాలో సుమారు 1.27 కోట్ల హిందూ ఓటర్లు గల్లంతయ్యారని, అర్హులైన ఓటర్లు నమోదయ్యేలా చూడాలని ఆయన బిజెపి ఎంపిలు, ఎంఎల్ఎలు, పార్టీ కార్యకర్తలను ఆదేశిం చారు. పంచాయతీ ఓటర్ల జాబితాలో ఉన్న 66 లక్షల మంది శాసనసభ నియోజకవర్గాల జాబితా లో లేరని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులలో సుమారు 55 లక్ష ల మంది నమోదు కాలేదని తెలిపారు. 18–19 ఏళ్ల వయస్సు గల దాదాపు 4.5లక్షల మంది యువకు లు జాబితాలో గల్లంతయ్యారని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో 16 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, ప్రస్తుత ఓటర్ల జాబితాలో సుమారు 13కోట్ల మంది మాత్రమే ఉన్నారని ఆయన వాదించారు. ఈ లోప భూయిష్ట పరిస్థితులు 28 పట్టణ స్థానిక సంస్థల నియోజకవర్గాలలో బిజెపి స్థానాన్ని బలహీనపరుస్తు న్నాయని కూడా ఆయన సూచించారు.

ఈ వివాదాన్ని ఎస్ఐఆర్ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణను అర్థం చేసుకోవాలి. యుపి ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి సుమారు 13.39 కోట్లకు తగ్గిపోయింది.



ఇక్కడ ఒక ముఖ్యమైన విషయమేమిటంటే, 1.27 కోట్ల హిందూ ఓటర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం చెప్పలేదు. ఉదహరించిన గణాంకాలలో తొలగించిన ఓటర్ల మతపరమైన కూర్పును అందించలేదు.

ఇది యోగిని ఎందుకు కలవరపెడుతోంది? ఎందుకంటే ఇది బిజెపి ఎన్నికల లెక్కలను తలకిం దులు చేయవచ్చు. అగ్రవర్ణ హిందువులు, యాదవే తర ఓబిసిలు, దళితులలోని కొన్ని వర్గాలు, ఇతర వర్గాల విస్తృత కలయికపై బిజెపి ఆధారపడి ఉంటుంది. దాని హిందూ ఏకీకరణ వ్యూహం ఈ కలయికలో ఒక ముఖ్యమైన భాగం. బిజెపి పట్ల సానుభూతి ఉన్న, అర్హత కలిగిన ఓటర్లు పెద్ద సంఖ్య లో ఓటర్ల జాబితాలో లేకపోతే, అది ముఖ్యంగా హోరాహోరీగా పోటీ ఉండే నియోజకవర్గాలలో పార్టీకి నష్టం కలిగించవచ్చు.

పట్టణప్రాంత నియోజకవర్గాలపై అందోళన

యోగి ప్రత్యేకంగా 28 పట్టణ ప్రాంత నియోజక వర్గాలను ప్రస్తావించారు. బిజెపికి పట్టణ ప్రాంతా లు సాంప్రదాయకంగా ముఖ్యమైనవి. ఈ ప్రాంతా ల్లో ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు జరిగి ఉంటే, తమ మద్దతుదారులు సరిగ్గా నమోదు అయ్యారో లేదో తనిఖీ చేయడానికి పార్టీకి చట్టబద్ధ మైన కారణం ఉంటుంది. సంస్థాగత నిర్లక్ష్యం గురించి కూడా బిజెపి అందోళన చెందుతోంది. దాదాపు దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న పార్టీ, తమ సంప్రదాయ ఓటర్లు తమకు మద్దతు ఇస్తూనే ఉంటా రని భావించవచ్చు. కానీ ఓటర్ల నమోదుకు బూత్ స్థాయిలో చురుకైన సమీకరణ అవసరం. తమ ఓటర్ల బలాన్ని తేలికగా తీసుకోవద్దని బిజెపి సంస్థా గత వ్యవస్థకు యోగి పరోక్షంగా చెబుతున్నారు.

హిందూ ఓటర్లు కనబడకపోవడమే సమస్యగా పేర్కొనడం ద్వారా యోగి హిందూ రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించే నాయకుడిగా తన రాజకీయ స్థానాన్ని కూడా బలోపేతం చేసుకుంటు న్నారు. ఇది చాలా ముఖ్యమైనది, ఎందుకంటే యుపిలో బిజెపి ఎన్నికల వ్యూహంలో ఆయన అని వార్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆయన ఆందోళన ఎన్నికల సంబంధమైనది, రాజకీయ సంబంధమైనది కూడా.

బిజెపిలో యోగి ఆధిపత్యానికి సవాలు ఎదుర వుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం చాలా కీలకం. యోగి స్థానం బలంగానే ఉంది, కానీ బిజెపిలో ముఖ్యమంత్రి ఒక్కరే అధికారాన్ని అన్ని విధాలుగా నియంత్రించలేరు. ఇక్కడ మూడు ప్రభావ కేంద్రా లు ఉన్నాయి. అవి 1) యోగి ఆదిత్యనాథ్, ఆయన పరిపాలన, 2) ప్రధాన నిర్మాణ, ఎన్నికల నిర్ణయా లను నియంత్రించే బిజెపి కేంద్ర నాయకత్వం, 3) ఎన్ని కల సమీకరణకు సహకారం అందించే ఆర్ఎస్ఎస్, విస్తృత సంఘ్ పరివార్.

బైటపడుతున్న అంతర్గత విభేదాలు

యోగికి ఉన్న రాజకీయ బలం ఆయన వ్యక్తి గత ప్రజాదరణ, హిందుత్వ నేపథ్యం, పరిపాలనా ప్రతిష్ట, ఓటర్లను సమీకరించగల సామర్థ్యం నుంచి వస్తుంది. అయితే, అంతర్గత విభేదాల సంకేతాలు కనిపిస్తున్నాయి. కేశవ్ ప్రసాద్ మౌర్య అంశం ముఖ్యమైనది. ఎందుకంటే ఆయన ఒక ముఖ్యమైన రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఉప ముఖ్యమంత్రిగా యోగి కన్నా భిన్నమైన సామాజిక, రాజకీయ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనకు ఒబిసి రాజకీయ గుర్తింపుతో పాటు బిజెపి విస్తృత సంస్థాగత నిర్మాణంతో కూడా సంబంధాలు ఉన్నాయి.

యుపిలో 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి నిరాశాజనకమైన ప్రదర్శన తర్వాత వీరిద్దరి మధ్య ఉద్రి క్తతలు ప్రత్యేకంగా బయటపడ్డాయి.

మరో తీవ్రమైన బలహీనత ఠాకూర్–బ్రాహ్మ ణుల మధ్య ఉద్రిక్తతలు. యోగి ఠాకూర్ నేపథ్యం ఎప్పటికప్పుడు రాజకీయ సమస్యగా మారుతోంది. బ్రాహ్మణ నాయకులలోని కొన్ని వర్గాలు తమకు తగినంత రాజకీయ ప్రాతినిధ్యం లేదని, పరిపాలనా వివక్ష జరుగుతోందని ఆరోపించాయి. 2025 డిసెంబర్‌లో బ్రాహ్మణ ఎంఎల్ఎలు, ఎంఎల్సిల సమావేశం వివాదాస్పదం కావడంతో, కుల ఆధారిత సమావేశాలకు దూరంగా ఉండాలని బిజెపి నాయ కత్వం శాసనసభ్యులను బహిరంగంగా హెచ్చరించింది.

ఇది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే బిజెపి ఎన్నికల విజయం అగ్రవర్ణాలు, యాదవేతర ఒబిసిల మధ్య ఐక్యతను కొనసాగించడంపై ఆధారపడి ఉంటుంది. బ్రాహ్మణులలో అసంతృప్తి పెరిగితే, అది ప్రతిపక్షానికి ఒక అవకాశాన్ని కల్పిస్తుంది.

అంతేకాకుండా, ఆ పార్టీ వ్యవస్థ పూర్తిగా సాక ర్యవంతంగా లేదు. పార్టీ కార్యకర్తలలోని అసంతృప్తి ని పరిష్కరించడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు కాశీ, గోరఖ్‌పూర్ ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించా యి. ఇందులో తేలిన ప్రధాన ఫిర్యాదులు ఏవంటే పరి పాలన యంత్రాంగం కార్యకర్తలను నిర్లక్ష్యం చేయ డం, పార్టీ ఫిరాయింపుదారులు సంస్థాగత పదవులు పొందటం, ప్రభుత్వ అధికారులపై స్థానిక బిజెపి నాయకులకు తగినంత ప్రభావం లేకపోవ డం, ప్రతిపక్షాల విమర్శల నుండి యోగిని, ఆయన ప్రభు త్వాన్ని సమర్థించడంలో పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం కొరవడటం.

(ఐపిఎ సర్వీస్)

ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు?

తెలంగాణలో ఖరీఫ్ (వాన కాలం)సీజన్ వరి పంటలు అక్టోబర్ చివరి నుండే కోతలు ప్రారం భమైనవి. ఇప్పటికే పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయం అంటే వ్య యప్రయాసం అయింది. ప్రభుత్వ పరంగా సకాలంలో విధాన పరమైన నిర్ణయాలు లేక వరి ధాన్యం రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోసిన వరి ధాన్యాన్ని నిల్వచేసుకునే సదుపాయం, అరబెట్టు కునే సౌకర్యాలు లేక తప్పని పరిస్థితులలో మధ్య దళారులకు అమ్ముచున్నారు.

మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.95 అమ్ముచున్నారు. కానీ క్వింటాల్ వరి ధాన్యం రూ.2200లకే కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర వ్యవహారాల కేబినెట్ కమిటీ(సిసిఇఎ)ఏటా రెండు సార్లు ఖరీఫ్, రబీ సీజన్‌లకు వ్యవసాయ పంట లకు కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తారు. ఆ మద్దతు ధరలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరుగుతాయి.

చాలాకాలంగా తెలంగాణలో ఐకెపి (ఇందిరా క్రాంతి పథకం)సెంటర్‌ల ద్వారా ధాన్యం కొను గోళ్లు జరుగుతున్నవి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ఇఆర్పీ) అధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ గురించి రైతులు ఎదురు చూస్తున్నారు. గ్రామ స్థాయిలో రైతులు తమ పంటలను విక్రయించు కోవడానికి ఐకెపి(ఇందిరా క్రాంతి పథం) సెంటర్ ల వలన రైతులకే కాకుండా దేశ ప్రయోజనాలు కూడా ఉన్నవి. నిత్యావసర వస్తువుల చట్టం 1955 సెక్షన్ 3 ప్రకారం భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిన అధికారా లను అనుస రించి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్స్, డీలర్లు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని లెవీ కింద 75 శాతం 'ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్‌సిఐ) కు సరఫరా చేయాలి. ఈ మిల్లింగ్ లెవీ పథకం రైతు లకు ప్రయోజనం చేకూర్చ డంతో పాటుగా 'నేషనల్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్' (ఎన్‌పిడిఎస్) ద్వారా నేష నల్‌ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ 2013 ప్రకారం చౌకధరల దుకాణాల్లో ప్రజలకు పంపిణీ చేయడం జరుగు తుంది. అలాగే కరువు కాటకాలను ఎదుర్కోవడానికి ఆహార భద్రత గురించి నిల్వ చేయడం జరుగుతుంది. ఇక రైస్ మిల్లర్స్, డీలర్లు 75శాతం లెవీ బియ్యం కింద 'ఎఫ్‌సిఐ'కి ఇవ్వగా మిగిలిన 25 శాతం బియ్యాన్ని జిల్లా కలెక్టర్‌లకు సమాచారం ఇస్తూ బహిరంగ మార్కెట్‌లోను, ఇతర రాష్ట్రాల్ల

హడావుడి నిర్ణయాలు వద్దు

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయొద్దు

- ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్
- పాఠశాల విద్యలో విలీనం సరైన నిర్ణయం కాదు : ఎఐఎస్ఎఫ్
- ఇంటర్ విద్యా వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: ఎఐవైఎఫ్



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని రద్దు చేసి, పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి సమగ్ర అధ్యయనం, చర్చ లేకుండా ప్రభుత్వం తీసుకుంటున్న హడావుడి నిర్ణయాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలోకి నెట్టివేయబడుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా రాష్ట్రంలో పది లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నారని, ఇలాంటి కీలకమైన విద్యా వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు తీసుకురావడం వల్ల విద్యార్థుల్లో అయోమయం, మానసిక ఒత్తిడి పెరుగుతాయని పేర్కొన్నారు. జెఇఇ, నీట్, ఎంసెట్ వంటి జాతీయ, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలకు ఇంటర్మీడియట్ సిలబస్ ప్రధాన ప్రాతిపదికగా ఉందని గుర్తు చేశారు. ఇంటర్ విద్యను సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ విధానాల పేరుతో పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షల్లో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న వేలాది మంది అధ్యాపకులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందన్నారు. ఇంటర్మీడియట్ వ్యవస్థలో మార్పులు చేస్తే వారి ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాల పరిస్థితి ఏమిటో వెల్లడించాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు సరైన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో అదనంగా ఇంటర్మీడియట్ తరగతులను పాఠశాలల్లో విలీనం చేయాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. పాఠశాల విద్యను బలోపేతం చేయకుండా, ఉన్నతమైన ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేయవద్దని శ్రీనివాస రావు సూచించారు. విద్యా విధానాల్లో మార్పులు తీసుకురావాలంటే ముందుగా వాటి సాధ్యాసాధ్యాలు, విద్యార్థులపై ప్రభావం, విద్యా ప్రమాణాలు, అధ్యాపకుల భవిష్యత్తును సమగ్రంగా అధ్యయనం చేయాలని తక్కళ్లపల్లి సూచించారు. విద్యా రంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పాఠశాల విద్యలో ఇంటర్ విలీనం సరైన నిర్ణయం కాదు : ఎఐఎస్ఎఫ్

రాష్ట్రంలో ఇంటర్ విద్యను రద్దు చేసి, పాఠశాల విద్యలో ఇంటర్ విద్యను విలీనం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం సరైన నిర్ణయం కాదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంట రెడ్డి, కార్యదర్శి పుట్టలక్ష్మణ్ అన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలన్నారు. విద్యాపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో చర్చించాలని, రాష్ట్రంలో ఇప్పటికే పాఠశాల విద్యలో అనేక సమస్యలు ఉన్నాయని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక సమస్యలతో పాఠశాల విద్యార్థులు సతమతమవుతున్న నేపథ్యంలో ఇంటర్ విద్యను విలీనం చేస్తే సమస్యలు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో విద్యార్థులంతా దాదాపు స్టేట్ సిలబస్ వైపే మొగ్గు చూపుతున్నారని, సిబిఎస్ఇ సిలబస్‌తో పోటీపడి చదవాలని రేవంత్ రెడ్డి నిర్ణయించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని, ఒక వైపు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, మరోవైపు పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు మళ్లీ ఇప్పుడు ఇంటర్ విద్య పాఠశాల విద్యలో విలీనం అంటూ రాష్ట్ర విద్యార్థులను తల్లితండ్రులను సిఎం రేవంత్ రెడ్డి అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విలీనం ద్వారా కొన్ని కార్పొరేట్ పాఠశాలలకు మేలు జరుగుతుందన్నారు. ఇదివరకే తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర విద్య అభివృద్ధిపై ఒక నివేదికను సమర్పిస్తే, దీనిపైన ఇప్పటికీ ఎందుకు నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ కమిటీ తీసుకున్న కొన్ని మంచి నిర్ణయాలను అమలు చేయకుండా సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రవేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారని వారు ఆరోపించారు.


ఇంటర్ విద్యా వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: ఎఐవైఎఫ్

ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను పాఠశాల విద్యా శాఖలో విలీనం చేసి 10+2 విధానాన్ని అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. విద్యా సంస్కరణల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయవద్దన్నారు. ఇంటర్ గ్రూపుల ప్రత్యేకత, పోటీ పరీక్షల సన్నద్ధత, ప్రైవేట్ కళాశాలల భవిష్యత్తు, అధ్యాపకుల ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో విస్తృత చర్చ జరిపిన తర్వాతే ముందుకెళ్లాలని గురువారం ఓ ప్రకటనలో ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి, దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్‌లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 22ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జి.ఓ 118, జి.ఓ 76లకు సంబంధించి మెమోలు, 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యుఎల్‌సి దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జి.ఓ 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్ లదేనని, ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని, ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందన్నారు.

నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు

18వ తేదీ వరకు పత్రాల అందజేత

19న ఖాతాల్లోకి నగదు జమ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా మంజూరైన 'చేయూత' పింఛన్‌ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. అన్ని నియోజకవర్గాల్లో సాగుతున్న ఈ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ పంపిణి ప్రక్రియ కొనసాగనుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్‌లను మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయగా, తాజా లబ్ధిదారులతో కలిపి రాష్ట్రంలో కొత్తగా పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య మొత్తం 5,73,625కు చేరింది. పంపిణీకి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు సెర్ప్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన నూతన లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్మును చెల్లించనున్నారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే కేంద్రం పెద్దపీట

ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శ



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ హామీలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ రైతులను వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్)జాతీయ కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్ విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వ్యవసాయ చట్టాలు, వాణిజ్య ఒప్పందాల ద్వారా కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం గత12 ఏళ్లలో ఐదు లక్షల మందికి పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు, దినసరి కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి చలనం లేదన్నారు. రైతుల హక్కులు, వ్యవసాయ సంక్షోభం, ప్రజాస్వామ్య పరిరక్షణే అజెండాగా నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో ఎఐకెఎస్ 36వ అఖిల భారత మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో గురువారం మీడియా సమావేశంలో ఎఐకెఎస్‌జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి టి సాగర్, కోశాధికారి ఎం శోభన్, రాష్ట్ర సహాయకార్యదర్శి పి.జంగారెడ్డి, ఉపాధ్యక్షులు ఉడుత రవీందర్‌లతో కలసి ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలతో పాటు ఎస్ఐఆర్, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, మహిళలు, దళితులు, ఆదివాసీలపై దాడులు, భూ ఆక్రమణలు, మతపరమైన విభజన వంటి అంశాలపై మహాసభ చర్చిస్తుందని డాక్టర్ విజూ కృష్ణన్ తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా జిసిసిలు

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యం : మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/ హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను (జిసిసి) తెలంగాణ ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కేవలం ఐటి సేవలకే పరిమితం కాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ, ఆవిష్కరణలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా స్నికర్స్, పెడిగ్రీ, రాయల్ కానిన్ వంటి ప్రముఖ బ్రాండ్లతో గుర్తింపు పొందిన మార్స్ సంస్థ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జెన్‌పాక్ట్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను సంప్రదాయ ఐటి సేవల కేంద్రం నుంచి ప్రపంచస్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, నాలెడ్జ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ఐటి, ఐటిఇఎస్ రంగానికి ఉన్న అనుకూలతలను ఇతర పరిశ్రమలతో అనుసంధానించడం ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధి, డేటా అనలిటిక్స్, ఉత్పత్తుల రూపకల్పన, ఇంజినీరింగ్, ఆవిష్కరణల రంగాల్లో జిసిసిలు కీలక పాత్ర పోషించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇదే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్2047 విజన్‌లో టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. మార్స్ జిసిసి ద్వారా ప్రస్తుతం 400 మందికి పైగా ఉపాధి లభించనుండగా, భవిష్యత్తులో ఈ సంఖ్యను వెయ్యికి పెంచనున్నట్లు మంత్రి వెల్లడించారు. మార్స్ ప్రపంచ కార్యకలాపాలకు అవసరమైన డిజిటల్, డేటా, కృత్రిమ మేధస్సు సామర్థ్యాలను ఈ కేంద్రం మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ క్లాస్ ఆగార్డ్, జెన్‌పాక్ట్ ప్రతినిధి తరుణ్ చోప్రా, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధి ఎమీలియా బి. స్మిత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల ర్యాలీ

కార్యక్రమంలో పాల్గొననున్న రాహుల్ గాంధీ

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, సంక్షేమం లక్ష్యంగా ఈ నెల 14వ తేదీన మాదాపూర్‌లోని శిల్పకళా వేదిక నుండి హైటెక్స్ వరకు భారీ ప్రదర్శన జరగనుంది. స్వతంత్ర కార్మిక సంఘమైన 'తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్' (టిజిపిడబ్ల్యుయు) ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రదర్శనలో ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొననున్నారు. భారత్ జోడో యాత్ర 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని టిజిపిడబ్ల్యుయు అధ్యక్షులు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం ఇప్పటికే రూపొందించిందని, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు, కార్మికుల నమోదు, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోందని ఆయన వివరించారు. ప్రభుత్వ నిబద్ధతను స్వాగతిస్తూ, రవాణా, డెలివరీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికుల ఉమ్మడి పోరాటం, ఆకాంక్షలకు ఈ ర్యాలీ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని గిగ్ కార్మికులకు సామాజిక భద్రత, ప్రమాద బీమా, సంక్షేమం, సమస్యల పరిష్కార యంత్రాంగం కల్పించేందుకు చొరవ చూపిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామికి టిజిపిడబ్ల్యుయు ధన్యవాదాలు తెలియజేస్తోందన్నారు. 'తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్ – 2026' అనేది కార్మికుల హక్కుల పరిరక్షణకు ఒక కీలక చట్టపరమైన వేదికను అందిస్తుందన్నారు. ప్రధానంగా కార్మికుల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, ప్రత్యేక సంక్షేమ బోర్డు, సమస్యల పరిష్కార యంత్రాంగం ((గ్రీవెన్స్ రీడ్రెస్సల్) వంటి కీలక అంశాలను కలిగి ఉందని తెలిపారు.

ఆర్థిక లావాదేవీలు... అక్రమ సంబంధాలు.. అడ్డొస్తే హత్యలు

పెరుగుతున్న హింసాత్మక ధోరణి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఒకే తల్లి రక్తం పంచుకు పుట్టిన వారు దశాబ్దాల పాటు కలిసి పెరిగారు. నాలుగు కుంటల స్థలం కోసం సొంత సోదరున్నే హతమార్చారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి రక్త సంబంధాలు, స్నేహితాలు, బంధుత్వాలు ఇవేవి హింసాత్మక చర్యలకు అడ్డుగా నిలవడం లేదు. పట్టుమని 15 ఏళ్లు నిండని ఓ కుర్రాడు 19 సంవత్సరాల వివాహిత అక్రమ సంబంధం పెట్టుకున్నారు. ఈ చాటు వ్యవహారాన్ని తన స్నేహితుడు చూశాడని కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి హతమార్చారు. ఇటీవల కాలంలో ఏదైనా తేడా వస్తే సంప్రదింపులు, చర్చలు ఏమి ఉండడం లేదు. తేడా వస్తే అడ్డు తొలగించుకోవడమే అన్న భావన రోజు రోజుకు బలపడుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు మాసాల కాలంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 10 హత్యలు జరిగాయి. ఇవ్వన్ని ఆర్థిక, అక్రమ సంబంధాల నేపథ్యంలో జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో సగం హత్యలు రక్త సంబంధికుల మధ్యే జరిగాయి. కొన్ని హత్యలైతే కేవలం మూడు నాలుగు గుంటల భూములు, గెట్టు పంచాయతీల నేపథ్యంలోనే జరిగాయి. నేలకొండపల్లి మండలంలో ఓ హత్య రెండు స్థలాల మధ్యలో ఉన్న చెట్టు కోసం జరిగిందంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారు. ఇక భార్యభర్తల మధ్య బేధాభిప్రాయాల నేపథ్యంలో హత్యలు చోటు చేసుకుంటున్నాయి. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో అక్రమ సంబంధం నేపథ్యంలో ఓ వైద్యుడు తన భార్యను, ఇద్దరు పిల్లలను హతమార్చి రోడ్డు ప్రమాదం జరిగిందని భ్రమింపజేసేందుకు ప్రయత్నింపజేశాడు. మరికొందరు విషమిచ్చి చంపుతున్నారు. లేకపోతే ప్రియుడినో, ప్రియురాలినో కలుపుకుని హతమారుస్తున్నారు. ఇటీవల తాను వండిన కూర రుచిగా లేదని భర్త అన్నాడని ఏకంగా భర్తనే హతమార్చింది ఓ ఇల్లాలు. మైనర్ బాలికపై కన్నెసిన ఓ కామాందుడు చివరకు బాలికను నాలుగు అంతస్తుల భవనం పై నుంచి నెట్టివేయడంతో ఇప్పుడు ఆ బాలిక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. జీవితమంతా మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం.



కొద్ది రోజుల క్రితం కల్లూరు మండలంలో సంచలనం సృష్టించిన ఓ ఘటన ఇప్పుడు మరింత ఆలోచింపజేస్తుంది. పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 19 సంవత్సరాల ఒక వివాహిత మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. ఆ బాలునికి 15 సంవత్సరాలు కూడా నిండలేదు. ఆ యువతికి వివాహం కాగా భర్తను వదిలి ఇంటి వద్దనే ఉంటుంది. పదవ తరగతి చదువుతున్న ఆ విద్యార్థి దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. వివాహితతో చనువుగా ఉండటాన్ని ఆ విద్యార్థి ప్రాణ స్నేహితుడు చూశాడు. ఈ విషయం పది మందికి చెబుతాడని భావించి ఆ విద్యార్థినిని హతమార్చేందుకు ఇద్దరు ఓ ప్రణాళిక రూపొందించారు. కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించి ప్రాణాలు తీశారు. 19 ఏళ్ల యువతి, 15 ఏళ్ల యువకుడు ఇప్పుడు హత్యానేరం క్రింద జైలులో ఉన్నారు. ఇటువంటి ఘటనలు పెరుగుతున్న హింసాధోరణికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. క్షణికావేశం కూడా ఈ హింసాత్మక ఘటనలకు కారణమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మణుగూరు డిపో కండక్టర్ మృతి విషయం లోనూ క్షణికావేశమే రెండు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టివేసింది. కండక్టర్ ప్రవళిక తండ్రి అర్టిసి ఉద్యోగి ఆయన మృతిచెందంతో ఆ కుటుంబ భారాన్ని మోసేందుకు ప్రవళికకు సంస్థ కండక్టర్ ఉద్యోగాన్ని ఇచ్చింది. విధి నిర్వహణలో ఉండగా చిల్లర విషయంలో వచ్చిన చిన్న తేడాతో ఓ ప్రయాణికురాలికి కండక్టర్‌కు మధ్య ఘర్షణ జరిగింది. పది రూపాయల టిక్కెట్ రూ. 100లకు చిల్లర ఈ రెండింటి నేపథ్యంలో ప్రయాణికురాలు కండక్టర్‌ను కిందకు తోసివేయడంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ నిరుపేద కుటుంబానికి చెందిన యువతి కండక్టర్‌ను నెట్టి హత్యకు కారణమైనందున ఇప్పుడు జైలుపాలైంది. ఈ క్షణికావేశంలో జరిగే హింసాధోరణిని తగ్గించేందుకు ప్రయత్నం జరగాలి. లేకపోతే కూర్చోవడం, చర్చించుకోవడం, శాంతియుత మార్గాల అనుసరణ మొదలైనవి కనుమరుగై హతమార్చడమే సమస్యకు పరిష్కారం అన్న రీతి ప్రబలుతుంది.

మంత్రగాళ్ల నేపంతో ..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల కాలంలో మంత్రగాళ్ల నేపంతో హత్యలు జరుగుతున్నాయి. ఒక కరకగూడెం మండలంలోనే ఇద్దరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా ఇద్దరిని మంత్రగాళ్లు అన్న నేపంతో హతమార్చారని ఆరోపణలు వచ్చాయి ఇదిలా ఉండగా ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన ఇద్దరు వృద్ధులు ఆళ్లపల్లి మండలంలో దారుణ హత్యకు గురయ్యారు. వీరిద్దరిని మంత్రగాళ్లు అనే నేపంతో హతమార్చారని ఆరోపణలు వస్తున్నాయి. ఐదుగురు వ్యక్తులు పదం మాసయ్య, మడకం బీమయ్య అనే వ్యక్తులను హతమార్చి పూడ్చిపెట్టారు. మడకం భీమయ్య కుమార్తె నందిని ఫిర్యాదుతో ఈ హత్యల వ్యవహారం వెలుగు చూసింది. ఒక పక్క అక్రమ సంబంధాలు, ఆర్థిక వ్యవహారాలు, మంత్రల నేపంతో జరుగుతున్న వరుస హింసాత్మక ఘటనలకు స్వస్తి పలకకపోతే ప్రతి ఒక్కరూ భయంతో బతకాల్సిన పరిస్థితి వస్తుంది. ఎప్పుడు ఏ వైపునుంచి ప్రమాదం వస్తుందో తెలుసుకోలేని స్థితి తస్మాత్ జాగ్రత్త.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సర్కిల్-23 & సర్కిల్-24
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No.	పని పేరు	అంచనా విలువ	బిడ్ సమర్పణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం	అధికారి పేరు & చిరునామా
69/EE-23 & 24/R.JRNZ/ GHMC/ 2026-27	(01) నెం. పని	రూ. 28.30 లక్షలు	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 13.11.2026 సా.5.00గం.లకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ: 20.11.2026 సా.5.00గం.ల వరకు	శ్రీ ఎన్.భాను ప్రతాప్ నాయుడు, ఇఇ, సర్కిల్-23 & సర్కిల్-24, ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, ఫ

ఎస్సి వర్గీకరణ రోస్టర్ పాయింట్లకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్ష



ప్రజాపక్షం/మావల: ఎస్సి వర్గీకరణ రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అక్టోబర్ 26, 2026న విడుదలైన జిఒనెంబర్ 1628ను వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మాలకు 10 లోపు ఒక రోస్టర్ పాయింట్, 11 నుంచి 20లోపు ఒక రోస్టర్ పాయింట్ కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెదక్ సర్కిల్‌కు ప్రత్యేక క్రీడా మండలి ఏర్పాటు చేయాలి: అశోక్

ప్రజాపక్షం / మెదక్ : మెదక్ సర్కిల్ పరిధిలో క్రీడలపై ఆసక్తి, ప్రతిభ కలిగిన విద్యుత్ శాఖ ఉద్యోగులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక క్రీడా మండలిని ఏర్పాటు చేయాలని టిఆర్‌వికెఎస్ జిల్లా అధ్యక్షుడు జి. అశోక్ కోరారు. ఈ మేరకు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ నారాయణ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మెదక్ సర్కిల్ పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్ వంటి క్రీడల్లో ప్రతిభ కలిగిన ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే ఉన్నతస్థాయి పోటీల్లో రాణిస్తారని పేర్కొన్నారు. మెదక్ సర్కిల్‌కు క్రీడా మండలిలో తగిన ప్రాతినిధ్యం కల్పించి, ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



ప్రజాపక్షం/అల్లాదుర్గం : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. చిల్వర్ గ్రామ శివారులో పైపులైన్ లీకేజీ కారణంగా ప్రతిరోజూ వేల లీటర్ల విలువైన మంచినీరు వృథాగా పోతోంది. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తక్కువ ఉన్నందున మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులు ఎంత చెప్పినా ఇక్కడ మాత్రం అధికారుల నిర్లక్ష్యంతో పైపులైన్ లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి వృథా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని వెంటనే అరికట్టి, మంచినీటి వృథాను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా మిషన్ భగీరథ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరారు.

భారీగా బాణాసంచా నిల్వ




ప్రజాపక్షం/హత్నూర: అత్యంత ప్రమాదకరమైన పేలుడు స్వభావం గల టపాసుల అక్రమ నిల్వల వ్యవహారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుందిని సంబంధిత శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వాహకులు పెద్ద ఎత్తున బాణా సంచాలను డంప్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాలకు దగ్గరగా జనసంచారం ఉన్న చోట టపాసుల డబ్బాలను పెద్ద మొత్తంలో నిల్వ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మల్కాపూర్ గ్రామం బస్టాండ్ వద్ద నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న దుకాణ సముదాయంలో డిసిఎం వాహనంలో నుండి పెద్ద ఎత్తున టపాసుల డబ్బాలను అన్‌లోడ్ చేస్తున్న దృశ్యాన్ని స్థానికులు వారి సెల్‌ఫోన్‌లో కెమెరాలో బంధించారు. మందుగుండు సామాగ్రి జనవాసాలకు దగ్గర్లో నిల్వ చేయడం ద్వారా ఏదైన ఆనుకొని ప్రమాదం చోటు చేసుకుని విస్ఫోటం జరిగితే ప్రజల ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి



ప్రజాపక్షం/మాక్లూర్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఖేత్ బచావ్ అభియాన్‌లో భాగంగా భూసార పరిరక్షణ అలాగే ఎల్‌నినో ప్రభావంపై ఆరుతడి పంటలు, కూరగాయలు లాంటి తక్కువ నీటి పండే పంటలు సాగు చేస్తే బాగుంటుందని మండల వ్యవసాయాధికారిని పద్మ తెలిపారు. తక్కువ నీటితో పంటలు సాగు చేస్తే మంచిదని రైతులు నష్టపోకుంటా ఉంటారని అలాగే పంట మార్పిడి చేయాలని, సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు.

టిపిసిసి చీఫ్‌కు మున్నూరుకాపు సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : మున్నూరుకాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా భవన నిఆర్మాణానికి నిధులు మంజూరు చేయటం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం సామాజికవర్గ అభ్యున్నతికి, సంఘటిత శక్తికి కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర డిసిసిఅధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, రాంభూపాల్, జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రత్నాకర్, గోపికృష్ణ, రవికుమార్, పోతన్న, ప్రీతం పాల్గొన్నారు.

కెటిఆర్ మాటలన్నీ బూటకమే..

ప్రజలు నమ్మే పరిస్థితి లేదు! డిసిసి అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఘాటు వ్యాఖ్యలు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై నిర్మల్ డిసిసి అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కెటిఆర్ మాట్లాడుతున్న మాటలన్నీ బూటకమని, ఆయన వ్యాఖ్యలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, రైతుల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ , కెటిఆర్ అధికారంలో ఉన్నప్పటికీ రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయలేకపోయారని వెడ్మ బొజ్జు ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందించడంలో కూడా గత ప్రభుత్వం విఫలమైందని, ఎరువుల కొరతతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయడంతో పాటు వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

ఫాంహౌస్ పాలనకు ప్రజా పాలనకు తేడా ఇదే! కెసిఆర్ , కెటిఆర్‌లు ఫాంహౌస్ రాజకీయాలకే పరిమితమయ్యారని, ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని వెడ్మ బొజ్జు ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, రైతుల ఇబ్బందులు, నిరుద్యోగుల సమస్యలపై గతంలో స్పందించని నాయకులు ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉన్నారని స్పష్టం చేశారు. కెటిఆర్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు వాటిని విశ్వసించరని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రజలను మరోసారి మభ్యపెట్టలేరని వెడ్మ బొజ్జు ఘాటుగా వ్యాఖ్యానించారు.రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ప్రతిపక్షాలు చేసే విమర్శలకు ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోనే సమాధానం చెబుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్,నిర్మల్ టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఆకుల హరీష్ కుమార్,కాంగ్రెస్ నాయకులు రాకేష్, గణేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాపక్షం / మంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం కాసిపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలన్నారు. పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, పాఠశాలలకు అవసరమైన బెడ్స్ వెంటనే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దాపూర్‌లో భూ రీసర్వేను నాయబ్ తహసీల్దార్ అంజయ్యతో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి తహసీల్దార్లతో సమీక్షించారు. భూ రీసర్వే, జిఒ నంబర్ 59, 76 అమలు, భూభారతి, సింగరేణి భూ సమస్యల పెండింగ్ దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

ఎస్పి పరితోష్ పంకజ్



ప్రజాపక్షం/సంగారెడ్డి : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సకాలంలో మెరుగైన వైద్య చికిత్స అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రదాన మంత్రి రాహత్ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని 24 ఎంపానెల్ట్ ఆసుపత్రిలకు చెందిన వైద్యులు సాంకేతిక సిబ్బంది సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ పథకం కింద రోడ్డుప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50,000 వరకు ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ఎంపానెల్ట్ ఆసుపత్రులకు తరలించి ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన వైద్య సేవలు అందించాలని ఎస్పి సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే విషయంతో ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్యులు ఆరోగ్యశ్రీ ,సిబ్బంది ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి అర్హులైన ప్రతీ ప్రమాద భాదితుడికి ఉచిత వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రధాన మంత్రి పిఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి రోడ్డు ప్రమాద భాదితుడికి ఉచిత వైద్య చికిత్స అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పి చైతన్య రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సంబంధిత శాఖల అధికారులు 24 ఎంపానెల్ట్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి చరణ్,ఎస్ఐ, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ప్రవీణ్‌లు ప్రధాన మంత్రి పిఎం రాహత్, పథకానికి సంబంధించిన డిఎఆర్ అప్లికేషన్ వినియోగం పనితీరు నమోదు ప్రక్రియ అంశాలపై వివరించారు.

మద్దతు ధర అందేలా చర్యలు

నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/సారంగాపూర్: మండలంలోని ఆలూర్ గ్రామంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిజెపి ఎల్పి నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకునేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా బిజెపిఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు రైతులకు మరో శుభవార్త తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మల్ జిల్లాకు మొత్తం 89 గోదాములు మంజూరైనట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎ మ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బిజెపినాయకులు అయ్యన్నగారి భూమయ్య, సారంగాపూర్ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, అలూర్ గ్రామ సర్పంచ్,ఇర్ల చిన్నయ్య,మండల సర్పంచులు కరిపే విలాస్, బడి పోతన్న, గంగారెడ్డి, ఎల్లన్న, సాహెబ్ రావు,బిజెపినాయకులు రామ్ శంకర్ రెడ్డి,ఇర్ల విజయ్,తోట భోజన్న,వెంకటేష్, బిజెపికార్యకర్తలు గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు, రైతులు,సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

వేగవంతంగా భూముల రీసర్వే: కలెక్టర్

మాదాపూర్, ఎల్గటూర్‌లో రీసర్వే ప్రక్రియ



ప్రజాపక్షం/నిజామాబాద్ : రైతులు, భూ యజమానుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, మెండోరా మండలం ఎల్గటూర్‌లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌తోకలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ నిబంధనలకనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజు 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. సర్వే అనంతరం గ్రామసభలు నిర్వహిస్తూ ఎవరికైనా అభ్యంతరాలుంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించి వేగంగా పరిష్కరించాలన్నారు. రీసర్వే విషయంలో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలుంటే వాటిని నివృత్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రెవెన్యూ అధికారులు రైతులు న్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి



సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్ విలాస్

ప్రజాపక్షం/ఆదిలాబాద్: కరువుతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల పరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన రైతు సంఘం నేత చిలక దేవిదాస్‌తో కలిసి భీంపూర్ మండల దన్నూర్, వడ్డూర్, అర్లి గ్రామాల్లో పర్యటించారు. డిసెంబర్‌లోగా పార్టీ సభ్యత్వం పూర్తి చేయాలన్నారు. భూపోరాట భూములకు పట్టాలు, కారంజిదన్నూర్ రోడ్డు నిర్మాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రవి, వందన, దప్పుల సుజాత, మంత్రి భూమయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు పేదవారికి ఆర్థిక భరోసా

కలెక్టర్ కె. హరిత, ఎమ్మెల్యే పాల్వాయి



ప్రజాపక్షం/కాగజ్ నగర్/ ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న చేయూత పింఛన్లు పేదవారికి ఆర్థిక భరోసాగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ కె. హరిత పేర్కొన్నారు. గురువారం కాగజ్ నగర్ పురపాలక కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీఒక్కరికి పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 871 మందికి, మండలంలోని గ్రామ పంచాయతీలలో 781 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామని వివరించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూదివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, వయసు పైబడిన గీత కార్మికులకు సమాజంలో గౌరవ ప్రదమైన సామాజిక భద్రతతో కూడిన జీవితం గడపడానికి పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు. కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ పర్వీన్ సుల్తానా, వైస్ చైర్మన్ , మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంపిడిఒ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

శాఖ అనుమతులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. భూముల రీసర్వే ప్రక్రియలో అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో సరిహద్దు వివాదాలు పరిష్కరించాలని, వివి–జి రామ్ జి పథకం కింద చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జిల్లా అటవీ అధికారి బాలమణి మాట్లాడుతూ అక్రమ కలప రవాణా, అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. దేవిడ్, అదనపు ఎస్పి చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ ఆర్‌డిఒ లోకేశ్వర్ రావు, తహసీల్దార్లు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యుత్,రహదారులు,డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతీఒక్కరూ సహకరించాలని సూచించారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ వివి–జి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్,ఎంపిడిఒరామకృష్ణ,హౌసింగ్ డిఇగంగాధర్, సర్పంచ్ విలాస్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీ



ప్రజాపక్షం/బోధ్: బోధ్ మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో బోధ్ మండలానికి చెందిన వివిధ గ్రామాల 552 మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ కార్డుల ప్రొసీడింగ్స్‌ను బోధ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం ముఖ్యమని,ఆసరా పెన్షన్ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు,వితంతువులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు, సం బంధిత అధికారులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

సుతారిపల్లి పంచాయతీ ఫైళ్లకు భద్రత ఏదీ?



ప్రజాపక్షం/రామాయంపేట: రామాయంపేట మండ ల పరిధిలోని సుతారిపల్లి గ్రామంలో ప్రభుత్వ రికార్డు లు, పంచాయతీ కీలక పత్రాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గ్రామానికి గుండెకాయలాంటి పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ అత్యంత అస్తవ్యస్తంగా తయారైంది. అధికారుల ముందే కీలక పత్రాలు కార్యాలయంలో కుర్చీలపై బస్తాల మాదిరిగా మూటలు కట్టి పడవేసి ఉండడం అందరిని విస్మయానికి గురిచేసింది. ఇప్పటికైనా మండల, జిల్లా అధికారులు స్పందించి సుతారిపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డుల భద్రతపై సమగ్ర విచారణ చేపట్టి రికార్డులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాపక్షం Telugu National Daily

‘కోల సింధు’ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కెటిఆర్



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం నియోజకవర్గం వేమునూర్ గ్రామ సర్పంచ్ కోల లత కోడలు,కోల మహేష్ – లక్ష్మీ దంపతుల కుమార్తె, సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన “అండ్ డిఫైనేబుల్ గర్ల్” పుస్తకాన్ని ఈరోజు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా కేటీఆర్ కోల సింధు రచించిన పుస్తకాన్ని అభినందిస్తూ, ఆమె రచనా ప్రతిభను కొనియాడారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే రచనా రంగంలో ప్రతిభను చాటుతూ, సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కోల సింధు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మి రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,రామగుండం నియోజకవర్గానికి చెందిన వ్యాల్ల హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజా పక్షం/బీరుపూర్ : జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం చిన్న కోల్వాయి, కందేన కుంట గ్రామాల్లో 20 లక్షల చొప్పున నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ గ్రామ సర్పంచ్ తొడసం గంగవ్వ ఇస్రు,సర్వయ్య,ఎంపిడిఒ భీమేష్,ఎంపిఒ మధు,జిల్లా కెడిసిసి డైరెక్టర్ ముప్పాలరామచంద్రరావు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు హర్ష కోట రాజగోపాల్ రావు, పాక్స్ చైర్మన్ నవీన్ రావు,మండల పార్టీ అధ్యక్షుడు నారపాక రమేష్,సర్పంచ్లు రంగు లక్ష్మణ్,కొనపెల్లి శేఖర్,చిక్రమ్ మారుతి,తోట శ్రీనివాస్,చల్ల లక్ష్మణ్, బనుక సతీష్,ఎడ్ల సుషిన్, తొగిటి సత్తవ్వ బోడ సాగర్,వుర్క రామచందర్, మాజీ సర్పంచ్లు నల్ల మహిపాల్ రెడ్డి, దోసారాపు శ్రీనివాస్,చుంచు నరేందర్,నాయకులు తోగిటి సురేందర్ రామకిష్ట గంగాధర్,శీలం లింగన్న,జక్కినపెల్లి శ్రీనివాస రావు,ఎలగందుల అనిల్,మెరుగు రాజేశం,దండికె తిరుపతి,శీలం రమేష్,శీలం రవి,బద్ది భీమన్న,లస్యయ్య,చిక్రాం రామ్సాబ్ ఉప సర్పంచ్లు,వార్డు సభ్యులు ,నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

వేగంగా ఆలయ పునర్నిర్మాణం



ప్రజాపక్షం/ఎండపెల్లి : కోటిలింగాల ఆలయ పునర్నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను, రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారురానున్న గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో కోటిలింగాల పుణ్యక్షేత్రానికి వచ్చే అవకాశం ఉన్నందున పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపట్టాల్సిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటనే అంశాలను పరిశీలించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి,భక్తుల రాకపోకలకు అనువైన రహదారులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, వైద్య సదుపాయాలు,భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.కోటిలింగాల పుణ్యక్షేత్రానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్,తదితరులు ఉన్నారు.


భూ నిర్వాసితుల సమస్యలు సిఎం పరిష్కరించాలి

సిపిఐ పార్టీ కార్యదర్శి శివలింగ కృష్ణ



ప్రజాపక్షం/గజ్వేల్ : మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలు ‘rఎం రేవంత్ రెడ్డి పరిష్కరించాలని సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన సిద్దిపేటలో జరిగే బహిరంగ సభకు విచ్చేస్తున్నందున నిర్వాసితులు ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నట్లు తెలిపారు. అరచేతిలో వైకుంఠం చూపిన అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో ఆశలు చూపి, హామీలు ఇచ్చి నిర్వాసితులను నిండా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముంపు బాధితులకు ప్యాకేజీలలో భాగంగా ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్ మరియు ఒంటరి మహిళల ప్యాకేజీలు, వ్యవసాయ భూమి పరిహారం డబ్బులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని చెప్పారు. కన్నతల్లి లాంటి ఊరు పేరు మారుస్తుండగా, పాత ఊరు పేరుని కొనసాగించాలని కోరారు. గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేయగా, పదేళ్లపాటు ఇలాంటి పన్నులు వేయకుండా ప్రత్యేక జిఒ జారీ చేయాలని పేర్కొన్నారు. సర్వం కోల్పోయిన ముంపు బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని వివరించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థినులు ఎంపిక



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : అండర్14 హాకీ విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు.జ్యోతి పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.నిత్యశ్రీ, బి.నురక్షిత ఉమ్మడి జిల్లా స్థాయి హకి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ నెల 13వ తేదీన కామారెడ్డి జిల్లాలోని బిబిపేట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు,శ్రీధర్ రావు,మౌనిక రావు, అజిత రావు,విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయాన్ని సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అమలు

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమెల్యే ఆది శ్రీనివాస్



ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సంర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ సుమారు 18 గంటలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేది నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 8,209 పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.25.97 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ లాంటి పథకాలను కొనసాగిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. ఆగస్టు 01 వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని, ఆయా దరఖాస్తులను అధికారులు విచారణ చేయించామని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిట ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించే పనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించామని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వ చట్టం చేసిందని, త్వరలో అమలు కానున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ చైర్మెన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఎగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య, ఆర్డిఒ ఎస్ కుమారి, డిఆర్డిఒ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, వివిధ గ్రామాల సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు మహిళలు ల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే పనులు

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/ఎండపెల్లి : రీ సర్వే పనులను పకడ్బందీగా ,పారదర్శకంగానిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం జగదేవ్‌పేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూ ముల హద్దులు, విస్తీర్ణం,ఇతర రెవెన్యూ రికార్డుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు.సర్వే నిర్వహణ సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు,సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించేలా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను, పనుల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రతి షాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని,అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జగిత్యాల ఆర్డిఒ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఎడి,ఉన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల : మహిళా సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల పట్టణానికి చెందిన 57 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 57 లక్షల విలువ గల చెక్కులను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు, మోతె చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఏడాది క్రితమే నిధులు మంజూరైనప్పటికీ వర్షాలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు.జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. చెరువుల పునరుజ్జీవన పథకంలో 67 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 33 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా ఉంటుందని,కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి రూపంలో 18 శాతం వసూలు చేస్తోందని అన్నారు.మహిళల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య ,ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,ఉన్నారు.

సిఎం బహిరంగసభ వేదిక పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/ సిద్దిపేట : ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించే భారీ బహిరంగ సభ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించి సభ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం జిల్లా కేంద్రం నాగదేవత గుడ్ నుండి సిరిసిల్ల వెళ్ళే బైపాస్ రోడ్ వెంబడి దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభ నిర్వహణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భారీ బహిరంగ సభ ప్రాంగణం వేదిక, వివిఐపిలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మీడియా కోసం ఏర్పాటు చేయవలసిన ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వివిఐపిలు, అధికారుల వాహనాల పార్కింగ్, బందోబస్తు నిర్వహణ ప్రక్రియ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సిద్దిపేట ఆర్డీవో సదానందం, తహసిల్దార్ కిరణ్, పోలీస్ శాఖ, రెవెన్యూ, ఆర్‌అండ్ విద్యుత్, అధికారులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణపై సిపి దిశానిర్దేశం



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సిపి గౌస్ ఆలం అక్టోబర్–2026 నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరైన ఈ సమావేశంలో ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పురోగతి, రాబోయే పండుగల బందోబస్తుపై సమగ్ర సమీక్ష చేపట్టారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, ఫోక్సో కేసులు, ఎస్సి/ఎస్టి అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరు, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, ఈ–సమ్మన్స్, ఈ–సాక్ష్య అప్లికేషన్ల వినియోగం సిసిటిఎన్ఎస్ వ్యవస్థపై విస్తృతంగా సమీక్షించారు.పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు.నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని,అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జగిత్యాల ఆర్డిఒ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఎడి,ఉన్నారు. గుర్తించి రికవరీ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు .గం జాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ తరలింపు, ఇసుక అక్రమ రవాణా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి, ఆన్‌లైన్ పిటిషన్ల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించి పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని పేర్కొన్నారు. డయల్ 100/112 ద్వారా వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు.ఆస్తి సంబంధిత నేరాలు, సంచలనాత్మక కేసులను ఛేదించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేసి అభినందించారు.ఈ ఎసిపిలు శ్రీనివాస్ జి, వెంకటస్వామి, యాదగిరి స్వామి, విజయకుమార్, స్వామి, శ్రీనివాస్, మా ధవి, సతీష్ లతో పాటుగా అన్ని పోలీసు స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులు ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : అంగన్‌వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణ పనులు పూర్తికాగా గురువారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ సరైన పోషకాహారం అందించాలని అన్నారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని కేంద్రాలలో పోషకాహారం అందిస్తారని వివరించారు. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగుపరచడం, పోషకాహార పంపిణీ అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపిడిఒ రమేశ్, సర్పంచ్ మోర నిర్మల పాల్గొన్నారు.

‘ఎల్ నినో’ను ఎదుర్కోవడానికి ఆరుతడి పంటలే శరణ్యం

భూసార పరిరక్షణ, భూసార పరీక్షలపై నిపుణుల సూచనలు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : యాసంగి సీజన్‌లో ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. సుల్తానాబాద్ మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి ఆధ్వర్యంలో గురువారం ఖేతీ బచావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంచర్యామి,చిన్నబొంకుర్ గ్రామాల్లో రైతులకు ఎల్ నినో ప్రభావం, భూసార పరిరక్షణ, యాసంగిలో అనువైన ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి మాట్లాడుతూ, వరి కోత అనంతరం పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్ని సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానం, ఆరుతడి పంటల సాగు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా మొక్కజొన్న,ప్రొద్దుతిరుగుడు, జొన్న, నువ్వులు ,వేరుశనగ,అపరాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలను సంరక్షిస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలని,ఆయా పంటల సాగు విధానాలు,యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు.కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరిఖిల్ల శాస్త్రవేత్త వినోద్ మాట్లాడుతూ, భూసార పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శి రాజేష్, వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తలు,గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం పాఠశాల పక్కనే పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని 11వ వార్డులో పారిశుద్ధ్య లోపం తీవ్రంగా కనిపిస్తోంది. ఉర్దూ మీడియం పాఠశాల పక్కనే మురికి నీరు నిల్వ ఉండటం, చెత్తా చెదారం పేరుకుపోవడం, పందులు సంచరిస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దోమలు, ఈగల బెడదతో స్థానికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాల సమీపంలోనే మురికి నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండటం, అందులో చెత్తాచెదారం పేరుకుపోవడం పారిశుధ్య నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతోంది. మురికి నీటి పక్కనే పందులు సంచరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఆరోగ్యంపై ఇటువంటి అపరిశుభ్ర వాతావరణం ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. నిల్వ ఉన్న మురికి నీరు దోమల ఉత్పత్తికి అనుకూలంగా మారే అవకాశం ఉండటంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.విద్యార్థులు, స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. నిల్వ ఉన్న మురికి నీటిని తొల

అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాపక్షం/కామేపల్లి: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకుంటామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం కామేపల్లి రైతు వేదికలో చేయూత పింఛన్లు, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్తగా 4.50 లక్షల పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం రామకృష్ణపురంలో ఉపాధి హామీ నిధులు రూ. 39లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. గ్రామాల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సోమలాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, సర్పంచ్‌లు అజ్మీర బుల్లి హరి, అజ్మీర్ ధ్వాలి చిన్న, గుగులోతు రమాదేవి రవి, డిసిసి జిల్లా కార్యదర్శులు షేక్ పత్తేహమద్, గింజల నరసింహారెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు అరెం రవి, శివయ్య, హనుమంతరావు, మాజీ ఎంపిపి మాలోత్ సరిరాం నాయక్, దొడ్డిగర్ల సుందరం, రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత



ప్రజాపక్షం/మధిర: మధిర పట్టణాన్ని అన్ని రంగాల్లోను అగ్రగామిగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రథమ కర్తవ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక తీర్మానాలకు సభ్యులందరూ ఏకగ్రీవ ఆమోదముద్ర వేశారు. సమావేశం ముగిసిన అనంతరం చైర్‌పర్సన్ సుజాత మాట్లాడారు. మున్సిపాలిటీని ఆర్థికంగా మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలో అసెస్‌మెంట్ కాని ఆస్తులను, ఆన్‌లైన్ కాని అనధికార నల్లా కనెక్షన్లను గుర్తించి క్రమబద్ధీకరించేందుకు ఇంటింటి సర్వేను ముమ్మరం చేసినట్లు వివరించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య రంగానికి అత్యంత ప్రాధాన్యతమిస్తున్నామన్నారు. బయో మైనింగ్ పనుల వేగవంతం, వ్యర్థాల శుద్ధికి ఆధునిక యంత్రాల సమకూర్పుతో పాటు పారిశుద్ధ్య వాహనాల నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. పౌరుల ఫిర్యాదుల తక్షణ పరిష్కారం కోసం ప్రత్యేక వాట్సాప్ వ్యవస్థను, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు అత్యాధునిక స్వచ్ఛ ఎఐ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, పట్టణ ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశామని సామినేని సుజాత పేర్కొన్నారు. బోర్లు, మోటార్ల మరమ్మతు పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ పాల్, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్ఠ దర్యాప్తుతో నిందితులకు శిక్ష

'నేరసమీక్ష'లో సిపి సునీల్‌దత్



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : బాధితుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి పటిష్ఠమైన దర్యాప్తు చేసి నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా చేయాలని పోలీస్‌కమిషనర్ సునీల్‌దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం సిపి కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆయన నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. కేసుల ట్రయల్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమీక్ష నిర్వహించాలన్నారు. విచారణ సమయంలో తలెత్తిన లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. కేసులకు సంబంధించి సాక్ష్యాధారాలను ఇ–సాక్ష్యం యాప్‌లో నిబంధనల ప్రకారం నమోదు చేయాలన్నారు. దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి నిర్ణీత గడువులోపు చార్జ్‌షీట్‌లను న్యాయస్థానాల్లో దాఖాలు చేయాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలలో బాధితులకు వైద్య చికిత్స ఖర్చు తగ్గించేందుకు పిఎం రాహత్ పథకం ద్వారా నగదురహిత వైద్యం వలన కలిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇందుకు విస్తృతంగా పథకం గురించి ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో గంజాయి క్రయ, విక్రయాలు, రవాణాను కట్టడిచేయాలన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఆక్రమ ఇసుక రవాణాపై నిఘా ఉంచి దానికి అడ్డుకట్టవేయాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సెకండ్‌హ్యాండ్ వాహనాల క్రయ విక్రయాలపై దృష్టిసారించి వాటికి సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పత్రాలు లేని వాహనాల విక్రయాలు జరగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సిపి ఆదేశించారు. ఈ సమీక్షలో అడిషనల్ డిసిపి భోజారామానుజం, ఎసిపిలు ఎస్ వెంకటరమణమూర్తి, తిరుపతిరెడ్డి, సారంగపాణి, సాంబరాజు, శ్రీనివాసులు, నరసింహారావు, సర్వర్, సత్యనారాయణ, వివిధ స్టేషన్ల సిఐలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తులో వేగం

పోలీస్ విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులకు సూచించారు. గురువారం వైరా పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. సిసిటిఎన్‌ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

కరువుకు ముందే కాటేస్తున్న ధరలు

జన జీవితంపై ధరాభారం
కృత్రిమ కొరతతో పెరుగుతున్న ధరలు
బుస్సుమంటున్న నూనె...
భగ్గుమంటున్న బియ్యం



ప్రజాపక్షం/ ఖమ్మం : కరువు కారణంగా ఉత్పత్తి తగ్గిపోయి కొరత ఏర్పడినప్పుడు ధరలు పెరగడం సహజమే. ప్రజలకు అవసరమైనంత నిల్వలు లేనప్పుడు ఇటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. అలా కాకుండా రానున్న కాలంలో వచ్చే కొరతను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడే ధరలు పెంచడం, బ్లాక్ మార్కెట్‌లో నిల్వ చేయడం, కృత్రిమ కొరతను సృష్టించడం అధికార యంత్రాంగం మౌనంగా ఉండటం ప్రజలకు శాపంగా మారింది. కరువుకు ముందే ధరలు కాటేస్తున్నాయి. వాస్తవానికి గతేడాది ఖరీఫ్, రబీలోనూ రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగింది. గోదాములే ఖాళీ లేవని భారతదేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచామంటూ అమాత్యుల ప్రకటనలు చూశాం. నాలుగు నెలలు తిరగకముందే బియ్యం కొరత ఎలా ఏర్పడింది. కిలో రూ.40 నుంచి ఏకంగా రూ. 100కు ఎలా చేరిందన్న దానిపై అధికార యం త్రాంగం మౌనంగా ఉంది. ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోకపోవడంతో బ్లాక్ మార్కెటర్లు పెరిగి ప్రజలను దోచుకుంటున్నారు. సహజంగా కరువు ఉన్న ఏడాది కంటే ఆ తర్వాత సంవత్సరంలో దాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది అనేక దశాబ్దాల నుంచి అనుభవిస్తున్నదే. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయన్న ప్రచార నేపథ్యం లోనూ గతేడాది ఖరీఫ్‌తో పోల్చినప్పుడు కేవలం 13 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు తగ్గింది. గతేడాది 64 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా ఈ ఏడాది 53 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వాస్తవ పరిస్థితి ఈవిధంగా ఉంటే ఎక్కడ బియ్యం కొరత వచ్చిందని బియ్యం ధరలు భగ్గున మండేలా చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కరువుకు సంబంధం లేని అనేక వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. కొన్ని వస్తువుల ధరలు వారానికి ఒకసారి పెరుగుతుంటే మరికొన్నింటి ధరలు నెలనెల పెరిగిపోతున్నాయి. కంపెనీలు తయారు చేసే సబ్బులు, పేస్టులు, ఇతర వస్తువులు కూడా ఎల్ నినో ప్రభావంతో ధరలు పెరుగుతున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉంది. నూనెల ధరలు బుస్సుమంటున్నాయి. పప్పు, ఉప్పు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కొనే పరిస్థితి లేదు. కేవలం పాలక వర్గాల ఉదాసీనత ఈ పరిస్థితికి కారణమవుతుంది. కష్టపడి పండించే రైతుకు గిట్టుబాటు ధర కల్పించలేని పాలకులు పారిశ్రామిక వేత్తలకు మాత్రం ధరలు పెంచుకునే అధికారాన్ని వారికి కట్టబెట్టి ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారు. పెరిగిన ధరలతో ప్రజలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఇదే సమయంలో ఉపాధి అవకాశాలు సైతం సన్నగిల్లుతున్నాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీలకు ఉపాధి క్రమేణా కరువవుతుంది. రబీలో పంటలు సాగు చేయవద్దన్న ప్రచారం ఆరుతడి పంటలే సాగు చేయాలన్న ఒత్తిడి వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువయ్యేందుకు కారణమవుతుంది. మరో పక్క రియల్ ఎస్టేట్ సంక్షోభంలో కూరుకుపోవడంతో పట్టణ పేదలకు పని దొరకడం లేదు. గతంలో భవన నిర్మాణ రంగం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. ఇప్పుడు పూర్తిగా స్తంభించింది. గతంతో పోల్చినప్పుడు భవన నిర్మాణ రంగం 80 నుంచి 90 శాతం మేర కుంటుపడింది. దీనితో అటు గ్రామీణ పేదలు, ఇటు పట్టణ పేదలు కూడా ఉపాధి కోల్పోతున్నారు. ఒక పక్క ఉపాధి లేకపోవడం, మరో పక్క ధరాఘాతం పేద, సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వేళ పాలక వర్గాలు ఉపాధిపై దృష్టిసారించాల్సి ఉంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లే కుండా వివి –జి రామ్ జీ పథకం ద్వారా తక్షణం పనులు ప్రారంభించాల్సి ఉంది. అదే సమయంలో ధరలను నియంత్రిస్తే తప్ప సామాన్యులు బతికే పరిస్థితి లేదు. పాలకులు ధరల నియంత్రణపై దృష్టిసారించాలని, ఉపాధి పనులను విస్తరించాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కమిషనర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయి, స్లాబ్ స్థాయికి చేరుకున్నాయి, గోడల నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లు ఎన్ని, ప్లాస్టరింగ్, కలరింగ్ పనులు జరుగుతున్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్, తాగునీటి ఏర్పాటు పనులను పరిశీలించా రు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పా టిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అవసరమైన మౌ లిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ నవ్య జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు సొంత గూడు

రూ.7.20 కోట్లతో 72 సమాఖ్య భవనాలు
మహిళా సాధికారతే లక్ష్యంగా కూనంనేని ముందడుగు
నాలుగు మండలాల్లో వేగంగా భవన నిర్మాణ పనులు





ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల మహిళా సమావేశాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకూడదనే సదుద్దేశంతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవచూపి నియోజకవర్గానికి 72 గ్రామ సమాఖ్య (విఒ) భవనాలను మంజూరు చేయించారు. ఒక్కో భవనానికి రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.7కోట్ల 20 లక్షల వ్యయంతో వీటి నిర్మాణాలను చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఈ భవనాలు కేటాయించగా సుజాతనగర్ మండలానికి 13 భవనాలు మంజూరు కాగా ఇప్పటికే ఒక భవనం పూర్తయి ప్రారంభం కాగా మరో 8 భవనాలు తుదిదశకు చేరుకున్నాయి. నాలుగు భవనాలు నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. చుంచుపల్లి మండలంలోని 17 భవనాలకు గానూ ఇంక్లైన్ వెంకటేశ్వర కాలనీ, అంబేద్కర్‌నగర్ ప్రాంతాల్లో రెండు భవనాలు ప్రారంభం కాగా మరో 14 భవనాల పనులు వేగంగా సాగుతున్నాయి. ఒక భవనం నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. లక్ష్మీ దేవిపల్లి మండలంలోని 21 భవనాలకు 9 భవనాలు, పాల్వంచ మండలంలో 21 భవనాలకు గానూ 14 భవనాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మిగిలిన భవనాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు జరగనున్నాయి. మంజూరైన 72 భవనాల్లో ఎక్కడైనా స్థల సమస్యలు ఎదురైతే తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కూనంనేని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి రాబోయే మూడు నాలుగు నెలల్లో మొత్తం భవనాలను పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోనికి తీసుకురావాలని స్పష్టం చేశారు. గ్రామీణ మహిళలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కూడా సొంత భవనాలు సమకూర్చేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా త్వరలోనే పట్టణ ప్రాంత సమాఖ్యల కోసం మరో 50 నూతన భవనాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఊపిరిగా ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎమ్మెల్యే కూనంనేని అహర్నిశలు శ్రమిస్తున్నారు. మాటలకంటే చేతలకు ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయల నిధులను రాబట్టి కొత్తగూడెం రూపురేఖలను సమూలంగా మారుస్తున్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచుతూ వారి ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాదులు వేస్తున్న దార్శనిక నేతగా ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాల్పంచుకుంటూ అందిస్తున్న ఈ విశేష సేవలు నియోజకవర్గ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగింది. మహిళా సాధికారత కోసం ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవ పట్ల నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎల్ నినో ప్రభావంతో..
దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోండి

వడ్డీ రాయితీ పెంచాలి
మహాజన సభలో
బాగం హేమంతరావు వినతి



ప్రజాపక్షం/ ఖమ్మం : ఎల్ నినో కారణంగా దెబ్బతిన్న రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో కేంద్ర ప్రభుత్వం రుణాలపై ఇస్తున్న మూడు శాతం రాయితీని నాలుగు శాతానికి పెంచి ఆదుకోవాలని సిపిఐ నాయకులు, ముటాపురం ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు బాగం హేమంతరావు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు చేయాలని ఆయన కోరారు. ఇందుకు పిఐసి కమిటీ చైర్మన్, కలెక్టర్ దివాకర టిఎస్ సానుకూలంగా స్పందించారు. ఖమ్మం కేంద్ర సహకార బ్యాంకు 129వ మహాజన సభ గురువారం డిసిసిబిలో జరిగింది. కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2025 –26 సంవత్సరానికి సంబంధించి వార్షిక నివేదిక, ఖర్చులు, లాభాలు, అడిట్ రిపోర్టులను సమావేశం ఆమోదించింది. ఎ క్లాస్ సంఘాలకు డివిడెంట్ చెల్లించటకు ఉద్యోగులకు ఇన్సెంటివ్ ఇచ్చేందుకు కూడా సమావేశం ఆమోదించింది. ఈ సమయంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు రైతు రుణాలపై మారిటోరియం ప్రకటించాలని కోరారు. వివిధ సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ కలెక్షన్ సెంటర్లను పెంచాలని, సౌర విద్యుత్ వ్యాపారానికి సహకార సంఘాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని తద్వారా దళారుల నుంచి రైతులను కాపాడాలని కోరారు. వ్యవసాయేతర సంఘాలకు సంబంధించిన కొందరు మత్స్య సహకార సంఘాల సభ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఇటీవల బేతుపల్లి రిస్యూ ఆపరేషన్ సందర్భంగా కలెక్టర్ వ్యవహరించిన తీరును, ఆయన కృషిని మహాజన సభ అభినందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాజన సభలో సభ్యులు ప్రతిపాదించిన అనేక అంశాల గురించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘాల అధ్యక్షులు బ్యాంకుల సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు సిఇఒ ఎన్. వెంకట ఆదిత్య, డిసిఒ జి. గంగాధర్, కొత్తగూడెం డిసిఒ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి పుల్లారావు, బ్యాంక్ డిజిఎం ఉదయశ్రీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిట్టిబాబు మరణం తీరనిలోటు


ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/భద్రాచలం : ఆటో యూనియన్ (ఎఐటియుసి) గణేష్ టెంపుల్ అధ్య, సిపిఐ సీనియర్ నాయకుడు గుగులోతు చిట్టిబాబు అకాల మరణం ఆ కుటుంబానికి, కార్మిక ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చిట్టిబాబు మరణ వార్త తెలుసుకున్న ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి లక్ష్మీ దేవిపల్లి మండలంలోని సీతారాంపురం గ్రామపంచాయతీ మాన్‌సింగ్ తండాలోని ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యాన్ని చెప్పారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఎఐటియుసి తరుపున అనేక పోరాటాలు చేశారని, కార్మికుల శ్రేయస్సు కోసం ఆయన చేసి కృషి వెలకట్టలేనిది అన్నారు. మోతిరామ్, హతీరామ్, రవి, గోవింద్ , భద్రు చింటు శ్రీను తో పాటు తదితరులు ఉన్నారు.

నలుగురి ప్రాణాలు బలిగొన్న మంత్రాల భయం

అనుమానంతో ఇద్దరు....
ఆవేశంలో మరో ఇద్దరు
బుడగలలో దంపతుల ఆత్మహత్య



ప్రజాపక్షం/ మణుగూరు : మంత్రాల భయం నలుగురి ప్రాణాలను బలిగొన్నది. మంత్ర శక్తులు ఉన్నాయని అనుమానంతో ఇద్దరిని హత్యచేస్తే, తమ కారణంగానే ఆ ఇద్దరు హత్యకు గురయ్యారని భార్యాభర్తలిద్దరూ ఘర్షణపడి ఆవేశంలో పురుగుమందు తాగి మరణించిన ఘటన మణుగూరు మండలం బుడగలలో చోటు చేసుకుంది. ఇప్పటికే మణుగూరు సబ్ డివిజన్‌లో మంత్రాల నెపంతో హత్యలు జరుగుతున్న నేపథ్యంలో భార్యాభర్తల ఆత్మహత్య ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే... బద్దం రాంబాబు (32), బద్దం సునీత (28) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొద్ది రోజుల క్రితం మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో బద్దం మాసయ్య, బీమయ్య అనే ఇద్దరు వృద్ధులను ఆళ్లపల్లి మండలంలోని అటవీ ప్రాంతంలో చంపి పూడ్చిపెట్టారు. మాసయ్య కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించగా కొందరు వ్యక్తులు మాసయ్య, బీమయ్యలకు మంత్రాలు వస్తాయన్న నెపంతో హత్యచేసినట్లు తెలిసింది. ఈ కేసు పోలీస్ విచారణలో ఉండగా మాసయ్య కుమారుడు, కోడలు ఆత్మహత్య చేసుకున్నారు. మాసయ్య కుమారుడు రాంబాబు చిన్న కుమార్తెకు ఆరోగ్యం సరిగ్గా లేదు. చిన్నపాప అనారోగ్యంగా ఉండడంతో ఆళ్లపల్లి మండలం బూసురాయి గ్రామానికి చెందిన బీమయ్యను తీసుకువచ్చి పాప ఆరోగ్యం కోసం పూజలు చేశారు. పాప ఆరోగ్యం కోసం పూజలు చేయడం వల్లే మాసయ్యను హత్య చేశారని రాంబాబు దంపతుల మధ్య రెండు రోజులుగా ఘర్షణ జరుగుతుంది. ఈ ఘర్షణ నేపథ్యంలో ఆవేశానికి గురైన సునీత పురుగుమందు తాగి ఆ విషయాన్ని భర్తకు తెలిపింది. దీనితో భర్త రాంబాబు సైతం ఆవేశానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందును తాగి అడవిలోకి పరిగెత్తాడు. గ్రామస్తులు, బంధువులు పరిగెడుతున్న అతన్ని పట్టుకుని తొలుత మణుగూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి భద్రాచలం ఏరి యా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాంబాబు సైతం మృతిచెందాడు. దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో అనారోగ్యంతో ఉన్న రాంబాబు పిల్లలు అనాథలయ్యారు. సిఐ నాగబాబు నేతృత్వంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులైన పేదలకు పెన్షన్లే ఆర్థిక భరోసా

అదే వారికి ఆత్మస్థైర్యం
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: అర్హులైన పేదలకు సామాజిక భద్రత పెన్షన్లు ఎంతో ఆర్థిక భరోసానిస్తాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గంలోని వితంతువులు దివ్యాంగులు ఒంటరి మహిళలకు చేయూత పెన్షన్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 3,928మందికి కొత్త చేయూత పెన్షన్లు మంజూరు అయ్యాయని, నియోజకవర్గంలో 30వేల మంది లబ్ధిదారులను గుర్తించామని, వారికి కూడా విడతల వారీగా మంజూరవుతాయని చెప్పారు. ఇందులో భాగంగా చుంచుపల్లి మండలానికి 562, లక్ష్మీ దేవిపల్లి మండలానికి 566 మంజూరీ పత్రాలను పంపిణీ చేస్తునట్లు వివరించారు. అదే విధంగా సుజాతనగర్ మండలానికి 228, పాల్వంచ మండలానికి 919, కొత్తగూడెం పట్టణానికి 1185 చొప్పున పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించేందుకు, వితంతువులు, ఒంటరి మహిళల కనీస అవసరాలకు ఈ పెన్షన్ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో దరఖాస్తు చేసుకుని వివిధ సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన అర్హులైన లబ్ధిదారుల పెన్షన్లను కూడా త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. డిఆర్‌డిఒ పిడి విద్యాచందన, ఆర్‌డిఒ మధు, సిఇఒ నాగలక్ష్మి, ఎంపిడిఒలు సుభాషిణి, సుస్మిత, ఎంపిఒ సందీప్, డిపిఒలు సాంబయ్య, అనూష, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, లైబ్రరీ, వ్యవసాయ కమిటీ చైర్మన్లు వీరబాబు, లాలొసింగ్, సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పేదల సంక్షేమానికి పెద్దపీట

'సుడా' చైర్మన్ పువ్వాళ్ల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అభివృద్ధి, పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారధ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల

రూ. 7 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తా

• 'ఆప్' జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ ముఠా బెదిరింపు • పోలీసులకు ఫిర్యాదు చేసిన పార్టీ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్



మొహాలీ : ఢిల్లీ మాజీ ముఖ్య మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీకి చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఫిర్యాదు మేరకు పంజాబ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూ. 7 కోట్లు ఇవ్వాలని లేదం టే అరవింద్ కేజ్రీవాల్, ఆయన కుమార్తెను చంపేస్తామని బెదిరిస్తూ తనకు సందేశం వచ్చిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆప్ ఎమ్మెల్యే మొహాలీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు బిఎన్ఎస్, ఐటి చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈనెల 6న తన మొబైల్ ఫోన్‌కు ఒక వ్యక్తి నుంచి ఫోన్ కాల్, వాట్సాప్ సందేశం వచ్చాయని, ఆ వ్యక్తి తాను లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందినవాడినని చెప్పుకున్నాడని మొహాలీ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు సమర్పించిన ఫిర్యాదులో తిలక్ నగర్ ఎమ్మెల్యే జ్ఞల్ సింగ్ పేర్కొన్నారు. ఆ వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్‌ను రూ. 7 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, ఒకవేళ డబ్బు చెల్లించకపోతే కేజ్రీవాల్, ఆయన కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌ను చంపేస్తానని బెదిరించాడని ఆప్ ఎమ్మెల్యే తన ఫిర్యాదులో తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో భాగమైన తన ఫిర్యాదులో సదరు వ్యక్తి 'నేను లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి మాట్లాడుతున్నాను. అరవింద్ కేజ్రీవాల్‌కు చెప్పు, రూ. 7 కోట్లు ఇవ్వాలి. లేదంటే అరవింద్ కేజ్రీవాల్‌ను, అతని కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌ను చంపేస్తాను' అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఒక ప్రముఖ వ్యక్తి కావడంతో, ఈ బెదిరింపు జాతీయ భద్రతకు, ప్రజా భద్రతకు ముప్పుగా మారింది. నిందితుడు, ఒక ప్రజా ప్రతినిధిగా ఉన్న తన హోదాను అక్రమంగా ఉపయోగించుకుని, అరవింద్ కేజ్రీవాల్‌ను, ఆయన కుటుంబాన్ని బెదిరించడమే కాకుండా, డబ్బు కోసం డిమాండ్ చేశాడు. నిందితుడు చేసిన ఈ చర్యలు తీవ్రమైన నేరాల కిందకు వస్తాయి అని సింగ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరగక ముందే నిందితుడిని పట్టుకోవాలని, ఇందుకోసం కాల్ డీటెయిల్ రికార్డులు (సిడిఆర్ఎస్), నిందితుడి లొకేషన్‌ను గుర్తించేలా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఢిల్లీ ఎమ్మెల్యే కోరారు. అంతేకాకుండా, లక్షిత వ్యక్తులకు పూర్తి రక్షణ కల్పించేందుకు సంబంధిత చట్ట అమలు సంస్థలు, భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులకు... భారత్‌ను

మీ చిరునామాగా చేసుకోండి

• సిఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పిలుపు

విశాఖపట్నం: ప్రపంచ పెట్టుబడిదారులు పరిశ్రమల నాణ్యత, సుస్థిరతపై దృష్టిసారించాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కోరారు. ఆయన ప్రపంచ పెట్టుబడిదారులను పెట్టుబడుల కోసం ఆహ్వానించారు. గురువారం ఇక్కడ జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) భాగస్వామ్య సదస్సును ఉద్దేశించి పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ, ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల నడుమ పెట్టుబడులకు భారతదేశం ఒక సురక్షితమైన గమ్యస్థానమని అన్నారు. తదుపరి ఫ్యాక్టరీ, డిజైన్ సెంటర్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల కోసం 'భారతదేశాన్ని మీ చిరునామాగా చేసుకోండి' అని పిలుపునిచ్చారు.దేశం పలు రంగాలలో అపారమైన అవకాశాలను అందిస్తున్నందున, భారతదేశంలో వ్యాపార అవకాశాలను అన్వేషించాలని కూడా ఆయన వాణిజ్య భాగస్వాములను కోరారు. ఫ్యాక్టరీలు, హోటళ్లు, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి. ఎందుకంటే, భారతదేశం సురక్షితమైన గమ్యస్థానం అని గోయల్ పేర్కొన్నారు. గత 4 ఏళ్లలో ప్రపంచ డిజిపిలో 60 ట్రిలియన్ డాలర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 38 అభివృద్ధి చెందుతున్న దేశాలతో భారతదేశం 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసిందని చెప్పారు. 'వాణిజ్య ఒప్పందాలపై కొనసాగుతున్న చర్చలలో, ఈ మొత్తం 85 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉందని, ఇది 115 ట్రిలియన్ డాలర్ల ప్రపంచ జిడిపిలో సుమారు ముప్పావు వంతు అని ఆయన తెలియజేశారు. 'ఇది భారతీయ వ్యాపారాలకు, ఉత్పత్తులు, సేవలకు, ప్రతిభకు, దేశంలోని 2.5లక్షల స్టార్టప్‌లకు అపారమైన అవకాశాలను కల్పిస్తుంది' అని ఆయన చెప్పారు. 'మీ తదుపరి ప్లాంట్, ఆర్ అండ్ డి సెంటర్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ లేదా డిజైన్ సెంటర్‌కు భారతదేశాన్ని చిరునామాగా చేసుకోండి' అని పెట్టుబడిదారులకు మంత్రి పీయూష్ గోయల్ విజ్ఞప్తి చేశారు. పరిశ్రమను ఉద్దేశించి మాట్లాడుతూ, సుస్థిరత, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ నాణ్యతా ప్రమాణాల విషయంలో ముందుండాలని కోరారు. విశాఖపట్నంలో ఉక్కు నుంచి సిలికాన్ వరకు ఓర్వకల్‌లో డ్రోన్ సిటీ, తిరుపతిలో అంతరిక్ష నగరం, పుడిమాడలో భారతదేశపు మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్ వంటి వాటితో ఆంధ్రప్రదేశ్, దేశం భవిష్యత్‌కు సిద్ధంగా ఉండే సామర్థ్యాలను నిర్మిస్తున్నాయని పీయూష్ గోయల్ తెలిపారు. ఐటి విప్లవాన్ని ముందుగానే ఊహించడం మొదలు ప్రణాళికలు రచించడం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న దీర్ఘకాలిక దృష్టిని మంత్రి పీయూష్ ప్రశంసల్లో ముంచెత్తారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ ఇంజనీరింగ్, డేటా సెంటర్లు, అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ వంటివి కాలానికి చాలాముందే సాధ్యమయ్యాయి. ప్రపంచం ఇప్పటికీ వ్యాపారం చేసే సౌలభ్యం గురించి మాట్లాడుతుండగా, ఆంధ్రప్రదేశ్ ఆ సంభాషణను వ్యాపారం చేసే వేగం వైపు మళ్లించిందని మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. సకాలంలో పంపిణీ చేసేందుకు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్క్రో ఖాతా యంత్రాంగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.



'సబ్ చంగా సీ'..

'సబ్ మెహంగా సీ' అయింది

నిత్యావసర ధరల పెరుగుదలపై కాంగ్రెస్ విమర్శలు

మోదీ విధానాలపై జైరామ్ రమేశ్ వ్యంగ్య వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : దేశంలో నిత్యావసరాల ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ విషయమై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ప్రభుత్వ ప్రకటనలు, హామీల కంటే, ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారని చురకలంటించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ.. పాలు, బియ్యం, పిండి, పప్పుధాన్యాలు, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టమోటాలు, చక్కెర, నెయ్యి వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, అమూల్, మదర్ డైరీ సంస్థలు మరోసారి పాల ధరలను పెంచాయని తెలిపారు. 'అచ్చే దిన్' (మంచి రోజులు) వస్తాయని హామీ ఇచ్చారని, కానీ ప్రతిరోజూ పెరుగుతున్న ధరలతో ప్రజలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయని ఆయన గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రధానిని ఉద్దేశించి ఆయన, ఒకప్పుడు మీరు 'సబ్ చంగా సీ' (అంతా బాగుంది) అని చెప్పారు, కానీ ఇప్పుడు పరిస్థితి 'సబ్ మెహంగా సీ' (అంతా ఖరీదైపోయింది!) అన్నట్లుగా తయారైంది' అని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలు పేద, మధ్యతరగతి ప్రజల జేబులకు పదేపదే చిల్లులు పెడుతున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చిన ఈ 'మోదానీ' ప్రభుత్వ హయాంలో, ద్రవ్యోల్బణం భారం మొత్తం కేవలం మధ్యతరగతి, పేద ప్రజలపైనే పడుతోందని ఆయన అన్నారు. వంటగది నుంచి నిత్య వినియోగ వస్తువుల వరకు ప్రతిరోజూ పెరుగుతున్న ధరలు సామాన్యుల కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేశాయని ఆయన పేర్కొన్నారు. దీపావళి తర్వాత హిందుస్థాన్ యునిలీవర్ వంటి ప్రముఖ సంస్థలు డిటర్జెంట్లు, గృహ వినియోగ ఉత్పత్తుల ధరలను 11 శాతం వరకు పెంచాయని ఆయన ఆరోపించారు. సర్ఫ్ ఎక్సెల్, రిన్, వీల్, మోతీ గులాబ్ సోపు వంటి నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం అబద్ధపు వాదనలతో కాలక్షేపం చేస్తుంటే, సామాన్యుల జేబులకు ఇంకెంత కాలం చిల్లులు పడతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'ఈ దేశ ప్రజలకు ప్రభుత్వ ప్రకటనలు, విధానపరమైన హామీలు అక్కర్లేదు; ద్రవ్యోల్బణాన్ని సమర్థవంతంగా అదుపులోకి తీసుకురావాలన్నదే మా డిమాండ్ అని రమేష్ తన పోస్టులో పేర్కొన్నారు.

'సామాజిక్ పరివర్తన మోర్చా'

యుపి అసెంబ్లీ ఎన్నికలకు ఎఐఎంఐఎం, ఆజాద్ సమాజ్ పార్టీ మధ్య పొడిచిన పొత్తు



లక్నో : ఉత్తరప్రదేశ్ వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు పలు పార్టీలు సమాయత్తమవుతూ పొత్తులపై దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎం, చంద్రశేఖర్ ఆజాద్‌కు చెందిన ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) కలిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు 'సామాజిక్ పరివర్తన మోర్చా'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. గురువారంలక్నోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎఐఎంఐఎం అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ సమక్షంలో చంద్రశేఖర్ ఆజాద్ ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే, ఈ కూటమి 'విశాల దృక్పథం'తో కూడినదని, ఉత్తర ప్రదేశ్‌లో బిజెపిని మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలనుకుంటే.. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో సహా మరే ఇతర పార్టీ అయినా తమ కూటమికి మద్దతుగా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కూటమిని 'మూడవ కూటమి' (థర్డ్ ఫ్రంట్) అని పిలవడాన్ని తిరస్కరించిన ఆజాద్, ఇది సమాజంలోని అణగారిన, పీడిత, అట్టడుగు వర్గాలకు ఒక బలమైన రాజకీయ వేదికగా మారుతుందని పేర్కొన్నారు.'దీనిని కొందరు మూడవ కూటమి అని పిలుస్తున్నారు, కానీ ఇది మూడవ కూటమి కాదు. ఇది 'సామాజిక్ పరివర్తన మోర్చా'. దీని అంతరాలను అర్థం చేసుకుంటే, ఇది నిజానికి 'మొదటి కూటమి' అని మీకు అర్థమవుతుంది' అని ఆయన అన్నారు.ఈ కూటమి బలహీన, అణగారిన వర్గాలను ఏకం చేసి, వారి ఎన్నికల శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా రాజకీయ అధికారాన్ని సాధించేలా, వారి సమస్యలను పరిష్కరించుకునేలా కృషి చేస్తుందని ఆజాద్ చెప్పారు. యుపి అసెంబ్లీ ఎన్నికలకు ఎఐఎంఐఎం, మధ్య పొడిచిన పొత్తు బి.ఆర్. అంబేద్కర్ మాటలను ఉటంకిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి రాజకీయ అధికారమే 'మాస్టర్ కీ' అని ఆయన పేర్కొన్నారు. ఎంత జనాభా ఉన్నప్పటికీ, సొంత రాజకీయ సంస్థ లేని వర్గాలు తమ ప్రయోజనాలను సమర్థవంతంగా కాపాడుకోలేవని ఆయన అన్నారు. అప్పటికే ఉన్న రాజకీయ పార్టీలు అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు తగిన ప్రాతినిధ్యం వహించవని గ్రహించిన అంబేద్కర్, 'షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్', 'ఇండియన్ లేబర్ పార్టీ', 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా' వంటి రాజకీయ సంస్థలను ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. అణగారిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం, పేదరికాన్ని నిర్మూలించడం, వారిపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడం వంటి హామీలను నెరవేర్చడంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆజాద్ ఆరోపించారు.

తూటాలతో ఎస్‌పిఒ మృతదేహాలు ఛిద్రం

జమ్ముకశ్మీర్‌లో కలకలం

• ఒకవైపు ఉగ్రదాడులు, మరోవైపు పోలీసుల అదృశ్యం

జమ్ము : జమ్ముకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఇద్దరు స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల (ఎస్‌పిఒ) మృతదేహాలు తూటాలతో ఛిద్రమైన స్థితిలో లభ్యం కావడం తీవ్ర కలకల రేపింది. మారుమూల దచ్ఛన్ ప్రాంతం నుంచి వారు బుధవారం అదృశ్యమయ్యారు. ఇదే రోజున కుల్గాంలోని సిఆర్‌పిఎఫ్ చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు జరిగాయి. అయితే మృతుల సర్వీస్ ఆయుధాలు లభ్యం కాలేదు. వీటిలో ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక .303 రైఫిల్‌తో పాటు కొన్ని మ్యాగజైన్‌లు, మందుగుండు సామగ్రి ఉన్నాయని, వీటిని ఉగ్రవాదులు తీసుకువెళ్లినట్లు భావిస్తున్నారని అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో పాకిస్థాన్‌కు చెందిన ఆర్మర్–పియర్సింగ్ (ఎపి) స్టీల్–కోర్ మందుగుండు సామగ్రికి చెందిన ఖాళీ తూటాలు లభించాయని వారు చెప్పారు. దాడి చేసిన వారిని గుర్తించి, వెంబడించి, మట్టుబెట్టడానికి భారీ ఆపరేషన్ కొనసాగుతోంది అని ఒక అధికారి తెలిపారు. మృతులైన ఇద్దరు ఎస్‌పిఒలను బాబీ చంద్ (57), రప్పాల్ కుమార్ (45)గా గుర్తించారు. వారు దాచన్‌లోని కియార్ గ్రామంలో స్థానిక పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఒజి)లో పోస్టింగ్ పొందారు. ధర్నామార్వా వద్ద గస్తీ విధి కోసం తమ క్యాంప్ నుండి ఆర్మీ పోస్ట్‌కు వెళ్తుండగా బుధవారం వారు అదృశ్యమయ్యారు. వారు స్థానికులే నని, ఆ ప్రాంత భౌగోళిక స్వరూపంపై వారికి అవగాహన ఉందని ఒక అధికారి తెలిపారు. వారి మొబైల్ ఫోన్లు మొదట్లో అందుబాటులో ఉన్నప్పటికీ, తర్వాత స్విచ్ ఆఫ్ చేయబడ్డాయి. దీంతో ఆందోళనలు తలెత్తి, విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. భద్రతా దళాలు ఈ తెల్లవారుజామున అదనపు బలగాలను పంపి, డ్రోన్లు, జాగిలాలతో కూడిన ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాయి. కియార్ చుట్టుపక్కల విస్తృత ప్రాంతం, ధర్నామార్వా వైపు వెళ్లే మార్గంలో గాలింపు కొనసాగిస్తున్నారు. డ్రోన్లు దుర్గమమైన అటవీ ప్రాంతాలను గాలిస్తుండగా, జాగిలాలు భూతల బృందాలకు వారి కదలికలను గుర్తించడంలో సహాయపడ్డాయి. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో బుధవారం సిఆర్‌పిఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడిలో ముగ్గురు భద్రతా సిబ్బంది గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దాడి జరిగిన కొద్ది రోజులకే ఇద్దరు ఎస్‌పిఒలు హత్యకు గురయ్యారు. ఈ రెండు ఘటనలపై నేషనల్ కాన్ఫరెన్స్, బిజెపి, కాంగ్రెస్, పిడిపి సహా పలు పార్టీలు తీవ్రంగా ఖండించాయి. శివ సేన డోగ్రా ఫ్రంట్, బజరంగ్ దళ్ వంటి పలు మిత్ర వాద బృందాలు జమ్ములో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. 24 గంటల వ్యవధిలో జరిగిన ఈ రెండు దాడులు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అన్నారు. జమ్ముకశ్మీర్‌ను ఉగ్రవాద రహిత ప్రాంతంగా మార్చామన్న బిజెపి ప్రభుత్వ వాదనలకు ఈ ఘటనలు విరుద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భద్రత, ఉగ్రవాద నిరోధం పేరుతో జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను దూరం చేశారని, అయినప్పటికీ భద్రతా పరిస్థితిలో పెద్దగా మార్పులేమీ లేవని, అది రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగినట్లే ఉగ్రవాద దాడులు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు.



యూరప్‌లో అమెరికా స్థావరాలు దెబ్బతీస్తాం

ఇరాన్ జనరల్ రెజాయీ హెచ్చరిక

హోర్ముజ్‌లో మరో రెండు సూపర్ ట్యాంకర్లు దగ్ధం

టెహ్రాన్:అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడుగా వ్యవహరించి మరో యుద్ధం ప్రకటిస్తే ఈసారి పశ్చిమాసియా నుండి యూరప్ వరకూ ఉన్న అమెరికా స్థావరాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మేజర్ జనరల్ మొహ్సెన్ రెజాయీ హెచ్చరించారు.ఎక్స్‌వేదికగా ఈ మేరకు ఒక పోస్టింగ్ పెడుతూ,ట్రంప్ దుస్సాహసం చేస్తే,యూరప్ వరకూ అమెరికాస్థావరాలు చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయన్నారు.ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధిలో అక్రమ మార్గంలో ప్రయాణం చేస్తున్న మరో రెండు సూపర్ ఆయిల్ ట్యాంకర్లు మందుపాతరలను ఢీకొని దగ్ధమైనట్లు ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్ ప్రకటించింది.ఈ రెండు సూపర్ ట్యాకర్లలోనూ 40 లక్షల బ్యారెళ్ళ చమురు ఉందని,ఈ చమురు అంతా దగ్ధమైపోతోందని పేర్కొంది.హోర్ముజ్ జలసంధిలో ఉన్న దక్షిణం వైపు మార్గం అత్యంత ప్రమాదకరమైనదని పదే పదే తమ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ హెచ్చరించినప్పటికీ శత్రుదేశాన్ని నమ్ముకుని అక్రమ మార్గాలలో ప్రయాణాలు కొనసాగుతూనే ఉన్నాయని,వారికి అనుభవపూర్వకంగా పరిస్థితులు అర్థమవుతున్నాయని ఐఆర్‌జిసి పేర్కొంది.ఇదిలా ఉండగా బుధవారం కూడా హోర్ముజ్ జలసంధిలో రెండు నౌకలు దగ్ధమయ్యాయి.నేవిగేషన్‌ను,నౌక జాడలను తెలియజేసే గుర్తింపు వ్యవస్థలను నిలిపివేసి అడ్డదారిలో ప్రయాణం చేశాయని,ఈ సమయంలోనే మందుపాతరలను ఢీకొన్ని మంటల్లో దగ్ధమయ్యాయని ఐఆర్‌జిసి ప్రకటించింది.ఈ మంటలను ఆర్పేయడానికి అమెరికా నౌకాదళ సహచరులు ఎంతగానో ప్రయత్నం చేశారని,కానీ వారివల్ల కాలేదని,చివరకు వారు నౌకను వదిలివెళ్ళిపోయారని ప్రకటన పేర్కొంది.వాస్తవాలన్నీ కళ్ళాదురుగా సాక్ష్యాల రూపంలో కనిపిస్తున్నాయని,అందువల్ల అమెరికన్ అధికారులు హెలికాప్టర్లు ఎక్కి హోర్ముజ్ జలసంధి దాటి వెళ్ళి మీడియా ఎదుట హంగామా సృష్టించాల్సిన అవసరం లేదని కూడా ఐఆర్‌జిసి హేళన చేసింది.

భారత్-పాకిస్థాన్‌ల మధ్య చర్చలు జరగాలి

• నేషనల్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ ఫరూఖ్ అబ్దుల్లా • బుల్లెట్లు, సైనిక ఘర్షణలతో రాజకీయ వివాదాలను పరిష్కరించలేమని స్పష్టీకరణ

జమ్ము : భారత్–పాకిస్థాన్‌ల మధ్య చర్చలు జరగాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రెసిడెంట్ ఫరూఖ్ అబ్దుల్లా గురువారం గట్టిగా తన స్వరాన్ని వినిపించారు. తూటాలు, సైనిక ఘర్షణలతో రాజకీయ వివాదాలను పరిష్కరించలేమని, శత్రుత్వం ముగిసే వరకూ వేచిచూడకుండా అర్థవంతమైన సంప్రదింపులు ప్రారంభం కావాలని ఆయన ఉద్ఘాటించారు. కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉంది. ఉంటుంది. భవిష్యత్‌లో కూడా అంతర్భాగంగానే ఉంటుంది అని మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా నొక్కిచెప్పారు.'అబ్ ఆప్ ఇంతెజార్ కరేంగే, జబ్ తక్ ఆప్ సబ్‌కే గోలియన్ బంద్ జాయేంగీ, తబ్ తక్ రాత్ హో జాయేగీ' (అందరూ కాల్పులు ఆపే వరకూ వేచిఉంటే, తుపాకీలు నిశ్శబ్దంగా పడిపోయే సమయానికి చాలా ఆలస్యం అవుతుంది) అని అబ్దుల్లా అన్నారు. చర్చలు, తూటాలు ఒకే రోజు సాగలేవన్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ వైఖరికి సంబంధించిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన విశ్రాంత సమాచార అధికారి మదన్ మంటూ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ , పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడి, భారతదేశంలో చర్చలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేయాలని నేషనల్ కాన్ఫరెన్స్ ముఖ్య నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా కోరారు. యుద్ధాలు, సైనిక ఘర్షణలు యుద్ధాన్ని మాత్రమే తెస్తాయని, ఇరాన్, ఉక్రెయిన్‌లలో కొనసాగుతున్న వినాశనాన్ని ఉదహరిస్తూ ఫరూఖ్ అబ్దుల్లా పేర్కొన్నారు. చర్చలు, పరస్పర సహకారం ద్వారా మాత్రమే శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని నొక్కిచెప్పారు. 'సార్క్ ' (ఎస్ఎఐఆర్‌సి) పునరుద్ధరణకు పిలుపునిస్తూ, ప్రాంతీయ దేశాలు ఏకం కావాలాని, తమ విభేదాలను పరిష్కరించుకుని, సమష్టి పురోగతి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. సహకారం ద్వారా ఉమ్మడి భవిష్యత్‌ను నిర్మించుకుంటున్న మాజీ ప్రత్యర్థులకు యురోపియన్ యూనియన్(ఇయు)ను ఆయన ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. రెండు రోజుల వ్యవధిలో కుల్గాం, కిష్ట్వార్ జిల్లాలలో జరిగిన జంట ఉగ్రదాడులలో ఇద్దరు ప్రత్యేక పోలీస్ అధికారులు (ఎస్‌పిఒలు) ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనపై స్పందిస్తూ, కశ్మీర్‌ను ఆక్రమించుకోవాలనే దురాశలు ఉన్నవారు అటువంటి ఆలోచనలు విడనాడాలని, ఉగ్రవాదం తన కుతంత్రాలలో ఎప్పటికీ విజయం సాధించలేదని నొక్కిచెప్పారు. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందన్న ఢిల్లీ వాదనలపై ఫరూఖ్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తంచేశారు. ఇటీవలి సంఘటనలు ఆ ముప్పు ఇంకా కొనసాగుతోందని సూచిస్తున్నాయన్నారు. దానిని నిర్మూలించడానికి పటిష్ఠమైన చర్యలు అవసరమని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు.'ఇలాంటి ఘటనలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని నేను ఇదివరకే చెప్పాను. తదుపరి దాడి ఎక్కడ జరుగుతుందో ఎవరికీ తెలియదు' అని మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్లా ఆందోళన వ్యక్తపరిచారు.

టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ నివాసం వద్ద

బుల్డోజర్ మోహరింపు

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించిన మున్సిపల్ కార్మికులు



కోల్‌కతా : మమతాబెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను పశ్చిమబెంగాల్‌లోని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వారికి చుక్కలు చూపిస్తోంది. కోల్‌కతాలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ నివాసం వెలుపల గురువారం ఒక బుల్డోజర్‌ను మోహరించారు. పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తోందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఒక తాత్కాలిక వెదురు షెడ్డును, ఇనుపగేటును తొలగించేందుకు మునిపల్ కార్మికులు ఈ బుల్డోజర్‌ను మోహరింపజేశారు. మునిసిపల్ కార్మికులు బుల్డోజర్‌తో తాత్కాలిక నిర్మాణాన్ని కూల్చివేస్తుండగా, కాళీ ఘాట్ రోడ్ 121 వద్దనున్న టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసం వెలుపల భారీ సంఖ్యలో కోల్‌కతా పోలీసులను, కేంద్ర బలగాలను మోహరించారు.అనంతరం కార్మికులు వెదురు కర్రలను తొలగించి, కాలిబాటను శుభ్రం చేశారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించారన్న ఆరోపణల నేపథ్యంలో, నివాస ప్రాంగణం ప్రహారీగోడ వెలుపల అమర్చిన ఇనుపగేట్‌ను కూడా గ్యాస్‌కట్టర్‌తో తొలగిస్తున్నారు. ఈ పరిణామంపై టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ, బుల్డోజర్లు తన గొంతును నొక్కలేవని, తన సంకల్పాన్ని విచ్ఛిన్నం చేయలేవని బెనర్జీ గర్జదస్వరంతో ఉద్ఘాటించారు. బెంగాల్ బిరోధీలకు (బెంగాల్ వ్యతిరేకులు) వ్యతిరేకంగా నా పోరాటాన్ని కొనసాగిస్తాను. నా చివరి శ్వాస వరకూ నేను వెనకడుగు వేయలేను. అంగుళం కూడా వెనక్కి తగ్గేదే లేదు' అని డైమాండ్ హార్బర్ ఎంపి అయిన అభిషేక్ బెనర్జీ తన 'ఎక్స్' పోస్ట్‌లో స్పష్టంచేశారు. కాగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దిలీప్ ఘోష్ పురపాలక సంస్థ తీసుకున్న చర్యను సమర్థించారు. పొరుగు ప్

మిసిసిప్పీలో చరిత్ర సృష్టించిన స్కాట్ కొలమ్

బద్దలైన 140ఏళ్ళ రిపబ్లికన్ల కంచుకోట
సెనేటర్‌గా మొదటి నల్లజాతీయుడు ఘన విజయం
అలాస్కాలో హోరాహోరీ
కొనసాగుతున్న కౌంటింగ్



జాక్సన్ : అమెరికా మిసిసిపి రాష్ట్రంలో సెనేటర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి స్కాట్ కొలమ్ (43)విజయం సాధించి చరిత్ర సృష్టించారు. సంప్రదాయబద్ధంగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులనే మిసిసిపి ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు. కానీ ఈసారి వచ్చిన ట్రంప్ వ్యతిరేక సునామీ కారణంగా గడచిన 140 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి ఒక నల్ల జాతీయుడు సెనేటర్‌గా విజయం సాధించడం ద్వారా రిపబ్లికన్ల కంచుకోటలో డెమోక్రాట్లు తమ జెండా పాతి చరిత్ర సృష్టించారు. ఈ సందర్భంగా టూగాలూ పాఠశాల ప్రాంగణంలో కొలమ్ విజయోత్సవ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది గుమిగూడి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ''మిత్రులారా! ఇదంతా చేసింది నేను కాదు, మనందరం చేశాం, నేను నమ్మకాన్ని కోల్పోలేదు'' అని ఆయన తన ప్రసంగం ప్రారంభించారు. నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కలర్డ్ పీపుల్ (నాక్‌సిపి) బోర్డు చైర్మన్ లియోన్ రస్సెల్ స్పందిస్తూ, ఈ విజయం పూర్తిగా నల్లజాతి సమాజ కృషి ఫలితమని వ్యాఖ్యానించారు. డబ్బు పెద్దగా ఖర్చుపెట్టకపోయినా ఇది వ్యవస్థీకృత విజయమన్నారు. ఈ సందర్భంగా అక్కడ వేలాదిమంది ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ అభినందనలు తెలియజేసుకున్నారు. నవంబరు మూడో తేదీన జరిగిన మధ్యంతర ఎన్నికల కౌంటింగ్ కొనసాగింపులో కొలమ్ విజయం ఖరారైంది.ఈ విడత ఎన్నికల్లో అనేకమంది నల్లజాతీయులు గవర్నర్లుగా,సెనేటర్లుగా, దిగువసభ సభ్యులుగా గెలిచి చూపించి అమెరికా చరిత్రను తిరగరాశారు. ఈ ఫలితాల పరంపరలో భాగంగా స్కాట్‌కొలమ్ విజయం చరిత్రలో నమోదైంది. లెక్కించిన దాదాపు 10 లక్షల ఓట్లలో ప్రస్తుత సెనేటర్‌గా కొనసాగుతున్న రిపబ్లికన్‌పార్టీకి చెందిన సిండీ హైడ్ స్మిత్‌పై 5000 కంటే తక్కువగానే ఓట్ల ఆధిక్యత కొలమ్ సంపాదించారు.సిబిఎస్ గణాంకాల ప్రకారం స్కాట్ కొలమ్ 49.2 శాతం ఓట్లతో విజయం సాధించగా, స్మిత్ 48.7 శాతం ఓట్లు పొందారు. ఒక స్వతంత్ర అభ్యర్థికి 2.1శాతం ఓట్లు లభించాయి.స్మిత్ ఎక్స్‌వేదికగా కోలమ్‌కు అభినందనలు తెలియజేశారు. మిసిసిప్పీ ఓటర్ల నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని చెప్పారు.దీంతో మొత్తం 100 మంది సభ్యులున్న సెనేట్‌లో డెమోక్రాట్లకు 55 స్థానాలు దక్కినట్లవుతుంది. ఈ మధ్యంతర ఎన్నికల్లో కేవలం 35 సెనేట్ స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి.డెమోక్రాట్లు ఈసారి గెలుచుకున్న సెనేట్ స్థానాలన్నీ రిపబ్లికన్లు పోగొట్టుకున్నవే.ఇంకా అలాస్కాలో కూడా డెమొక్రాట్లకు,రిపబ్లికన్లకు మధ్య హోరాహోరీ పోరాటం జరుగుతోంది. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

స్కాట్ కొలమ్ ఎవరంటే... మిసిసిప్పీరాష్ట్రం కొలంబస్‌లో 1982 డిసెంబరు 24న స్కాట్ కొలమ్ జన్మించారు. ఆయన న్యాయవాది.రాజకీయవేత్త. నల్లజాతీయుల హక్కులకోసం ఆయన పోరాడుతున్నారు.మిసిసిప్పీ పునర్నిర్మాణకాలం తర్వాత అక్కడి నుండి సెనేట్‌కు ఎన్నికైన మొట్టమొదటి నల్లజాతీయుడు ఆయనే. 2016 నుండీ ఆయన మిసిసిప్పీ జ్యుడీషియల్ డిస్ట్రిక్ట్ అటార్నీగా సేవలు చేస్తున్నారు.స్వల్ప ఆధిక్యంతో రిపబ్లికన్ అభ్యర్థి స్మిత్‌పై సెనేటర్‌గా గెలిచారు.డెమోక్రాట్ల తరపున 1874లో చివరి సారి నల్లజాతీయుడు బ్లాంచే బ్రూస్ సెనేటర్‌గా మిసిసిప్పీ నుండి విజయం సాధించి ప్రాతినిధ్యం వహించారు.ఆ తర్వాత మళ్ళీ ఇన్నాళ్ళకు 2026లో స్కాట్ కొలమ్ విజయం సాధించి చరిత్రలో పేరు నమోదు చేసుకున్నారు.కొలమ్ తండ్రి విల్బర్ కొలమ్ కూడా న్యాయవాది. న్యాయవాది పట్టా చదువుకు ముందుగా ఆయన గయానాలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు.2011 నుండి 2016 వరకూ ఆయన లా ఫర్మ్ నిర్వహించారు.కొలంబస్ నగరానికి పార్ట్‌టైమ్ సిటీ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు.ఆయనే సిటీకి మొదటి నల్లజాతీయుడైన ప్రాసిక్యూటర్.దాదాపు 30 సంవత్సరాలు పదవిలో కొనసాగిన ఆల్‌గుడ్‌ను ఓడించి మిసిసిప్పీ 16వ డిస్ట్రిక్ట్ అటార్నీ పదవిని గెలుచుకున్నారు.

రష్యా–ఉక్రేన్ అధ్యక్షులతో చర్చలు కొనసాగింపు

భద్రతా డిమాండ్లే కీలకం : సెర్గీ ర్యాబ్కోవ్

మాస్కో : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధాన నగరం అబుధాబిలో రెండురోజులపాటు జరిగిన చర్చలు ఎలాంటి ఫలితం లేకుండా ముగిసినప్పటికీ మధ్యవర్తి దేశం అమెరికా ప్రతినిధులు రష్యా–ఉక్రేన్ దేశాధ్యక్షులతో తమ సంభాషణలు కొనసాగిస్తున్నారు. ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఇద్దరూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో సంభాషణలు చేసేందుకు గురువారం మాస్కో చేరుకున్నారు.ఆయనతో సంభాషణలు పూర్తిచేశారు. రష్యా విదేశాంగ శాఖ ఉపమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కార చర్చల్లో రష్యా భద్రతకు సంబంధించిన డిమాండ్లే అత్యంత కీలకమైనవని, వాటిని విస్మరించడం సాధ్యంకాదని అన్నారు. నాటో విస్తరణ నియంత్రణ,సంఘర్షణకు మూలకారణాలను పరిష్కరించడం ఎంత ముఖ్యమో రష్యా భద్రత డిమాండ్ కూడా అంతే ముఖ్యమైనదన్నారు. ఈ ఇద్దరు సంధానకర్తలతో తొలుత తాను ప్రాథమిక చర్చలు జరిపినట్లు క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉషకోవ్ చెప్పారు. ఉక్రేన్ చుట్టూ ఉన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పుతిన్‌తో చర్చలు జరిగాయన్నారు. ఈ చర్చలు యుద్ధ పరిష్కారానికి సంబంధించినవేనని నిర్ధారించారు. తర్వాత వారు దబ్లిన్ వెళ్ళి అక్కడ ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం జరుపుతారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించి,ఒక సమగ్ర శాశ్వత శాంతియత పరిష్కారం సాధించాలని మధ్యవర్తి ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. కాగా, రష్యా ప్రాదేశిక డిమాండ్లపైన,ఉక్రేన్‌కు సంబంధించిన తూర్పు డాన్‌బాస్ ప్రాంతం నుండి సైన్యం ఉపసంహరణపైన ఈ చర్చల్లో ఎలాంటి ఫలితాలు రాలేదని జెలెన్‌స్కీ తరపు ప్రతినిధి బుడనోవ్ చెప్పారు. 2024 నుండి రష్యా బలగాలు యుద్ధం ద్వారా స్వాధీనం చేసుకోవడంలో విఫలమైన తూర్పు ఉక్రేన్ ప్రాంతాన్ని స్వాధీనం చేయాలని పుతిన్ చేస్తున్న డిమాండ్‌ను జెలెన్‌స్కీ పదే పదే తిరస్కరిస్తూ వస్తున్నారు. యుద్ధానంతర పరిస్థితులపై రెండు దేశాలకు చాలా స్పష్టత ఉందని జారెడ్ కుష్నెర్ వ్యాఖ్యానించారు.

ఇండోనేసియా ఉపాధ్యక్షుడి రాజీనామా

జకర్తా : ఇండోనేసియా ఉపాధ్యక్షుడు గిబ్రాన్ రకబుమింగ్ రకా(39)పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను దేశాధ్యక్షుడు ప్రబువో సుబియంతో ఆమోదించారు. ఇండోనేసియా మాజీ అధ్యక్షుడు జోకో విడోడో కుమారుడే రకా. ఇయన విద్యార్హతలకు సంబంధించిన వివాదాలలో ఇటీవల న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఆయన ఉపాధ్యక్ష పదవిలో కొనసాగే నైతిక అర్హతలపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. దీంతో పదవికి రాజీనామా చేశారు. విదేశాలలో ఆయన సంపాదించిన విద్యార్హతలు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా లేవని దేశ రాజ్యాంగ న్యాయస్థానం గతనెలలో తీర్పు చెప్పింది. ఎనిమిది పార్టీలకు చెందిన 120మంది చట్టసభ్యులు చేసిన డిమాండ్ ఆయన అభిశంసనకు దారితీసింది. దేశ అత్యున్నత చట్టసభ పీపుల్స్ కన్సల్టేటివ్ అసెంబ్లీ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. తన నివాసంవద్ద ఆయన తండ్రి విడోడో పాత్రికేయులతో మాట్లాడుతూ, రాజకీయ పదవులలో చలనశీలత ఎప్పుడూ ఉంటుందని, రాజకీయ పదవులు తాత్కాలికమైనవని తన కుమారుడికి ముందుగానే తాను చెప్పానని అన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాలకు సంబంధించిన కార్యక్రమాలకు తాము దేశాధ్యక్షుడు ప్రబుబో సుబియంతోకు మద్దతు ఇస్తామన్నారు.
దేశాధ్యక్షుడి టెలిఫోన్ సంభాషణలను ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఐతే రకాపై వచ్చిన విద్యాపరమైన ఆరోపణలకు, దీనికి మధ్య ఎలాంటి సంబంధం లేదు. తొలుత ఆయన దేశాధ్యక్షుడితో సమావేశమై రాజీనామా సమర్పించారు. పదవి నుండి వైదొలగడం ద్వారా గొప్ప ధైర్యాన్నీ, బాధ్యతనూ, రాజనీతిజ్ఞతను ప్రదర్శించారని ఈ సందర్భంగా సుబియంతో ఆయనను ప్రశంసించారు. గడచిన రెండు సంవత్సరాలలో ఆయన 35 రాష్ట్రాలలో పర్యటించారని, 303 ప్రభుత్వ ప్రాజెక్టులను, 149 ఏజన్సీలను తనిఖీ చేశారని, ఎంతో కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. ఇండోనేసియా రాజ్యాంగం ప్రకారం ఉపాధ్యక్షుడు రాజీనామా చేస్తే వెంటనే ఎన్నికల అవసరం ఉండదు. 60రోజుల వ్యవధిలో చట్టసభ మరొకరిని ఎన్నుకుంటుంది.
సుదీర్ఘమైన రాజకీయ వివాదానికి తాను దూరంగా ఉండదలచుకున్నాననీ, దీనికి తెర దించడంకోసమే రాజీనామా చేస్తున్నానని చెప్పారు. దేశ విస్తార ప్రయోజనాలు ఆశించి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

నేపాల్‌లో 13 మంది దుర్మరణం

కాఠ్మండు : నేపాల్‌లో ఒక బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు దుర్మరణంపాలయ్యారు. మకవన్‌పూర్‌జిల్లా భీమ్‌ఫేడీ గ్రామీణ మునిసిపాలిటీ ఛిసపనిఘుడిలో గురువారం తెల్లవారుజామున 5.45గంటలకు బస్సు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ బస్సు కాఠ్మండు నుండి సర్లాహికి వెళుతుండగా అదుపుతప్పి 300 మీటర్ల లోతులో ఉన్న లోయలో పడిందని జిల్లా అధికారులు చెప్పారు. హిందువుల ఉత్సవం ఛాత్‌లో పాల్గొన్ని ఇళ్ళకు తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది.



చైనా ప్రజాస్వామ్య విప్లవ మార్గదర్శకుడు సన్ ఎట్–సేన్

160వ జయంతి సభలో జిన్‌పింగ్ విప్లవ జోహార్లు

బీజింగ్ : చైనా జాతిపిత, విప్లవ పోరాట పితామహులలో ఒకరైన సన్–ఎట్–సేన్ వారసత్వ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్ళాలని చైనా అధ్యక్షుడు, పార్టీ సర్వాధినేత జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. సన్ ఎట్–సేన్ చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా,సైనిక కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. బీజింగ్ గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో గురువారం జరిగిన సన్ ఎట్–సేన్ 160వ జయంతి సభలో సన్ ఎట్–సేన్‌కు జిన్‌పింగ్ విప్లవ జోహార్లు అర్పించారు. ఒక వైద్యుడుగా ఆయన స్ఫూర్తిని అనుకరించాలని, ఒక గొప్ప దేశాన్ని నిర్మించుకోవాలని కోరారు. సుసంపన్నమైన చైనా నిర్మాణానికి ఆయన పాఠాలు నేర్చుకోవాలని,ఆయన దేశభక్తిని పుణికిపుచ్చుకోవాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు. సత్యాన్వేషణకు,సైద్ధాంతిక అన్వేషనకు తన జీవితాన్ని అంకితంచేశారని పేర్కొంటూ చైనా దేశ అవసరాలకు అనుగుణంగా మార్క్సిజాన్ని మలచుకునేందుకు కొత్త అధ్యాయాలను లిఖించడం కొనసాగించాలని కోరారు. ఆయనను గొప్ప జాతీయ వీరుడుగా,దేశభక్తుడుగా అభివర్ణించారు. చైనా ప్రజాస్వామ్య విప్లవానికి ఆయనే గొప్ప మార్గదర్శకుడని పేర్కొన్నారు. ఆయన విప్లవ స్ఫూర్తితో జాతీయ పునరుజ్జీవనానికి కృషి చేయాలని,ఆధునిక పునరుజ్జీవనం ప్రారంభమైన తర్వాత నిర్వచించిన జాతి కలల సాఫల్యానికి ఉమ్మడి కృషి కొనసాగించాలని కోరారు.ఆయన ప్రారంభించిన విప్లవ ఆశయానికి కమ్యూనిస్టులు దృఢమైన మద్దతుదారులు, విశ్వసనీయమైన సహచరులు,నమ్మకమైన వారసులని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. వంద సంవత్సరాలకుపైగా, చైనా జాతి చరిత్రలో ఒక వైభవోపేతమైన చరిత్రను లిఖించడంలో చైనా కమ్యూనిస్టుపార్టీ గొప్పపాత్ర నిర్వహించిందని చెప్పారు. సన్ ఎట్–సేన్ 1866లో గువాంగ్‌డాంగ్ రాష్ట్రం జియాన్ షాన్‌లో జన్మించారు.చైనాలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న రాచరిక వ్యవస్థను నిర్మూలించడానికి 1911లో విప్లవానికి నాయకత్వం వహించారు.ఆయన 1925లో కన్నుమూశారు. ఆయన చైనాదేశ తొలి అధ్యక్షుడు,జాతి నిర్మాత.క్వింగ్ రాజవంశాన్ని కూలదోయడంలో కీలకపాత్ర వహించి విప్లవాన్ని ముందుకు నడిపించారు.తైవాన్ జలసంధికి ఇరువైపులా ఉన్న చైనా ప్రజలు ''తైవాన్ స్వాతంత్ర్యం''అనే దేశ వ్యతిరేక,వేర్పాటువాద శక్తుల కుట్రలను ప్రతిఘటించాలని,ఈ విషయంలో ప్రజలు చేతులు కలపాలని కోరారు. సన్ఎట్–సేన్ ఎల్లప్పుడూ జాతి ఐక్యతనే కోరుకున్నారని,దేశ వ్యతిరేక శక్తులను నిర్వ్వంద్వంగా ప్రతిఘటించారని గుర్తుచేశారు.



ఏకపక్షంగా విలీన నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర భాగస్వాములతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా 10 ప్లస్ 2 విద్యా విధానం తీసుకొచ్చిందని డెమెక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) ఆక్షేపించింది. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు అందరితో చర్చించాలని, జిఒ 25ను సవరించాలని, జిఒ నంబర్1కు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతివ్వడాన్ని ఆపాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సోమయ్య, టి.లింగారెడ్డి, అకడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి.రామకృష్ణ మాట్లాడుతూ విద్యా రంగంలో ఎప్పటికప్పుడు రావాల్సిన మార్పులు, ఉపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలో శాస్త్రీయ, సహేతుకమైన ప్రాతినిధ్యాలతో చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తిస్తూ, తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో డిటిఎఫ్‌కు సభ్యత్వం కల్పించిందని హర్షం వ్యక్తం చేశారు.ఇందుకు సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్య, కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అందించాలని, ఉపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలని, అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా ఉండాలని వారు కోరారు. ఈ సమావేశంలో డిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు కె.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు వి.రాజిరెడ్డి, టి.శ్రీశైలం, చాపబాబుదొర, పి.సృజన, కార్యదర్శులు ఎం.సామ్యూల్, జె.రామస్వామి, ఎ.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

విలీనానికి ముందు సమస్యలు పరిష్కరించండి

ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నామని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. ఇంటర్మీడియట్ ను పాఠశాల విద్యలో విలీనం చేసినంత మాత్రాన విద్యార్థుల సంఖ్య పెరిగిపోదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందబోదని, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని నియంత్రించకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీర్చకుండా, ఉపాధ్యాయులు, అధ్యాపకుల మధ్య ఉత్పన్నమయ్యే సర్వీసు సమస్యలను పరిష్కరించకుండా ఇంటర్మీడియట్ ను పాఠశాల విద్యలో విలీనం చేసినందువల్ల కలిగే ప్రయోజనం పెద్దగా ఉండబోదని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

హువాంగ్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ఆయనపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. కంపెనీలోని ఆయనతో కలిసి పనిచేసే మహిళా ఎగ్జిక్యూటివ్‌తో కూడా హువాంగ్ సంబంధం పెట్టుకున్నాడని న్యూయార్క్ టైమ్స్ పత్రిక మరో వార్త ప్రచురించడంతో పరిస్థితి మరింత తీవ్రగా మారింది. కంపెనీ షేర్లు గురువారంనాడు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో పదీశాతం పడిపోయాయి.ఎన్‌విడియా బోర్డు అత్యవసర సమావేశం నిర్వహించి ఆయనను తొలగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇదే సమయంలో సిఇఓ పదవికి టిమ్ కుక్,రెనాహోన్ పేర్లు బోర్డు పరిశీలిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి..సింగపూర్ కేంద్రంగా పనిచేసే మెగాస్పీడ్ ఇంటర్నేషనల్ కంపెనీలో అలియా హువాంగ్(హువాంగ్ లే)ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.అలియా–జూన్సెన్ వాంగ్ మధ్య సంబంధం ఉందని,అలియా నేరుగా చైనాకు రహస్య సమాచారం అందిస్తోందని అమెరికా నిఘా సంస్థలు గతనెలలో కనుగొన్నట్లు టైమ్స్ పత్రిక పేర్కొంది.ఐతే జూన్సెన్ హువాంగ్ నిర్దోషి అని తాను భావిస్తున్నానని,ఎఫ్‌బిఐ దర్యాప్తు ప్రారంభించిందని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు.

గిగ్ కార్మికులతో కలిసి భోజనం చేసిన మంత్రి వివేక్

కొండాపూర్‌లో గిగ్ వర్కర్లతో ముఖాముఖి.. పని ఒత్తిడి, సమస్యలు, సంక్షేమంపై ఆరా

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : నిత్యం ప్రజలకు సేవలందిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిగ్ కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం కొండాపూర్‌లోని అజ్జీలో గిగ్ వర్కర్లతో సమావేశమయ్యారు. వారితో కలిసి భోజనం చేస్తూ పని పరిస్థితులు, పని ఒత్తిడి, ఎదురవుతున్న సమస్యలు, సంక్షేమ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్మికులు విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పని వేళలు, ఒత్తిడి, హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వారి అభిప్రాయాలు, సూచనలను మంత్రి ఆసక్తిగా విన్నారు. గిగ్ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.
కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్, యూనియన్ సభ్యులు సైడ్ అబ్దుల్ రవూఫ్, సతీష్‌కుమార్, కేకేసీ కౌశల్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఇప్పటివరకు డిజిపి (శాంతిభద్రతలు)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను నియమించారు. మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డిజిపిగా డాక్టర్ సౌమ్య మిశ్రాకు బాధ్యతలు అప్పగించారు. జైళ్లు, దిద్దుబాటు సేవల డిజిపిగా స్వాతి లక్రాను నియమించారు. ఎసిబి డిజిగా చారు సిన్హా కొనసాగనుండగా,సిఐడి డిజిపి అదనపు బాధ్యతలను కూడా ఆమెకే అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టిసి) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ అనిల్‌కుమార్‌ను నియమించారు. అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవల విభాగం డిజిగా వి.సి. సజ్జనార్‌కు బాధ్యతలు అప్పగించారు. పౌరసరఫరాల కమిషనర్‌గా నాగిరెడ్డిని నియమించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆపరేషన్స్ విభాగం డిజిగా విక్రమ్ సింగ్ మాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. ఐపిఎస్ బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డాక్టర్ సౌమ్య మిశ్రా	జైళ్లు, దిద్దుబాటు సేవల డిజి	భరోసా డిజి
స్వాతి లక్రా	డిజిపి హోంగార్డ్స్	జైళ్లశాఖడిజి
మహేశ్ ఎం భగవత్	శాంతిభద్రతల డిజి	హైదరాబాద్ సిపి
చారు సిన్హా	సిఐడి, ఎసిబి డిజి	సిఐడి, ఎసిబి డిజి
డాక్టర్ అనిల్‌కుమార్	గ్రేహౌండ్స్ డిజి	ఆర్‌టిసిఎండి
వి.సి సజ్జనార్	హైదరాబాద్ సిపి	ఫైర్ డిజి
వై. నాగిరెడ్డి	ఆర్‌టిసి ఎండి	సివిల్‌సప్లై కమిషనర్
సంజయ్‌కుమార్ జైన్	ఎస్‌పిఎఫ్ అదనపు డిజిపి	ట్రైనింగ్ అదనపు డిజిపి
విక్రమ్‌సింగ్ మాన్	ఫైర్ డిజి	గ్రేహౌండ్స్ డిజి
ఎం. స్టీఫెన్ రవీంద్ర	సివిల్ సప్లై డిజి	రైల్వే డిజి
ఆకున్ సబర్వాల్	వెయిటింగ్	అదనపు డిజిపి
ఎస్. చంద్రశేఖర్ రెడ్డి	మల్టీజోన్1 ఐజి	ఎసిబి డైరెక్టర్
కార్తికేయ	ఇంటెలిజెన్స్ ఐజి	మల్టీజోన్1ఐజి
కె. రమేష్ నాయుడు	రైల్వే ఐజి	రైల్వే ఐజి
డి. జోయల్ డేవిస్	ట్రాఫిక్ జాయింట్ సిపి	ట్రాఫిక్ జాయింగ్ సిపి
జి. చందన దీప్తి	ట్రాఫిక్ అడ్మిన్ జాయింట్ సిపి	ఫ్యూచర్‌సిటీ ట్రాఫిక్
ఆర్. భాస్కరన్	ఇంటెలిజెన్స్ డిఐజి	ఇంటెలిజెన్స్ డిఐజి
కె. నారాయణ నాయక్	సిఐడి డిఐజి	డిఐజి జోన్2
ఎల్.ఎన్. చౌహాన్	వెయిటింగ్	డిఐజి కోఆర్డినేషన్
శ్రీబాలాదేవి	వెయిటింగ్	టిఎంఎఆర్‌ఎస్ డిడి
వి. అరవిందబాబు	వెయిటింగ్	ఐటి డిసిపి హైదరాబాద్ సిటీ

ప్రత్యేక పార్లమెంట్ !

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం పొందుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అవసరమైన సంఖ్యాబలం తమకు ఉందని ప్రభుత్వం నమ్ముతోందని ఆ వర్గాలు పేర్కొన్నప్పటికీ, ఈ ప్రత్యేక సమావేశం ఎప్పుడు జరుగుతుందనే తేదీలను లేదా దాని వ్యవధిని వెల్లడించలేదు. ఈ క్రమంలో హోంమంత్రి అమిత్ షా పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. కాగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండు వంతుల మెజారిటీ, అంటే 361 ఓట్లు అవసరం. ప్రస్తుతం 543 మంది సభ్యులున్న లోక్‌సభలో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రతిపాదిత సవరణ ద్వారా, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ చేపట్టి, లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి గరిష్టంగా 850కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని వల్ల పార్లమెంటులో, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఏర్పడుతుంది. గతంలో ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సమావేశాల ప్రత్యేక సెషన్‌లో, ఇదే తరహా రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, తగినంత సంఖ్యాబలం లేక అది ఆమోదం పొందలేదు. ఆగస్టు 13న నిరవధిక వాయిదా పడిన వర్షాకాల సమావేశాలు ఇంకా అధికారికంగా ముగియలేదు (ప్రొరోగ్ కాలేదు). ఈ సమావేశాలు ఇప్పటివరకు 91 రోజుల పాటు ముగింపు ప్రకటన లేకుండా కొనసాగుతున్నాయి. ఇది 2008లో నమోదైన 87 రోజుల రికార్డును అధిగమించింది. ఇప్పటికే జరుగుతున్న సమావేశాల కొనసాగింపుగా అదనపు సెషన్ నిర్వహించాలంటే కనీసం రెండు రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది, అదే కొత్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం అధికారికంగా ముగించకపోవడంతో, ప్రతిపాదిత సవరణను చర్చించేందుకు సమావేశాలను పొడిగించవచ్చని లేదా ప్రత్యేక సమావేశం నిర్వహించవచ్చని ఊహాగానాలు మొదలయ్యాయి.

2029 పార్లమెంటు ఎన్నికల లోపు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస

అండర్–19 ఆసియా కప్ ఫైనల్‌కు భారత్

పాక్‌తో పోరుకు సిద్ధం



అండర్–19ఆసియా కప్ 2026లో భారత యువ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బౌలింగ్‌లో సత్తా చాటిన భారత కుర్రాళ్లు.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ అదరగొట్టి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. దాంతో ఫైనల్‌లో పాకిస్థాన్‌తో తలపడనున్నారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణిత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. నోమన్ సలార్జాయ్ (51), షా ఫైసల్ రహీమీ (51) అర్ధశతకాలతో రాణించారు. సుభ్వాన్ జఖైల్ 31 పరుగులు చేశాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ మూడు వికెట్లు పడగొట్టగా ఆర్యన్ సాన్వాని రెండు వికెట్లు తీశాడు. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 36.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ లక్ష్య రాయ్చందానీ (93) అద్భుత ఇన్నింగ్స్తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ (51) అర్ధశతకంతో రాణించగా.. వీకే వినీత్ (57 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. యశ్వర్ధన్ చౌహాన్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్(3/43) మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవ్వాని(2/29) రెండు వికెట్లు పడగొట్టాడు. కావ్య పరేష్ పటేల్, యశ్వర్ధన్ చౌహన్, అర్జున్ రాజ్పుత్ తలో వికెట్ తీసారు.

ఫైనల్లో సత్తా చాటుతాం..

అండర్19 ఆసియా కప్ 2026 ఫైనల్లో మెరుగైన ప్రదర్శన చేస్తామని భారత కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయ్చందాని అన్నాడు. పాకిస్థాన్‌తో జరిగే ఈ ఫైనల్ రసవత్తరంగా ఉండబోతుందని చెప్పాడు. ఈ మ్యాచ్ కోసం అందరూ ఎదురు చూస్తున్నారని, పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలిచే ప్రయత్నం చేస్తామని తెలిపాడు. గురువారం జరిగిన సెమీఫైనల్ విజయానంతరం మాట్లాడిన లక్ష్య.. అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతోనే ఈ గెలుపు సాధ్యమైందని చెప్పాడు.'సెంచరీ చేజారినందుకు నిరాశగా ఉంది. కానీ జట్టు గెలిచినందుకు సంతోషంగా ఉంది. నా సెంచరీ కంటే ఈ విజయమే ముఖ్యం. నేను కేవలం స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడానికి, పరిస్థితికి తగ్గట్టుగా ఆడేందుకు ప్రయత్నించాను. అది బాగా పనిచేసింది. మరోసారి టాస్ ఓడిపోవడం మాకు కలిసొచ్చిందనే అనుకుంటున్నా. కానీ మా బౌలర్లు నిజంగా అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఈ మ్యాచ్ మేం నిలకడగా రాణించాం. ఆటలో పైచేయి సాధించాలంటే సుదీర్ఘ సమయం నిలకడను కొనసాగించాలి. ఫైనల్లో మేం మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నా.'అని లక్ష్య రాయ్చందాని చెప్పుకొచ్చాడు.



అండర్–16లో సూర్యాపేట, హన్మకొండ జట్ల జోరు


బెల్లంపల్లి, ఆదిలాబాద్ జట్లు ఘన విజయం..

రెండో రోజు నాలుగు మ్యాచ్‌ల్లో యువ క్రికెటర్ల ప్రతిభ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/ హైదరాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిఎసి) ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్16 రాష్ట్ర స్థాయి క్రికెట్ లీగ్ ఫేజ్1 రెండోరోజు యువ క్రికెటర్లు సత్తా చాటారు. సూర్యాపేట, హన్మకొండ, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జట్లు ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించి ఘన విజయాలు సాధించాయి. సూర్యాపేట జట్టు భూపాలపల్లిపై 75 పరుగుల తేడాతో గెలిచింది. పెండ్ర విఘ్నేష్ 66 పరుగులతో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. హన్మకొండ జట్టు వరంగల్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. బెల్లంపల్లి జట్టు ఆర్మూర్‌పై 62 పరుగుల తేడాతో గెలుపొందగా, దుర్గం విరాట్ నాలుగు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. ఆదిలాబాద్ జట్టు నిర్మల్‌పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. హిరణ్య దోక్వాల్ మూడు వికెట్లు తీసి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.కాగా, మ్యాచ్‌లను టిసిఎ జనరల్ సెక్రటరీ ధరం గురువా రెడ్డి, శాట్స్ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, టిసిఎ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుజ్జ యుగంధర్‌రావు సందర్శించి క్రీడాకారులను అభినందించారు. పట్టుదలతో ఆడి లక్ష్యాలను సాధించాలని సూచించారు. త్వరలోనే టిసిఎకు బిసిసి గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి



ప్రపంచంలోని పలు ప్రధాన నగరాలు దశాబ్దాల క్రితం కంటే సగటున సంవత్సరానికి ఒక శాతం అధిక డిగ్రీల ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. యుకె కేంద్రంగా పని చేస్తున్న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఇడి) పరిశోధకుల తాజా విశ్లేషణ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ నివేదికను అనుసరించి, ఐఐఇడి పరిశోధకులు 1994 నుండి ఇప్పటి వరకు, ప్రధాన రాజధానులుసహా 43 కీలక నగరాల ఉష్ణోగ్రతా గణాంకాలను విశ్లేషించారు. 35 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న నగరాల సుంఖ్య గత 31 ఏళ్లలో 26శాతం పెరిగినట్టు తేలింది. 1994 – 2003 మధ్య ఇలాంటి రోజులు సగటున 1,062 కాగా, 2015–2024 మధ్య ఈ సంఖ్య 1,335 రోజులకు పెరిగింది. 2013 తరువాత జనాభా కనీసం 50 శాతం పెరిగిన నగరాలలో ఢిల్లీ ఒకటి. ఈ నగరంలో వేడి ఒత్తిడి మరింతగా పెరుగుతున్నట్టు నివేదిక హెచ్చరించింది. ప్రత్యేకంగా, అనధికార వసతి ప్రాంతాల్లో నివసించే వారు అధిక ఉష్ణోగ్రతలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నారని, నాసిరకం గృహ నిర్మాణం, మౌలిక వసతుల లోపం వంటి సమస్యలే ఇందుకు ప్రధాన కారణమని ఈ పరిశోధన పేర్కొంది. ఇక్కడ 2024లో 1,612 తీవ్ర వేడి రోజులు నమోదయ్యాయి. ఇప్పటివరకు నమోదైన అత్యధిక వేడి రోజుల జాబితాలో ఇదే గరిష్టం. ఇది రెండవ స్థానంలో ఉన్న 2019 కంటే 196 రోజులు, 1994 కంటే 52 శాతం ఎక్కువ. అత్యధిక వేడి రోజులు ఉన్న మూడు సంవత్సరాలు గత ఆరు సంవత్సరాల్లోనే ఉండడం గమనార్హం. మొదట 2024, తర్వాత 2023, తర్వాత 2019 సంవత్సరాల్లో ఈ రికార్డులు నమోదయ్యాయి. అంటానానారివో (మడగాస్కర్), కైరో (ఈజిప్టు), జోహానెస్‌బర్గ్ (దక్షిణాఫ్రికా), కిన్షాసా (కాంగో), మనిలా (ఫిలిప్పీన్స్), రోమ్ (ఇటలీ), టోక్యో (జపాన్), వాషింగ్టన్ డీసీ (అమెరికా), యౌండే (కెమరూన్) లాంటి నగరాలు 2024లో రికార్డు స్థాయిలో అత్యంత తీవ్రమైన వేడి రోజులను ఎదుర్కొన్నాయి. కాప్30 ఆతిథ్యమిస్తున్నబ్రెజిల్ రాజధాని బ్రసీలియాలో 1994–2003 మధ్య 35 డిగ్రీలకు పైగా కేవలం 3 రోజులు ఉండగా, తాజా దశాబ్దంలో అది 40 రోజులకు పెరగడం గమనార్హం. చల్లటి వాతావరణం కోసం ప్రసిద్ధి చెందిన సావో పాలోలో 2024లో కూడా 30 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న 120 రోజులు నమోదయ్యాయి. ఇది అధ్యయన కాలంలో గరిష్టం. కాగా, యూరప్‌లో కూడా వేడి రోజులు పెరుగుతున్నట్టు అధ్యయనం తెలిపింది. రోమ్(ఇటలీ)లో 1994–2003 మధ్య సగటున 11 రోజులు ఉండగా, గత దశాబ్దంలో అది 24 రోజులకు పెరిగింది. అదే విధంగా మాడ్రిడ్ (స్పెయిన్)లో గతంలో 25 రోజులు ఉండగా, 2015–2024 మధ్య అది 47 రోజులకు చేరింది. బెర్లిన్ (జర్మనీలో కూడా తీవ్ర వేడి రోజులు పెరిగాయి. మొత్తం మీద ఈ నివేదికను అనుసరించి, ప్రపంచ ఉష్ణోగ్రతలు ప్రభుత్వాలు ఊహించిన దానికంటే వేగంగా పెరుగుతున్నాయి. సరైన విధంగా మార్పులు చేయకపోతే, కోట్లాది నగర నివాసులు వేడిగాలుల కారణంగా అసౌకర్యకరమైన, ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం తీవ్రతరం చేస్తుంది. పేదలు ఎక్కువగా నష్టపోతారు. ఈ పరిస్థితి లండన్, లువాండా లేదా లిమా.. ఎక్కడైనా ఒకటే. గ్లోబల్ సౌత్లోని తక్కువ ఆదాయ, ప్రణాళిక లేని వసతి ప్రాంతాల్లో గృహ నాణ్యత, మౌలిక వసతుల లోపం కారణంగా ప్రభావం మరింత తీవ్రంగా ఉండవచ్చు. నగరాలు వెంటనే నిధులను సమకూర్చుకుని భవనాల్లో ఇన్సులేషన్, గాలి ప్రసరణ మెరుగుపరచడం, హీట్ యాక్షన్ ప్లాన్లు రూపొందించడం, నీడ కోసం చర్యలు తీసుకోవడం అవసరం. కొత్త నిర్మాణాలు కూడా వేడి వాతావరణాన్ని తట్టుకునేలా ఉండాలి. ఈ విశ్లేషణ ప్రకారం, ప్రపంచ అర్బన్ జనాభాలో మూడో వంతు మంది అనధికార నివాస ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరే అత్యధికంగా వేడిగాలులకు గురవుతున్నారు. అధ్యయనం చేసిన 43 నగరాల కలిపి జనాభా సుమారు 470 మిలియన్లు, గ్రామీణ ప్రాంతాలు కూడా రాబోయే దశాబ్దాల్లో ఇది మరింతగా పెరుగుతుందని అంచనా.

అత్యంత వేడి సంవత్సరాల జాబితాలోకి '2026'



ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) ఇటీవల విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ది క్లైమేట్ అప్‌డేట్' నివేదిక ప్రకారం, 2026 ప్రపంచ చరిత్రలో అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. రికార్డులు నమోదైన గత నాలుగు సంవత్సరాలు అత్యంత వేడి సంవత్సరాల జాబితాలో మొదటి నాలుగు స్థానాలను ఆక్రమించాయి. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రపంచ సగటు ఉపరితల ఉష్ణోగ్రత పారిశ్రామికీకరణకు ముందు కాలంతో పోలిస్తే 1.47 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. ఇదే సమయంలో ఎల్ నినో పరిస్థితులు బలపడుతున్నాయి. 2026 డిసెంబర్ నాటికి ఇది మరింత తీవ్రంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచ ఉష్ణోగ్రతలను మరింత పెంచి, కొన్ని ప్రాంతాల్లో కరువును, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలను తీవ్రతరం చేయవచ్చు. సముద్ర జలాల ఉష్ణోహీమా నీసదాలు కరుగుతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు తీరప్రాంత నగరాలు, వ్యవసాయం, మంచినీటి వనరులు, జీవవైవిధ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి కర్బన ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాన్ని పెంచడం, ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం అత్యవసరమని డబ్ల్యుఎంఒ స్పష్టం చేసింది.

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం

ఎఐటియుసి డిమాండ్

సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, వినతిపత్రాలు అందజేత





ప్రజాపక్షం/కోదాడ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, శానిటేషన్, పేషెంట్ కేర్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌లకు వినతిపత్రాలు అందజేశారు. సూర్యాపేట జిల్లా కోదాడలో మెడికల్ కాంట్రాక్ట్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించి అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరధనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్టు కా ర్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిం చాలని, కార్మిక చట్టాల ప్రకారం పండుగ సెలవు లు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులను అమలు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం బోనస్ చెల్లించాలని, ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫారాలు అందించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కార్మికుల వేతనాల నుంచి మినహాయిస్తున్న ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తాలను సంబంధిత ఖాతాల్లో సక్రమంగా జమచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎస్‌కె రఫీ, బాధావత్ బాలునాయక్, నాగరాజు, తిరపమ్మ, వెంకమ్మ, సరోజని పాల్గొన్నారు.

మంచిర్యాల : మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాను డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఒ టి.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలిందర్ అలీ ఖాన్, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు రాయమల్లు, మధు, సువర్ణ పాల్గొన్నారు.

మావల : ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరా దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం రిమ్స్ ఆస్పత్రి ఎదుట యూనియన్ నాయకులు నల్ల శివన్న, డోంగ్రే చందు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జి.సంగీత, ఎండి ఖాసీం, నిట్యాడి నగేష్, ముజీబ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద నుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బండారి హరీష్, మారవేని మహేష్, సూపర్‌వైజర్ నాగరాజు, ఉదయ్, పద్మ, రవి, సుమలత, పవిత్ర పాల్గొన్నారు.

గద్వాల రూరల్ : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశన్న, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు సూపర్‌వైజర్స్ భాషా, నాగరాజు, లక్ష్మణ్, చామంతి, భాషా, చిట్టెమ్మ, అమరేష్, ఇంద్రమ్మ, జయమ్మతో పాటు ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, వెంకటేష్, ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

కాగజ్ నగర్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో కాగజ్ నగర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నాయకులు తిరుమల, మీనాక్షి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

భూపాలపల్లి : ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి జిల్లా నాయకు లు, సిపిఐ కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఎఐటియుసి అధ్యక్షుడు బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శానిటేషన్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.









ఆసుపత్రి కార్మికుల వేతనాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ కార్మికుల కొత్త టెండర్లు వెంటనే వేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలియజేసి అనంతరం ఆర్ఎంఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి ఆసుపత్రిలో కొత్త టెండర్లు వేయాల్సి ఉన్నప్పటికీ నాలుగు సంవత్సరాలు దాటినా నేటికీ కొత్త టెండర్లు వేయకుండా పాత టెండర్లతోనే కొనసాగించడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో ఆసుపత్రి కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడం విచారకరమన్నారు. కార్మిక చట్టాల ప్రకారం మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని, ప్రతి సంవత్సరం బోనస్ ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, 1వ తారీఖున వేతనాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.ఎల్లమ్మ, పద్మ, భాగ్యమ్మ, ఉషమ్మ, నాగమణి, లక్ష్మి, ఇందిర, రజియా బేగం, సుశీల, మంగమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'యాదాద్రి'ని కరువు జిల్లాగా ప్రకటించాలి

కలెక్టరేట్ ఎదుట సిపిఐ ధర్నా



ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లాను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో అప్పుల భారంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులందరికీ వరి ఎకరాకు రూ.30వేలు, పత్తి, కంది ఎకరాకు రూ.50వేలు, ఇతర వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని, రైతులకు అవసరమైన సహాయచర్యలు చేపట్టాలని, రైతులకు పంట రుణాలు వాయిదా వేస్తూ వడ్డీ మాఫీ చేసి రీషెడ్యూల్ సౌకర్యం కల్పించాలని, సాగునీరు మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎఒ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోలగాని సత్యనారాయణ, చేదే చంద్రయ్య, గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏశాల అశోక్, పేరబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : కూచిపూడి పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నట్లు కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కూచిపూడి గ్రామంలో రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గ్రామ సర్పంచ్ కాసాని సంధ్యా వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో కూచిపూడి, కాపుగల్లు, యతిరాజాపురం తండ పరిధిలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. ముఖ్యంగా చాలాకాలంగా ఎదురవుతున్న లోఓల్టేజి సమస్యకు పరిష్కారం లభించడంతోపాటు గృహ, వ్యవసాయ విద్యుత్ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం 1,140 గృహ విద్యుత్ కనెక్షన్లు, 1,184 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017వ సంవత్సరంలో మహిళపై దాడి కేసులో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మొహమ్మద్ ఉమర్ గురువారం నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో నిందితుడైన కోదాడ మండలం, భీక్యాతండకు చెందిన బానోతు వెంకన్న నేరం చేసినట్లు నిర్ధారణ కావడంతో న్యాయస్థానం శిక్ష విధించింది. ఇట్టి కేసు స్వభావం, నిందితుడి వయస్సు, సంఘటన జరిగినప్పటి నుండి సుమారు 9 సంవత్సరాల కాలం గడిచిన విషయాలను పరిగణనలోకి తీసుకొని నిందితుడికి ఐపిసి సెక్షన్ 354 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా, ఐపిసి సెక్షన్ 448 కింద 6 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొంది. ఈ కేసులో న్యాయస్థానం తరపున ప్రభుత్వ న్యాయవాది కె.కళ్యాణి, కేసుకు సహకరించిన కోదాడ రూరల్ ఎస్ఐ ఎస్‌కె యాకూబ్, కోర్టు కానిస్టేబుల్ నరేష్‌లను అధికారులు ప్రశంసించారు.

కనీస వేతనం నెలకు రూ. 26వేలు

మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో దేవరకొండ ఏరియా ఆసుపత్రి కార్మికులు ధర్నా



ప్రజాపక్షం/దేవరకొండ : ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26వేలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. గురువారం మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో దేవరకొండ ఏరియా ఆసుపత్రి కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, మూడు సంవత్సరాలకు ఒక సారి శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటి కార్మిక వేతనాలు పెంచే వారు కానీ ఈ సారి నాలుగు సంవత్సరాలు దాటిన వేతనాలు పెంచలేదని రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు డ్యూటీలో జాయిన్ అయిన వారికి కనీస వేతనం రూ. 16వేలు చెల్పించాలని జీవో నెంబర్ ఆరు జారీ చేసిందని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఉద్యోగులు గత పది సంవత్సరాల నుండి 20 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉద్యోగులకు న్యాయమైన పద్ధతిలో నెలకు రూ. 26వేలు చెల్లించాలని అన్నారు.ఆగస్టు 8న డిఎంఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినప్పుడు ప్రతి నెల ఒకటోవ తేదిన వేతనాలు చెల్లిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పత్రికల ద్వారా ప్రకటించారని కానీ వేతనాలు ఒకటవ తేదిన చెల్లించడం లేదని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రాములు, మండల కార్యదర్శి మల్లయ్య, కార్మికులు రామేశ్వరమ, శారద, తారమ్మ, ప్రణయ్, పద్మ, వనజ, శ్రీను, అంజి, లక్ష్మ మ్మతదితరులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలి



ప్రజాపక్షం/ రామన్నపేట: ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పుల/నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచేందుకు వైద్యులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డిసిహెచ్ఎస్ వై. సూర్యశ్రీరావు సూచించారు. గురువారం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. వార్డులలో ఓపి విభాగంలో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వైద్య సేవలు, ప్రసవాల పరిస్థితి వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గురువారం ఒక్కరోజే ఆస్పత్రిలో ఐదు కాన్పులు నిర్వహించడం పట్ల వైద్యులను అభినందించారు. రోగులకు అందుబాటులో ఉంటూ ఇంకా మెరుగైన మంచి సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. గర్భిణులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందిస్తూ, సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రేడియాలజిస్ట్ లేకపోవడం వల్ల స్కానింగ్ కు గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడుతున్నారని వైద్యులు ఆమె దృష్టికి తీసుకురాగా త్వరలోనే రేడియాలజిస్టును నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకే బియ్యం అమ్మకాలు

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరకే బియ్యం అమ్మకాలకు భువనగిరి పట్టణంలోని రైతు బజార్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబజార్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ లో ప్రభుత్వ ధరకే కింది రకాల బియ్యం అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ధరల వివరాలలోకి వెళితె బీపీటీ బియ్యం కిలో 66 రూపాయలకు, తెలంగాణ సోనా కిలో 74రూపాయలు, జేఎస్ఆర్ బియ్యం కిలో 79రూపాయలకు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలియజేశారు.

ఎస్‌టి కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఆయుధం

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/దేవరకొండ : షెడ్యూల్డ్ తెగల ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎస్సీ, ఎస్టి) ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఒక ఆయుధం అని, తెల్ల కాగితంపై తమ సమస్యలను రాసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే డైరీ నెంబర్ కేటాయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్ ఇచ్చారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని వెంకట్‌తండా, బొల్లిగుట్ట తండా, కాచారం గ్రామాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించారు. ఆయా గ్రామాలు, తండాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, రహదారుల సమస్యలు, విద్యుత్, భూముల పట్టాలు తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎస్టీ ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నామని అన్నారు. మైనింగ్ సమస్యలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వర వెంగమాంబ మైనింగ్ కార్యకలాపాలపై ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని, మైనింగ్ వల్ల కలుగుతున్న ప్రభావాలను పరిశీలించాలని, ఫోటోలు, వీడియోలతో సహా నివేదికలు సిద్ధం చేసి ఐదు రోజుల్లో సమర్పించాలని సూచించారు. పోలీస్, ఫారెస్ట్, మైనింగ్, వైద్య శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలపై సమగ్ర నివేదిక 15 రోజుల్లో అందించాలని ఆదేశించారు. కాచారం గ్రామంలో మైనింగ్‌కు సంబంధించిన సమస్యలపై గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. సమ్మె విరమణ కోరుతూ ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం కొండమల్లేపల్లి మండల పరిధిలోని గాజీ నగర్ గ్రామంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ కళ్యాణ్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు, డిటిడివో కమలాకర్ రెడ్డి, ఆర్డివో వనజరాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, డిఎంహెచ్‌వో రాహుల్, ఎంపిడివో పార్వతి, సర్పంచ్‌లు భీముడు, బుజ్జి, హరిలాల్, శ్యామలయ్య పాల్గొన్నారు.

రైతులందరూ సహకరిస్తేనే భూ సమస్యలకు పరిష్కారం

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి :కలెక్టర్



ప్రజాపక్షం/మునుగోడు : భూముల రీ సర్వేకు రైతులందరూ సహకరిస్తేనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనిజిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సింగారం గ్రామస్తులకు సూచించారు.మండలంలోని సింగారం గ్రామంలో అధికారులు చేపట్టిన భూముల రీ సర్వేపై జారీ చేసిన నోటీసులకు వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికై ఆ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు.ఈ గ్రామ సభకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించడం జరిగిందని, గ్రామ కంఠం సరిహద్దులు,ప్రభుత్వ భూములు,రహదారులు,పట్టా భూములు అన్నింటినీ సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగిందని, గ్రామంలో మొత్తం 255 భూ తాలు ఉండగా,417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎం)లు ఇవ్వడం జరిగిందని,వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు స్థానిక తహసిల్దార్ నేలపట్ల నరేష్, చండూరు ఆర్‌డిఓ శ్రీదేవిలు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టాల ప్రకారమే భూములకు హద్దు లు నిర్ణయించి ఇవ్వాలని, అన్నదమ్ముల భూముల పంచాయతీకి సంబంధించి తేడాలు వచ్చిన కేసులు,భూమి ఉండి పట్టా లేని కేసులు, నక్షా మ్యాపు, సర్వే మ్యాపులలో తేడాలు,అసైన్డ్ భూములు,పట్టా భూముల వివాదాల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రీ సర్వే చట్టం ప్రకారం ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని,చట్ట ప్రకారమే రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెల్లడించారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,తహసిల్దార్ నేలపట్ల నరేష్,సర్పంచ్ కుంభం అండాలు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో అధిక ఆదాయం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ (ఆత్మకూర్(ఎన్)) : వరి సాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుతో అధిక ఆదాయం పొందుతు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రైతు సామా ఉపేందర్ రెడ్డి. ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు రెవెన్యూ పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు గత యాసంగి సీజన్‌లో తనకున్న భూమిలో 2 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరాకు 10 కిలోల విత్తనాన్ని వినియోగించి, సాగుకు సంబంధించిన పెట్టుబడి ఖర్చులను జాగ్రత్తగా నిర్వహించారు. ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల దిగుబడిని సాధించి క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున విక్రయించి మొత్తం రూ.1,92,000 స్థూల ఆదాయాన్ని పొందారు. ఎకరాకు మొక్కజొన్న సాగుకోసం విత్తన ఖర్చు రూ.3,500, దున్నకం ఖర్చు రూ.5,000, ఎరువుల ఖర్చు రూ.3,200, పురుగుమందుల పిచికారి రూ.3,500, కోత ఖర్చు రూ.3,000, మొత్తం పెట్టుబడి రూ.18,200 అయినట్లు తెలిపారు. రెండు ఎకరాలు సాగు చేయగా మొత్తం స్థూల ఆదాయం రూ.1,92,000 కాగా పెట్టుబడి రూ.36,400 పోగా నికర ఆదాయం రూ.1,55,600 పొందారు. గత యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగు ద్వారా సాధించిన దిగుబడి, వచ్చిన ఆదాయం పట్ల రైతు సంతృప్తి వ్యక్తం చేశారు. వరి సాగుతో పోలిస్తే మొక్కజొన్న సాగు తనకు మంచి ఆర్థిక ఫలితాలను అందించిందని గుర్తించారు. ఈ అనుభవంతో ప్రేరణ పొంది, ప్రస్తుత సాగు సీజన్‌లో మరో 6 ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని మొక్కజొన్న పంటగా మార్చుకున్నారు. తద్వారా మొక్కజొన్న సాగును మొత్తం 8 ఎకరాలకు విస్తరించి, తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందే దిశగా అడుగులు వేస్తున్నారు. నీటి వనరుల లభ్యత, సాగు ఖర్చులు, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని ఉపేందర్ రెడ్డి కోరారు. ముఖ్యంగా యాసంగి సీజన్‌లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతోపాటు మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

సర్వేల్ గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండలం సర్వేల్ లో గురుకుల పాఠశాలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతి భోజన సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించి, క్రీడలపై కూడా ఆసక్తి చూపే విధంగా చూడాలని అధ్యాపకులకు సూచించారు. ఎలొనినో ప్రభావం వల్ల గ్రామాలలో ఏర్పడనున్న నీటి ఎద్దడిని నివారించేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. అదేవిధంగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తెలిపారు. స్వయంగా విద్యార్థులతో డిజిటల్ క్లాసులను, విద్యార్థులకు చదివించి మాట్లాడి సంతృప్తి చెందారు. ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని సూచించారు. సంస్థాన్ నారాయణపురం గ్రామం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి కలెక్టర్ ను కలిసి చారిత్రాత్మక కట్టడాలను చూపించి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఆయన వెంట డిఇఓ భిక్షపతి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ పల్నాటి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ గోలి శ్రీనివాస్, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, సీఐ మన్మధ కుమార్, ఎస్సై ఎస్ పాండు, గ్రామ సర్పంచ్ చిలకరాజు చందన రాజు, ఆర్ఐ కట్ట పాండు, జిపిఓ పుందరీకం, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల కొత్త సొసైటీ టిఎఫ్‌టిల లైసెన్సులను మంజూరు చేయాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి



ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లాలో గీత కార్మికుల నూతన సొసైటీలు,టిఎఫ్‌టి లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి మంజూరు చేయాడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆరోపించారు.రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయంలో కొత్త దరఖాస్తులకు సంబంధించిన ఫైళ్లు మాయమవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని,అధికారులు తక్షణమే స్పందించి అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గురువారం ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న గీత కార్మికుల సొసైటీ లకు,టిఎఫ్‌టీ లైసెన్సులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.వన సంరక్షణ ,పర్యావరణ పరిరక్షణతోపాటు గీత కార్మికుల జీవనోపాధికి ఉపయోగపడేలా విస్తారంగా తాటి ఈత ఉత్పత్తి చెట్లను నాటేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తాటి పండ్ల గుజ్జుతో వివిధ ఉత్పత్తులను తయారు చేసేందుకు నల్లగొండ జిల్లాలో ప్రత్యేక ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీత కార్మికులకు చెట్లను కేటాయించే సమయంలో చెట్టు యజమానులకు, కార్మికులకు మధ్య వివాదాలు తలెత్తకుండా స్పష్టమైన విధివిధానాలను అమలు చేయాలని సూచించారు.గీతా కార్మికులకు మోపెడ్లు, బైకులు అందించి వారి వృత్తికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. మరణించిన గీత కార్మికుల కుటుంబాలను 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఇచ్చి ఆదుకోవాలి అని అన్నారు.గీత కార్మికుల సంక్షేమం,ఉపాధి భద్రతకు 1000 కోట్ల నిధిని ఏర్పాటు చేయాలి అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకర్,జోగు సురేందర్,మాధగోని మల్లయ్య,ఎరుకల నిరంజన్,పశువుల దేవేందర్,గుండాల సత్తయ్య,గంట సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత


ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. గురువారం తెల్లవారుజామున యాద్గార్‌పల్లి గ్రామ శివారులో మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఉప్పు నగేష్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో కామేపల్లిగూడెం మూసీ వాగు నుండి మిర్యాలగూడ వైపు దొంగతనంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, యజమాని అయిన తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన గాదె రవిపై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా అక్రమ ఇసుక రవాణాదారులను బైండోవర్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

యుఎఇలో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)లో నిర్మాణ రంగంలో ఉద్యోగాల భర్తీకి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.సాహితి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. యూఏఈలో నిర్మాణ రంగానికి సంబంధించి జనరల్ హెల్పర్స్ (సాధారణ సహాయకులు),షటరింగ్ కార్పెంటర్లు,స్టీల్ ఫిక్సర్లు,మేసన్ల పోస్టుల భర్తీ చేపట్టనున్నారు.అభ్యర్థుల వయస్సు 22 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి రెండేళ్ల ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాలు నెలకు రూ.27 వేల నుంచి రూ.34 వేల వరకు వేతనం ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ తరఫున ఉచిత విమాన టికెట్,వసతి,రోజుకు మూడు పూటల భోజనం,రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనే ఆసక్తి,అర్హత కలిగిన అభ్యర్థులు 8035524946 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు

జిల్లా ఎస్పి కె. నరసింహ



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తు చేపట్టి నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎస్పి కె. నరసింహా ఆదేశించారు. పోలీసు అధికారుల నెలవారీ సమీక్షలో భాగంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తులో నాణ్యత, పెండింగ్ కేసుల పరిష్కారం, ఎన్‌బిడబ్ల్యు ఎగ్జిక్యూషన్, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజాభద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తీవ్రమైన, అతి తీవ్రమైన, మిస్సింగ్, ఎన్‌బిడబ్ల్యు కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసుల ఛేదన, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే పోలీసులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని నేరాలు తగ్గుతాయని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం రహత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం కింద జిల్లాలో 38 ఆసుపత్రులను గుర్తించారన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సత్యయ్య, డిఎస్పి ప్రసన్న కుమార్, సైబర్ సెక్యూరిటి సెల్ డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దుంఅలీ, జిల్లా ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, వెంకటయ్య, ఉపేందర్ రావు, రాజశేఖర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన ఆసరా చేయూత పింఛన్ల సందడి

నల్లగొండ జిల్లాలో 32,995 దరఖాస్తులు...

29,303 మంది అర్హులు

ప్రజాపక్షం/నల్లగొండ: ఏళ్ల తరబడి ఆసరా చేయూత పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. నూతనంగా ఆసరా చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేయాలని సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ)ఆదేశాలు జారీ చేసింది.ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షం లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు.

జిల్లాలో 32,995 దరఖాస్తులు : నల్లగొండ జిల్లాలో నూతన ఆసరా చేయూత పింఛన్ల కోసం మొత్తం 32,995 దరఖాస్తులు వచ్చాయి.వీటిని సంబంధిత అధికారులు పరిశీలన కోసం వివిధ స్థాయిలకు పంపించారు. వెరిఫికేషన్ అధికారి స్థాయిలో 29,303

వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే నాయిని



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 58వ డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ, వడ్డేపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన దక్షిణ ప్రాకార సాలాహార ప్రతిష్ఠ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు మరింత ఆహ్లాదక రంగా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా దేవాలయాన్ని తీర్చిదిద్దుకోవడం సంతోషకరమన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సూచించిన విధంగా ఆలయ ద్వారం వద్ద, వెనుక భాగంలో శంఖు, చక్రాల ప్రతిమలతో సుందరంగా తీర్చిదిద్దితే ఆలయానికి మరింత ప్రత్యేకత చేకూరుతుందని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి అవసరమైన పనుల కోసం ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి నిధుల మంజూరుకు అవసరమైన ఆమోద ప్రక్రియను వెంటనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, సుధాకర్, నాయకులు నేహాల్, సమ్మయ్య, మేరి, రాజేందర్, రవీందర్ రెడ్డి, జగన్మోహన్, సోమయ్య, రాజేష్, పి. వేణుగోపాల్, రాజేష్, శ్యామ్ తదితరులతో కలిసి పాల్గొన్నారు.

పేద ప్రజలకు కొండంత అండ సిఎం సహాయనిధి



ప్రజాపక్షం/రాయపర్తి: పేద ప్రజలకు కొండంత అండ సిఎం సహాయనిధి అని పాలకుర్తి ఎంఎల్ఏ మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికి మెరుగైన వైద్యం అందకుండా ఉండకూడదని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ సిఎం సహాయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సిఎం సహాయనిధి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, జాటోత్ హమ్య నాయక్, యాదగిరి, మురళి, నర్సయ్య, భూక్య సమ్మయ్య నాయక్, కళ్యాణ్, స్వప్న సంతోష్, చిర్ర వేణు, గుజే సుధాకర్, నాగరాజు, భూక్య పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజమే కొమరారెడ్డికి నిజమైన నివాళి

సిపిఐ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి



ప్రజాపక్షం/హనన్‌పర్తి: శ్రమ దోపిడీ లేని సమ సమాజాన్ని నిర్మించుకున్నప్పుడే తోకల కొమరా రెడ్డికి నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి తెలిపారు. హనుమ కొండ జిల్లా హనన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో గురువారం తోకల కొమరారెడ్డి 47వ వర్ధంతిని ఆయన కుమారుడు తోకల హంసారెడ్డి, మండల సిపిఐ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ వర్ధంతి సభకు సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, సిపిఐ హనుమ కొండ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి ముఖ్య అతిథులుగా హాజరై కొమరారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రమ దోపిడీ లేని సమ సమాజాన్ని నిర్మించుకున్న అప్పుడే తోకల కొమరా రెడ్డి గారికి నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుమారుడు హంసారెడ్డి ప్రజలకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోకల హంసారెడ్డి, తోకల కార్తీక్ రెడ్డి, ముజ్జిగ పరుశరాములు, కల్వచర్ల వెంకటేశ్వర్లు, ముజ్జిగ అజయ్, నాంపల్లి లక్ష్మ య్య, మల్లారెడ్డి, కొత్తగట్టు శ్యాంసుందర్, నేతకాని రాజయ్య, రాజయ్య, సాంబన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు



ప్రజాపక్షం/తొర్రూరు : రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని చెర్లపాలెం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ఆధ్వర్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం కొనుగోలు కేంద్రాన్ని చెర్లపాలెం గ్రామ సర్పంచ్ ధర్మారపు మహేందర్‌తో కలిసి పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా తాము పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకార సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జినుగ రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పులిగుజ్జ యాకన్న, ధర్మారపు యాకన్న, నాయకులు చిట్టిమల్ల మహేశ్, మహబూబ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఉప్పల్‌రెడ్డి, కిరణ్, సుధాకర్, యాకన్న, పాపయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు
అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/ధర్మసాగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరుకు ఎలాంటి టార్గెట్ లేదని, నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్స్‌లో నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, రాంపూర్ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ.19.43 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు, 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే తుర్కకాశ గ్రామానికి చెందిన 15 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన వివిధ రకాల టూల్ కిట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు. ధర్మసాగర్ మండలంలో కొత్తగా ఐదు కేటగిరీల కింద మొత్తం 729 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో 370 మంది వితంతువులకు రూ.7,45,920,209 మంది దివ్యాంగులకు రూ.8, 39,344,44 మంది ఒంటరి మహిళలకు రూ.88,704, 102 మంది గీత కార్మికులకు రూ.2,05,632, నలుగురు చేనేత కార్మికులకు రూ.8,064 చొప్పున నెలవారీ పింఛన్లు అందున్నాయి. మొత్తం రూ.18,87,664 ప్రతి నెలా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు పింఛన్ల కోసం నాలుగైదేళ్లుగా ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఐదు కేటగిరీల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల పింఛన్లు మంజూరు చేసిందని, ఇప్పటికే ఉన్న పింఛన్లతో కలిపి సుమారు 45 లక్షల మందికి ఏటా రూ.12 వేల కోట్లతో పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఇంకా అర్హులు ఎవరైనా మిగిలిపోతే సర్పంచులు, ఎంపిడిఒలు గుర్తించి దరఖాస్తులు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఇఒ శేషాద్రి, శ్రీనివాస్, తహసీల్దార్ భావ్ సింగ్, ఎంపిడిఒ అ నిల్ కుమార్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పింఛన్ల లబ్ధిదారులు, కల్యాణలక్ష్మి, షాదీ ము బారక్, సిఎం సహాయ నిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఖ్యాతిని చాటిన దీప్తి



ప్రజాపక్షం/హనుమకొండ : జపాన్‌లో ఇటీవల నిర్వహించిన ఆసియా పారా గేమ్స్– 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవంజిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఘనంగా సన్మానించి అభినందించారు. హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దీప్తి జీవంజిని శాలువాలతో సత్కరించి, ఆమె సాధించిన అద్భుత విజయానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్–2026లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి జీవంజి కేవలం 56.36 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు తన ప్రతిభతో రికార్డు సృష్టించడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు గారు పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై తెలంగాణ రాష్ట్రం పేరును మారుమోగించి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన దీప్తి జీవంజి విజయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్రీడాకారిణికి రావాల్సిన బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దీప్తి జీవంజిని తల్లి దండ్రులు, పాల్గొన్నారు.

రూ.3కోట్ల విలువైన బియ్యం పక్కదారి

నిర్వాహకుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడించిన ఎసిపి నర్సయ్య

ప్రజాపక్షం/రాయపర్తి: మూడు కోట్ల పైచిలుకు విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన రైస్ మిల్ నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం వర్ధన్నపేట ఏసిపి అంబటి నర్సయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసిపి అంబటి నర్సయ్య మాట్లాడుతూ 2023–24 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వంతో సక్రమంగా కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం చేసుకొని, ధాన్యాన్ని మర ఆడించి నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి సరఫరా చేయాల్సి ఉందని అన్నారు. ఇదిలా ఉండగా, 2022–2023 రబీ సీజన్‌లో పేదలకు పంపిణీ చేయాల్సిన సిఎంఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లింగ్ కోసం సివిల్ సప్లయి కార్పొరేషన్ ద్వారా నగదు మిల్లుకు కేటాయించారు. ఐకేపి, సొసైటీ కేంద్రాల నుండి మొత్తం 467.426 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులో నిల్వ చేసినట్లు వివరాలు పేర్కొన్నారని, అదేవిధంగా 2023–2024 ఖరీఫ్ సీజన్‌లో మరో 468.708 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుకు కేటాయించినట్లు తెలిపారు. ఈ రెండు సీజన్లకు సంబంధించిన ధాన్యం విలువ మొత్తం 3,03,13,436 రూపాయల విలువైన ప్రభుత్వ బియ్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించారని జిల్లా పౌర సంబంధాల మేనేజర్ సంధ్యారాణి భర్త మహేందర్ ఫిర్యాదు మేరకు పరమేశ్వరి రైస్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు చిర్రా ఉపేంద్ర, పుల్ల ఎల్లగౌడ్, ఆవుల కేశవరెడ్డి, అలువల ప్రభాకర్ రెడ్డి, వంగల నర్సయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

తండ అభివృద్ధికి ఎమ్మెల్యే దొంతి సానుకూల స్పందన

ప్రజాపక్షం/నెక్కొండ: తమ తండ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ వాగ్య నాయక్ తండకు చెందిన ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తండలో నెలకొన్న అభివృద్ధి, కనీస సౌకర్యాలు, చేపట్టాల్సిన పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ బాజు మిట్టు తెలిపారు. ఎంఎల్ ఏను కలిసిన వారిలో ఉప సర్పంచ్ భీమ నాయక్, చిట్టిబాబు, వార్డు సభ్యులు రజిత రవి, కాంగ్రెస్ నాయకులు బట్టు రవి, పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ



కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజాపక్షం/వరంగల్: వరంగల్ ఉర్సులోని మహాత్మా జ్యోతిరావు ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవలు, పౌష్టికాహారం నాణ్యత తీరును పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న ఆహారం, వసతి సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఆహారం అందించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటిస్తూ చలికాలంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురుకులంలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన పిర్యాదుల పెట్టె ద్వారా తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు. ఈ పర్యటనలో బిసి సంక్షేమ శాఖ అధికారి పుష్పలత రెడ్డి ,ప్రిన్సిపాల్ అంజి రెడ్డి పాల్గొన్నారు

విద్యా మౌలిక వసతుల కల్పనకు నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలి : వరంగల్ మండలం కొత్తపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కూల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్శనలో ప్రశాంత్ రెడ్డి, పుష్పలత రెడ్డి, సంబంధిత టీఎస్ ఎంఐడీసీ ఇంజనీర్లు ఇ ఇ అరుణ్ కుమార్, డి.ఇ నరేందర్ పాల్గొన్నారు.

'ఎన్ఎసిఒఎఫ్' కేంద్ర కొనుగోలు విధానాన్ని
ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి

ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై కోతలు విధిస్తూ, అధిక ధరలకు నాసిరకం సరుకులను సరఫరా చేస్తున్న ఎన్ఎసిఒఎఫ్ కేంద్ర కొనుగోలు విధానాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ గతంలో జిల్లా పర్చేస్ కమిటీ ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను కొనుగోలు చేసి విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించేవారని, ప్రస్తుతం ఎన్ఏసీఓఎఫ్ విధానం కారణంగా అధిక ధరలకు నాసిరకం సరుకులు సరఫరా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థులకు అందించే గుడ్లు, అరటి పండ్లు, చికెన్ వంటి పౌష్టికాహార పదార్థాల మెనూలో కోతలు విధించడం అన్యాయమని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో మాదిరిగా జిల్లా పర్చేస్ కమిటీ ద్వారా నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు కొనుగోలు చేసే విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని భాషబోయిన సంతోష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, రామ్ చరణ్, కస్తూరి పవన్ చారి, శాంతికుమార్, కేశవేణి సాత్విక్, రావుల చరణ్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి: ఎమ్మెల్యే రేవూరి



ప్రజాపక్షం/హనుమకొండ : పరకాలలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా పరకాల లోని నూతన వంద పడకల ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొని ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై వైద్యాధికారులతో సమీక్ష చేశారు.సమీక్షకు ముందు..ఆసుపత్రిలోని పలు విభాగాలను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు.ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... పాత భవనం నుండి నూతన భవనానికి బ్లడ్ బ్యాంకును తరలించి, అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సీటీజీ యంత్రం, ఇతర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.వైద్యుల సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గైనకాలజీ వార్డు, లేబర్ రూమ్ లో అవసరమైన సదుపాయాలు కల్పించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఔషధి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రిలో ఓపి/ఐపి సేవల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ఆర్వో వాటర్ ప్లాంట్ ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యులు, అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. పీఎం రాహత్ పథకం గురించి వైద్యాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డివిఎస్ వెంకన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్ఎంవోలు డాక్టర్ నారాయణ రెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, ఇతర వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి: రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులను గుర్తించి వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్ కోసం విశాలమైన, వాహనాల రాకపోకలకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు చొరబడని ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నూతన బస్టాండ్ నిర్మాణ పనులను కూడా ప్రణాళికలో చేర్చాలని ఆదేశించారు. క్తులకు రవాణా, తాగునీరు, పారిశుద్ధం, వైద్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, క్యూఆర్ సంకేతాలు, నగదు రహిత చెల్లింపుల సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పుష్కరాల ఏర్పాట్ల పర్యవేక్షణకు నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేయాలని, సమర్పించిన అంచనాలను పరిశీలించి మార్పులు, చేర్పులతో కూడిన సమగ్ర నివేదికలను శుక్రవారం వరకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నదీ పరిసరాల పరిశుభ్రత, స్నాన ఘాట్ల ఏర్పాటు, నిరంతర తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఆలయాల్లో దర్శన ఏర్పాట్లపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. గోదావరి పుష్కరాలను భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తూ ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య భవనాల పన్ను తగ్గింపుపై పరిశీలన

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయం

కలెక్టర్ హేమంత్ సహదేవరావు



ప్రజాపక్షం/ములుగు: వాణిజ్య భవనాల ఆస్తి పన్నుల తగ్గింపుపై ప్రభుత్వ నిబంధనల మేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో మునిసపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యాపార భవనాల యజమానులతో సమావేశమయ్యారు. యూనిట్‌కు 30 పైసల చొప్పున పన్ను విధించడంతో గతంలో పోలిస్తే భారం పెరిగిందని వ్యాపారుల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. పన్ను తగ్గించాలని కోరారు. జిఓ 230 ప్రకారం క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను నిర్ధారిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెరగడంతో క్యాపిటల్ వాల్యూ కూడా మారుతుందని తెలిపారు. నివాస భవనాల పన్నులో మార్పు లేదని స్పష్టం చేశారు. వ్యాపారుల వినతిని నిబంధనల మేరకు పర

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
13-11-2026
www.prajapaksham.in

రీసెంట్ బ్లాక్ బస్టర్ 'లెనిన్' చిత్రంలో అద్భుతమైన నటనతో కన్నడ నటుడు ప్రమోద్ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. కన్నడలో హీరోగా ప్రమోదికి మంచి క్రేజ్ ఉంది. తెలుగు ప్రేక్షకులకు మాత్రం 'లెనిన్' చిత్రంతో దగ్గరయ్యారు. అలాంటి ప్రమోద్ ఇప్పుడు హీరోగా 'హల్కా డాన్' అంటూ రాబోతోన్నారు.

రీక



'లెనిన్' నటుడు హీరోగా 'హల్కాడాన్'

రీసెంట్ బ్లాక్ బస్టర్ 'లెనిన్' చిత్రంలో అద్భుతమైన నటనతో కన్నడ నటుడు ప్రమోద్ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. కన్నడలో హీరోగా ప్రమోదికి మంచి క్రేజ్ ఉంది. తెలుగు ప్రేక్షకులకు మాత్రం 'లెనిన్' చిత్రంతో దగ్గరయ్యారు. అలాంటి ప్రమోద్ ఇప్పుడు హీరోగా 'హల్కా డాన్' అంటూ రాబోతోన్నారు. కన్నడ, తుళు, తెలుగు భాషల్లో ఈ చిత్రం రానుంది. ఈ క్రమంలో సినిమాకి సంబంధించిన ఫస్ట్ కట్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ పూర్తిగా మాస్, యాక్షన్ లవర్స్‌కి ట్రీట్‌లో ఉంది. మాస్ ఆడియెన్స్‌కి నచ్చే, వారు మెచ్చే ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో టీజర్‌ను కట్ చేశారు. ప్రమోద్ రఫ్ లుక్, బాడీ లాంగ్వేజ్, హావభావాలు అన్నీ కూడా సరికొత్తగా ఉన్నాయి. సరికొత్త మాస్ అవతార్‌లో ప్రమోద్ కనిపించబోతోన్నారు. ఈ చిత్రాన్ని కన్నడ, తుళు, తెలుగు భాషల్లో ఏకకాలంలో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. వీనస్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై శ్రీకాంత్ కేపీ, మాధవ్ సిరాన్, మాసిస్ ప్రొడక్షన్స్ భాగస్వామ్యంతో నిర్మించిన ఈ చిత్రానికి చాల రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అమృత అయ్యంగార్, కోస్తా స్టార్ రూపేష్ శెట్టి ముఖ్య పాత్రలు పోషించారు. ప్రతిష్టాత్మక ఆడియో లేబుల్ డి బీట్స్ ద్వారా విడుదలైన 'హల్కా డాన్' టీజర్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభిస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, మాస్ డైలాగులు, కామెడీ టైమింగ్, ప్రముఖ తారాగణంతో రూపొందిన ఈ చిత్రం గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

కొత్త జీవితం ప్రారంభించేవారికి ఒక సర్టిఫికెట్

'ఇడుపు కాయితం' టీజర్ లాంచ్‌లో డైరెక్టర్ వంశీ

బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్‌టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. గురువారం 'ఇడుపు కాయితం' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వంశీరెడ్డి దొండపాటి మాట్లాడుతూ – ఇండస్ట్రీకి వచ్చి ఒక సినిమా రూపొందించి, అందులో చిన్న శాంపిల్ గా టీజర్ మీకు చూపించాం. మా మూవీ టీజర్ మీకు నచ్చడం హ్యాపీగా ఉంది. ఈ సందర్భంగా నా పేరెంట్స్, టీచర్స్‌తో పాటు నాకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన తబితకి, సుకుమార్‌కి, బన్నీ వాస్‌కి థ్యాంక్స్ చెబుతున్నా. సినిమా చాలా బాగా వచ్చింది. డిసెంబర్ 11న చిత్రాన్ని మీ ముందుకు తీసుకొస్తున్నాం. కొత్త జీవితం ప్రారంభించడానికి ఒక సర్టిఫికెట్ లాగ ఇడుపుకాయితాన్ని భావించాలి అనేది నా ఉద్దేశం. టైటిల్‌ను మీరు అలాగే పరిగణించాలని కోరుతున్నా అన్నారు. నిర్మాత తబిత




సుకుమార్ మాట్లాడుతూ నేను కథను ఎలా విజువలైజ్ చేసుకున్నానో అలాగే రూపొందించారు. ఇది ఒక బ్యూటిఫుల్ స్టోరీ. సినిమా చూసినప్పుడు ప్రతి ఒక్కరూ ఈ కథను రిలేట్ చేసుకుంటారు. నేను ఇక్కడే పుట్టి పెరిగాను కాబట్టి పెళ్లి సంప్రదాయాలు, పెద్దవాళ్లు మాట్లాడుకునే మాటలు, ఆ చర్చలన్నీ ఎలా ఉంటాయో చిన్నప్పుడు చూశాను. అవన్నీ ఈ సినిమాలో మళ్లీ చూశాననే ఫీల్ కలిగింది. డిసెంబర్ 11న రిలీజ్‌కు వస్తున్న మా సినిమాను థియేటర్స్‌లో చూడండి అన్నారు. హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ మా మూవీ నుంచి ఇంకా మంచి సాంగ్స్ రిలీజ్ చేయబోతున్నాం. ఒకదాని కంటే మరొక సాంగ్ బాగుంటుంది. సురేష్ బొబ్బిలి మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా హీరో ప్రియదర్శి, దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఫ్యామిలీ డ్రామాను మించిన డ్రామా మరొకటి ఉండదు. వంశీరెడ్డి సుకుమార్ రైటింగ్స్ లో మరో సినిమా చేస్తున్నాడని చెబుతున్నారు. వంశీ లాంటి మంచి మనసున్న టెక్నీషియన్ తో కలిసి పనిచేశాననే సంతోషం నాలో ఎప్పటికీ మిగిలిపోతుంది. ఇదొక గొప్ప సినిమా అవుతుందని ప్రామిస్ చేస్తున్నా. అలాంటి గొప్ప టీమ్ కూడా ఈ సినిమాకు వర్క్ చేసింది. నాగదుర్గ మంచి డ్యాన్సర్ గానే కాదు మంచి పర్ ఫార్మర్ గా ఈ సినిమాతో పేరు తెచ్చుకుంటారు' అని అన్నారు. కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ , నటుడు విద్యాసాగర్ , నటి విజయ , నటుడు మైమ్ మధు , నటుడు వినోద్ బాల , నటి చంద్రవ్వ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ పాల్గొన్నారు.



27న 'డేంజర్ బాయ్స్' విడుదల

యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'డేంజర్ బాయ్స్' (చాప్టర్ క్లోజ్). వికాస్, రాధాభగవతి, అశ్వని హోసన్ ప్రధాన తారాగణంగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు అభిజిత్ తీర్థహళ్లి రచన, దర్శకత్వం వహించారు. ఈ క్రమంలో సినిమా అధికారిక విడుదల తేదీని ప్రకటిస్తూ మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. నవంబర్ 27వ తేదీన ఈ చిత్రాన్ని థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విడుదలైన పోస్టర్‌లో ప్రధాన పాత్రధారులు రాత్రివేళ దట్టమైన అటవీ ప్రాంతంలో చేతిలో కాగడాలు, లాంతరు పట్టుకుని ఓ మిస్టరీని ఛేదించేందుకు వెతుకుతున్నట్లుగా కనిపించి.. సినిమాపై ఆసక్తిని పెంచేస్తున్నారు. ఉత్కంఠభరితమైన ఈ లుక్ సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను కళ్లకు కడుతోంది.ఈ సందర్భంగా నిర్మాతలో ఒకరైన పూర్ణిమ గౌడ్ మాట్లాడుతూ ''కుటుంబ భావోద్వేగాలతో నిండిన ఒక విలక్షణమైన యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు అభిజిత్ తీర్థహళ్లి ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచారు. ఇందులో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వంద శాతం వినోదాన్ని పంచుతుంది. ఇంతటి మంచి కంటెంట్ ఉన్న సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నందుకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. నవంబర్ 27న థియేటర్లలో విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ చిత్రానికి మ్యూజిక్, సినిమాటోగ్రఫీ: సునాద్ గౌతమ్, రచన – దర్శకత్వం: అభిజిత్ తీర్థహళ్లి, నిర్మాతలు: వి.జి. మంజునాథ్ – పూర్ణిమ గౌడ్.

'రంగు రంగు రంగు పిల్లరో' అంటున్న రాజ్ తరుణ్



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'టార్టాయిస్' సినిమాను ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్వీత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్‌కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందిస్తున్న 'టార్టాయిస్' సినిమా బ్లాక్ బస్టర్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'నీ పరిచయం..' సాంగ్ మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రోజు 'టార్టాయిస్' సినిమా నుంచి 'రంగు రంగు పిల్లరో..' లిరికల్ సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'రంగు రంగు రంగు పిల్లరో..' పాటను మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేయగా, ప్రముఖ జానపద గాయకుడు, కవి పెంచల్ దాస్ లిరిక్స్ రాసి పాడారు. 'రంగు రంగు రంగు పిల్లరో..' పాట ఎలా ఉందో చూస్తే – 'మేడలోన పిల్లవో హో హో, మేడివారి పల్లెలో హో హో, మేడలోన పిల్లఒ హో హో మనసు కరగాదెందుకో, చేతికి కెంపుల గాజులు అరువు తెమ్మన్నాది, ముక్కులోకి ముక్కెరొకటి అడిగి తీసుకున్నాది, చెవుల్లోకి జోడు కమ్మలు అవుసులు నాకన్నాది, ఘల్లుఘల్లు కాలి గజ్జెలు గమనించమన్నాది, మాపటికి రమ్మంటే మాయమాటలు చెప్పుతాది, మాపటికి రమ్మంటే మాయమాటలు చెప్పుతాది, రంగు రంగు రంగు పిల్లరో ఈ వగలాడి, చెంగునెగిరే జింకపిల్లరో..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. ఈ పాటలో మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్, సింగర్, లిరిసిస్ట్ పెంచల్ దాస్ పర్ ఫార్మ్ చేయడం విశేషం.



14న 'జయంత్ అండ్ ది జింగో పెన్'

నామో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తెలుగు ఎక్సురిమెంట్స్ సాయి కృష్ణ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో తణికెళ్ల భరణి, కేఎల్ దామోదర్ ప్రసాద్, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి నిర్మాత దివ్య ప్రవీణ్ బొలిశెట్టి, ప్రవీణ్ బొలిశెట్టి, ఆశిష్ గాంధీ, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, దర్శకుడు నవీన్ దేశబోయిన, మాస్టర్ జయంత్, బేబీ ఊహ,సహ నిర్మాత షఫి, నటుడు కాశీ విశ్వనాథ్ ,నటుడు అశోక్ కుమార్, సత్యం రాజేష్ పాల్గొన్నారు.



డిసెంబర్ 18న 'ఆల్కహాల్'

విభిన్నమైన కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అల్లరి నరేష్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ముఖ్యంగా అల్లరి నరేష్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా స్టైలిష్, సరికొత్త లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు.ఫిబ్రాన్ సంగీతాన్ని అందిస్తుండగా, చేతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బిజు సన్నీ సినిమాటోగ్రఫీ, నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాల్ అబాని ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.

రైతులపై కెటిఆర్‌ది కపటప్రేమ

బీర్ల అయిలయ్య ధ్వజం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడ కెటిఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. రైతులపై కపట ప్రేమ చూపిస్తూ కేటీఆర్ నిర్వహించింది రైతు గర్జన కాదని, అధికార దాహంతో ఏర్పాటు చేసిన సభ అని ఆరోపించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసమే నిర్మించారని విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసినా, ఎత్తిపోకపోయినా తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో పంటలు పండించిందన్నారు. రైతు రుణమాఫీకి రూ.20 వేల కోట్లు, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించామని, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

ఉగ్రవాదుల కోసం గాలింపు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ కుల్గాం జిల్లాలో సిఆర్‌పిఎఫ్ జవాన్ల క్యాంపుపై దాడి చేసిన ఇద్దరు ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు గాలింపు ముమ్మరం చేశాయని అధికారులు తెలిపారు. బుధవారం దక్షిణ కశ్మీర్ జిల్లాలో భారీ ఆయుధాలతో ప్రవేశించిన ఇద్దరు ఉగ్రవాదులు సిఆర్‌పిఎఫ్ జవాన్ల క్యాంపుపై చేసిన దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.దాడి అనంతరం ఉగ్రవాదులు అటవీప్రాంతంలోకి పారిపోయారు. దాడి జరిగిన వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు గాలింపు ముమ్మరం చేశాయి. భద్రత కట్టుదిట్టం చేసి జిల్లాలోని పలు చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల జాడ కనిపెట్టడానికి సాంకేతిక నిఘా ద్వారా కూడా ప్రయత్నిస్తున్నామని వారు వెల్లడించారు.

'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం'...

పథకంతో సత్ఫలితాలు

సివిల్స్ తుది ఇంటర్వ్యూకు 31 మంది ఎంపిక

అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ ఏడాది తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో అత్యధికంగా వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. అదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 18 మంది ఓబీసి వర్గాలకు చెందిన వారున్నారు. ఎస్‌టి అభ్యర్థులు ఇద్దరు, ఎస్‌సి అభ్యర్థులు ముగ్గురు, 8 మంది జనరల్ అభ్యర్థులు ఉన్నారు. సింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల కింద దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల్లో 158 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈసారి ప్రోత్సాహక మొత్తాలను నేరుగా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేశారు. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం. సివిల్ సర్వీసెస్ తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని, ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు.

అభ్యర్థులకు డిప్యూటీ సిఎం అభినందనలు

సివిల్స్ మెయిన్స్‌లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ అభ్యర్థులందరికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఎఐ సలహాలు

(మొదటి పేజీ తరువాయి)

తెగుళ్లను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భారత్ విస్తార్ ద్వారా పంటల సాగుపై శాస్త్రీయ సలహాలు, వాతావరణ సమాచారం, చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, నేల ఆరోగ్యం–ఎరువుల వినియోగంపై సూచనలు, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల సమాచారం రైతులకు అందుబాటులోకి రానున్నాయన్నారు. రైతులు పంటల ఫొటోలు పంపించి సమస్యలను గుర్తించే సలహాలు కూడా పొందవచ్చాని, హెల్ప్‌లైన్ 155261 ద్వారా వాయిస్ సేవలు ఇప్పటికే అందుబాటులో ఉండగా, ఒప్పందం జరిగిన 15–21 రోజుల్లో తెలుగు వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 45–60 రోజుల్లో వాట్సాప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభించనున్నామని, కేంద్ర అనుమతుల అనంతరం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నాలుగు దశల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా జాతీయ స్థాయి చాట్‌బాట్, వాయిస్ సేవలను తెలుగులో అందుబాటులోకి తీసుకొచ్చి, అనంతరం తెలంగాణ వ్యవసాయ పథకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, స్థానిక సాగు సమాచారాన్ని అనుసంధానం చేయనున్నారు. తదుపరి దశల్లో రైతుల దరఖాస్తులు, పథకాల లబ్ధి, చెల్లింపులు, ఫిర్యాదుల స్థితిని కూడా అనుసంధానించనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి.గోపి,ఎన్ఐఎన్‌జి సీనియర్ జనరల్ మేనేజర్ షేక్ రషీద్ భాష తదితరులు పాల్గొన్నారు.

కొహెడ పండ్ల మార్కెట్ పనులు వేగవంతం చేయాలి

కొహెడలో నిర్మిస్తున్న సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం మార్కెట్ నిర్మాణ పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి దశ పనులు పూర్తి చేసి, 2028 జూన్ 2 నాటికి పూర్తి స్థాయి మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో మార్కెట్‌ను నిర్మించాలని సూచించారు. పండ్లను నాణ్యత కోల్పోకుండా నిల్వ చేయడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే సౌకర్యాలు కల్పించాలన్నారు.నిర్మాణ పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత సంస్థపై చర్యలు తీసుకునేలా ఒప్పంద నిబంధనలను సవరించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సూచన మేరకు నిర్మాణ పనుల నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిగా రాహుల్ రాజ్‌ను నియమించారు. రైతులకు ఆధునిక మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంలో కొహెడ మార్కెట్ కీలకంగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు.

కేంద్రంగా సిద్దిపేట

(మొదటి పేజీ తరువాయి)

మార్చాలని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇందుకోసం పార్టీ శ్రేణులు అవసరమగు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేట బిఆర్ఎస్‌కు కంచుకోటగా భావిస్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లాలో పార్టీ భవన్ శంకుస్థాపన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బిఆర్ఎస్ పార్టీలో విభేదాల మూలంగా బయటకు వచ్చిన కవిత మాజీ మంత్రి హరీష్‌రావును టార్గెట్‌గా చేసుకొని పలు విమర్శలు చేసింది. బిఆర్ఎస్ కంచుకోట సిద్దిపేటలోనే మాజీ మంత్రి హరీష్‌రావుపై టార్గెట్ చేస్తారా ? కాంగ్రెస్, బిజెపి నేతలను టార్గెట్ చేస్తారా ? లేక టిఆర్ఎస్ బలోపేతంపై కార్యకర్తల్లో ఉత్తేజం, ఉత్సాహం నింపేలా మాట్లాడుతారా రాజకీయ విశ్లేషకులు పలువిధాలుగా చర్చించుకుంటున్నారు. టిఆర్ఎస్ చీఫ్ కవిత పర్యటనపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

19న సిఎం రేవంత్ రెడ్డి పర్యటన..

ఈనెల 19న గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ గడ్డ సిద్దిపేటలో పర్యటించనున్నారు. బిఆర్ఎస్ కంచుకోట సిద్దిపేట వేదిక నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ఇందిరమ్మ బీమా పథకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ బీమా పథకం ద్వారా పేద కుటుంబాలకు బీమా భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ పథకం ప్రారంభోత్సవానికి సిద్దిపేటను వేదికగా ఎ ంచుకోవడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ తన పథకాన్ని ప్రారంభించి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ఈ భీ మా ద్వారా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించడానికి ఈ పథకాన్ని రూపొందించారు. అలాగే ఇందిరమ్మ చిలకపచ్చ చీరలను సైతం మహిళలను పంపిణీ చేయనున్నారు. ఇంది రమ్మ బీమా పథకం దీని విధివిధానాలు సిఎం ఆ బహిరంగ సభలో ప్రకటించనున్నారు. రేవంత్‌రెడ్డి గతంలో సిద్దిపేట పర్యటన సందర్భంగా రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తానని సిద్దిపేట వేదికగా ప్రకటించారు. రెండవసారి పర్యటనలో నంగునూర్ మండలం రైతులకు రైతుభరోసా నిధులను సైతం విడుదల చేశారు. ఈనెల 19న సిఎం రేవంత్‌రెడ్డి ఏ వరాలు ప్రకటిస్తారో.. ఎవరిపై విమర్శలు గుప్పిస్తారో అని పలువురు చర్చించుకుంటున్నారు. సిద్దిపేటలో బిఆర్ఎస్ క్యాడర్ చేజారకుండ బిఆర్ఎస్వి విద్యార్థి నూతర విభాగాలను ఏర్పా టు చేసి పార్టీని మరింత బలోపేతానికి మాజీ మంత్రి హరీష్‌రావు తనదైనశైలిలో కృషిగచేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి సిఎం రేవంత్‌రెడ్డి, కల్వకుంట కవిత పర్యటనలు సిద్దిపేట రాజకీయాల్లో మరింత కాకను పుట్టిస్తుందని చెప్పక తప్పదు!.

కార్మికుల ధర్నా

<antocr_